

పొదిలిలో నిర్మమహేశ్వరస్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు అశేషంగా తరలివచ్చిన భక్తులు (ఇన్‌సెట్లో) పార్వతీసమేత నిర్మ మహేశ్వరుడు



రమణీయం రథోత్సవం

ప్రముఖ శైవక్షేత్రం పొదిలిలోని శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి రథోత్సవం శనివారం అశేష జనవాహిని నడుమ కనులపండువగా జరిగింది. వేలాదిమంది భక్తులు వెంటరాగా విశేషంగా అలంకరించిన రథంపై గౌరీశంకరులుగా ఆది దంపతులు కొలువు తీరారు. అర్చక స్వాములు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, పురుషులు పోటీపడి రథాన్ని లాగారు. పట్టణంలోని చిన్న బస్టాండ్, పెద్ద బస్టాండ్, నిమ్మయ్య హోటల్, రాఘవేంద్ర సినిమా హాల్ మీదుగా రథోత్సవం సాగింది.

ఆనవాయితీ ప్రకారం కొంతదూరం పోయిన తర్వాత రథాన్ని లాగేందుకు మహిళలకు అవకాశం కల్పించారు. భక్తులు స్వామివారికి బిందెలతో వారు పోస్తూ, కాయకర్పూరంతోపాటు, గుమ్మడికాయలు రథచక్రాల కింద ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పులకించారు.

- పొదిలి



సిద్ధంగా లేం!

గ్రామాల్లో ఎదురుతిరుగుతున్న సర్పంచ్‌లు, పార్టీ నేతలు

దూరంగా ఉండాలని అసంతృప్తి నేతల నిర్ణయం

కందుకూరులో సభకు వెళ్లకూడదని తీర్మానం చేసుకున్న వైసీపీ నేతలు, సర్పంచ్‌లు

ఎమ్మెల్యే మద్దిశెట్టి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి అనుచరుల తీరు అదే

వచ్చేవారికి లిక్కర్ సరఫరా చేస్తూ, మహిళలను వద్దని చెప్తున్న వైసీపీ నేతలు

సిద్ధం సభకు వచ్చేందుకు మేం సిద్ధంగా లేం, ఏం చేశారని రావాలి.. అంటూ గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీ సర్పంచ్‌లు, నాయకులు ఆ పార్టీ నేతలను ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్లయితే రామని తేల్చిచెప్పటమేకాక, ఏకంగా మండలాల వారీ తీర్మానాలు చేసుకుని తెలియజేస్తున్నారు. ఇంకోవైపు వైసీపీలోని అసమ్మతి నేతలు కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వారి అనుచరులు అదేదారిలో ఉన్నారు. భారీగా తాయిలాలు ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలతో జన సమీకరణలో తడబాటుకు గురవుతున్నారు. కందుకూరు మండలంలో 19 గ్రామాల్లో వైసీపీకి ఉన్న సర్పంచ్‌లు, గ్రామస్థాయి నాయకులు తీర్మానం చేసుకునని తెలియజేయగా, దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి అనుచరులు, చీరాలలో ఆమంచి అనుచరులు, మరికొన్ని నియోజక వర్గాల్లో కీలక నాయకులు, వారి అనుచరులు సిద్ధం సభకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

బస్సులన్నీ సిద్ధం సభకు కేటాయించడంతో డిపోలో వేచిఉన్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగసభ ఆదివారం కొరిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలో నిర్వహిస్తున్నారు. హైవేని ఆనుకుని సభ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం ఉదయం 10గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హైవేపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఒంగోలు నుంచి గుంటూరు వరకు సాధారణ ప్రయాణికుల వాహనాలు తిరగకుండా అడ్డుకట్ట వేశారు. ఈ రోడ్డు మొత్తం సిద్ధం సభకు వచ్చే ఆ పార్టీశ్రేణుల వాహనాల కోసమే కేటాయించారు. జిల్లాలో పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని బందోబస్తుకు కేటాయించి స్టేషన్లను ఒకరోజు మూతేసే స్థాయికి తీసుకెళ్లారు. పరోక్షంగా పలు శాఖల ప్రభుత్వ యంత్రాంగం అంతా గత మూడురోజుల నుంచి సిద్ధం సభ ఏర్పాట్లు, జనసమీకరణ ఏర్పాట్లలోనే నిమగ్నమయ్యారు. ఇక ఆదివారం పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులను అటు మళ్లించారు. శనివారం మధ్యాహ్నం నుంచే అనేక డిపోల్లోని బస్సులు సిద్ధం సభ కోసం గ్రామాలకు పంపారు. ఇక భారీగా ప్రజలను తరలించేందుకు అటు పార్టీ నాయకులతోపాటు, వలంటీర్లకు, సాధారణ పార్టీశ్రేణులకు భారీ తాయిలాలు పంచారు. సభకు వచ్చేవారికి ఒక్కొక్కరికి రూ.350 నుంచి రూ.600 వరకు డబ్బులు ఇవ్వటంతోపాటు, బిర్యానీ పొట్లాలను, లిక్కర్ బాటిళ్లు, గ్లాసు, మంచినీళ్ల బాటిల్ కలిపి ప్రత్యేక ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇంతచేసినా ఆశించిన స్థాయిలో ప్రజలు వస్తారన్న నమ్మకం కలగకపోవటంతో శనివారం సాయంత్రం నుంచి ఇచ్చే తాయిలాల మోతాదును పెంచేశారు.

మేం రామంటే రాం...

కాగా గ్రామస్థాయిలోని వైసీపీ సర్పంచ్‌లు, ఓడిపోయి పార్టీ పెత్తనం చూస్తున్న సర్పంచ్ అభ్యర్థులు, ఇతరత్రా అసంతృప్తి ఉన్న నాయకులు సిద్ధం సభకు తాము రామంటే రామని తేల్చి చెప్పేస్తున్నారు. లక్షలు పోసి గెలిస్తే పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోగా మా అధికారాలను కోసేశారంటూ జగన్ పాలన తీరుతెన్నులను ఎండగడుతున్నారు. సర్పంచుల నుంచి ఈ రకమైన వ్యతిరేకత బహిర్గతం కావటంతో వైసీపీ నేతలంతా నిర్ఘాంతపోతున్నారు. మరోవైపు వివిధ కారణాలతో అసంతృప్తితో ఉన్న నేతల అనుచరులు కూడా సభకు రామని తేల్చిచెబుతున్నారు.

కందుకూరులో తీర్మానం చేసిన వైసీపీ నాయకులు

కందుకూరు మండలంలో 19 పంచాయతీల్లో సర్పంచులుగా ఉన్న వైసీపీ నేతలు ఇతర గ్రామాల్లో పార్టీ పెత్తనం చూస్తున్న నాయకులు సమావేశమై, తామే కాకుండా తమ గ్రామాల నుంచి సిద్ధం సభకు ఒక్కరిని కూడా రానివ్వమని తేల్చేశారు. తదనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుని, అందుకు ఒకేబాటలో పయనించాలని తీర్మానించారు. గ్రామాల అభివృద్ధిని జగన్ నిర్లక్ష్యంగా చేయటంతోపాటు ఎమ్మెల్యే మహీధరరెడ్డికి టికెట్ ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్తున్నారు. అంతేకాక మహీధరరెడ్డి నిర్ణయానికి అనుగుణంగా కూడా నడవవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కందుకూరు మండల నాయకులు తీసుకున్న నిర్ణయాలను తెలుసుకుని ఇతర మండలాల వైసీపీ నాయకులు అదే నిర్ణయం తీసుకునేందుకు శనివారం రాత్రికి రాత్రి సమావేశమవుతున్నారు. అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కూడా ఈ కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నియోజకవర్గంలోని ఆయన అనుచరులు కూడా ఈ సభకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఆయన అనుచరులు అదే నిర్ణయంతో ఉన్నారు. అద్దంకి నియోజకవర్గంలో మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య వర్గం అదే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అనుచరుల్లో కొందరు సభకు వెళుతుండగా, అత్యధికులు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

సిద్ధం సభకు వాహనాలు దారిమళ్లింపు

- ఆంక్షలు పాటించండి: ఎస్పీ


ఒంగోలు(క్రైం), మార్చి 9: సిద్ధం సభ కారణంగా రహదారులపై వాహనాలను దారిమళ్లించినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజలు, వాహన చోదకులు ఆంక్షలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడులో సిద్ధం సభ ఆదివారం జరగనుంది. దీంతో ప్రజలు భారీసంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా దారిమళ్లించినట్లు తెలిపారు. ఈ ఆంక్షలు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 8 గంటల వరకు అమలులో ఉంటాయని ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

వాహనాల దారిమళ్లింపు ఇలా..

- నెల్లూరు వైపు నుంచి ఒంగోలు మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలు, ఒంగోలు నుంచి చీమకుర్తి, మార్కాపురం, కుంట జంక్షన్ నుంచి మాచర్ల మీదుగా వెళ్లాలి.
- ఒంగోలు నుంచి విశాఖపట్నం ఎన్‌హెచ్-16 పై వెళ్లే వాహనాలు త్రోవగుంట నుంచి ఎన్‌హెచ్ -216 మీదుగా చీరాల, బాపట్ల నుంచి మచిలీపట్నంవైపు దారిమళ్లించారు.
- ఒంగోలు నుంచి గుంటూరు, విజయవాడ వెళ్లే వాహనాలు త్రోవగుంట వద్ద నుంచి చీరాల, బాపట్ల, పొన్నూరు మీదుగా దారిమళ్లించారు.
- ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే వాహనాలు త్రోవగుంట నుంచి చీరాల, పర్చూరు మీదుగా దారిమళ్లించారు.
- మేదరమెట్ల గ్రోత్ సెంటర్ నుంచి జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్‌ప్లాజా వరకు ఇతర వాహనాలకు అనుమతి లేదు. కేవలం సిద్ధం సభకు వెళ్లే వాహనాలు మాత్రమే ఆ ప్రాంతంలో ఎన్‌హెచ్ -16పై వెళ్లాలి.

చంద్రబాబు పర్యటన వాయిదా

- 17న చిలకలూరిపేటలో భారీ సభ
- జిల్లా నుంచి అధికంగా మూడు పార్టీల శ్రేణులు సమీకరణ



ఒంగోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు ఈనెల 11న జిల్లాలో తలపెట్టిన పర్యటన వాయిదాపడింది. ఆ రోజున ప్రజాగళం పేరుతో ఉదయం యర్రగొండపాలెం, మధ్యాహ్నం టంగుటూరులో సభలు, సాయంత్రం ఒంగోలులో రోడ్డుషో కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ నిర్ణయించారు. తదనుగుణంగా స్థానికంగా నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఢిల్లీ స్థాయిలో జరిగిన రాజకీయ పరిణామాలతో శుక్ర, శనివారాల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. టీడీపీ, జనసేన కూటమికి బీజేపీ జత కట్టింది. అలాగే ఎన్‌డీఏలో తిరిగి టీడీపీ చేరడం క్లియర్ అయింది. అలా పొత్తులు కొలిక్కి వచ్చాయి. కాగా ఈనెల 17న చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన కూటమి తరపున భారీ సభను నిర్వహించాలని రెండు పార్టీలు నిర్ణయించాయి. తాజా పరిణామాలతో బీజేపీ కూడా ఆ సభలో పాల్గొంటుండగా స్వయంగా ప్రధాని మోదీ కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ సభను మరింత భారీగా నిర్వహించాలని టీడీపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న జిల్లాలో చంద్రబాబు పర్యటన వాయిదా వేశారు. అదే సమయంలో పేట సభకు జిల్లా నుంచి భారీగా పార్టీశ్రేణులను తరలించనున్నారు.

పట్టాల పేరుతో మోసం

- వాటికి చట్టబద్ధత లేదు
- నిందలు నిరూపించగలవా?
- టిడ్కో ఇళ్లపై రుణాలు తీసుకుని మోసం చేసింది వైసీపీనే
- ఎమ్మెల్యే బాలినేనిపై దామచర్ల ధ్వజం

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 9: 'ఇళ్ల పట్టాల పేరుతో ప్రజలను మోసం చేయడం మానుకోవాలి. పదే పదే అబద్ధాలు చెప్పి మాయ చేయడం ఎమ్మెల్యే బాలినేనికి అలవాటుగా మారింది. తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా, లబ్ధిదారుల పేరుతో భారీగా రుణాలు తీసుకున్నారు. వాటిని ఏం చేశారు?' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్‌లో జనసేన ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ రియాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యరజర్ల వద్ద ఇళ్ల స్థలాలు ఇస్తుంటే తాము అడ్డుకున్నామని ఎన్నిసార్లు అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. అక్కడ పట్టాలకు వీలు కాదనే టీడీపీ హయాంలో ప్రతిపాదించిన టిడ్కో ఇళ్లు, ట్రిపుల్ ఐటీ, స్టేడియం నిర్మాణాలు విరమించుకుని వేరే ప్రాంతాల్లో కట్టామన్నారు. టీడీపీ హయాంలో 80శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను వైసీపీ పూర్తి చేయకలేక పోయిందని, ఆ పని చేతకాక, లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని, ఆ సొమ్ము ఏమైందో చెప్పాలన్నారు. రుణాల పేరుతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు జగన్ సొంత ఖాతాకు జమ చేసుకున్నారని విమర్శించారు. నేటికి టిడ్కో లబ్ధిదారులు బ్యాంకుల్లో రుణాలకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారని మండిపడ్డారు. పేదల ఇళ్ల పట్టాలను తాము అడ్డుకుంటున్నామని అబద్ధపు ప్రచారం చేసుకుంటూ బాలినేని మాయ చేస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న ఆరోపణలపై తాను బహిరంగచర్చకు సిద్ధమన్నారు. పేదలకు ఇప్పుడు ఇచ్చిన పట్టాలకు ప్రభుత్వ చట్టబద్ధత లేదన్నారు. రిజిస్ట్రేషన్ పేరుతో మోసం చేయడమే కాకుండా, ఇళ్లు ఉన్నవారికి, ఇంటిపన్నులు చెల్లించే వారికి, వేలల్లో కరెంటు బిల్లులు కట్టేవారికే పట్టాలు ఇచ్చారన్నారు. పేదరికంలో ఉన్న అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ రంగులతో, జగన్, బాలినేని ఫొటోలతో ప్రచార పిచ్చిని తెలిపేందుకు డిజిటల్ సైన్ లేకుండా కాగితాలు ఇచ్చారన్నారు. ఎవరు అభివృద్ధి చేశారో వాస్తవాలతో నిరూపిస్తామన్నారు. అలాగే వైసీపీ అక్రమాలు నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, మీ ఇంటికి రమన్నా వస్తాను, మా ఇంటికి వచ్చినా పర్వాలేదు. ఆరోపణలు చేయడం కాదు. అవి నిరూపించాలని దామచర్ల సవాల్ విసిరారు.



చట్టబద్ధత లేని పట్టాలు చూపుతున్న జనార్దన్, రియాజ్



ద్విచక్రవాహనంపై గిఫ్టులు తీసుకువెళ్తున్న వలంటీర్లు (ఇన్‌సెట్లో) గిఫ్టుబాక్సు చూపుతున్న వలంటీరు

ప్రలోభాల పరంపర

- వలంటీర్లకు మొన్న రూ.5వేలు.. నేడు గిఫ్టులు పంపిణీ
- ఈసీ సూచనలు బేఖాతర్
- గెలుపుకోసం అడ్డదార్లు తొక్కుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ, మార్చి 9 : కొండపి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి ఆదిమూలపు సురేష్‌కు నియోజకవర్గంలో సానుకూల వాతావరణం కనిపించటం లేదు. దీంతో ఆయన గెలుపుకోసం అడ్డదార్లు తొక్కుతూ నానాఆగచాట్లు పడుతున్నారు. తాయిలాలను ఎరగాచూపి ఓటర్లను ప్రలోభపెట్టే మార్గంపై ప్రధానంగా దృష్టి సారించారు. అందులో భాగంగా నియోజకవర్గంలో నిరంతరం ప్రలోభాల పరంపరను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పల్లెపల్లెకూ సురేష్ కార్యక్రమం పేరుతో ఆయన గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలకు ప్రజలు, సొంతపార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి స్పందన కరువైంది. దీంతో వివిధ వర్గాలతో ప్రత్యేక ఆత్మీయ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. వారికి తాయిలాలు ఎరవేసి ఎన్నికల్లో తనకు మద్దతుగా పనిచేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని వలంటీర్లకు రూ.5వేలు చొప్పున నగదును పంపిణీ చేశారు. శనివారం సింగరాయకొండలోని మంత్రి క్యాంపుకార్యాలయంలో మరోదఫా ఆరు మండలాల వలంటీర్లకు మంత్రి సురేష్ గిఫ్టబాక్సులను అందజేశారు. వీటిలో రైసు కుక్కర్లు, హాట్‌బాక్స్‌లు, డిన్నర్‌సెట్‌లు, టీకప్పులు, ఫ్లాస్కోలు ఉన్నాయి. వీటిని వలంటీర్లకు వందనం అనేపేరు, సీఎం జగన్ ఫొటో ముద్రించిన సంచిలో ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ఈ ఎన్నికల్లో వలంటీర్లు కీలకంగా పనిచేయాలని, ప్రతి ఇంటికీ వెళ్లి వైసీపీకి ఓటువేయాలని ప్రచారం నిర్వహించాలని సూచించినట్లు తెలుస్తోంది. మున్ముందు మరిన్ని ప్రోత్సాహకాలు ఉంటాయని వలంటీర్లకు హామీ ఇచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో అధికభాగం విలేకరులకు కూడా ఫ్యాంట్, షర్టు, చీరతో కూడిన గిఫ్ట్ బాక్సులను, పాస్టర్లకు దుస్తులు సురేష్ అందజేశారు. త్వరలో నియోజకవర్గంలో ఓటర్లకు సైతం తాయిలాలు పంపిణీ చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాల్సిన వైసీపీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు కేవలం ప్రలోభాలను మాత్రమే నమ్ముకొని రాజకీయం చేయటంపై ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ తొలగింపు

ఒంగోలు(విద్య), మార్చి 9 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) బిజినెస్ మేనేజర్ సి.సతీష్‌ను తొలగించినట్లు జిల్లా సహకారాధికారి పొలిశెట్టి రాజశేఖర్ తెలిపారు.డీసీఎంఎస్‌లో గోల్‌మాల్ జరిగిన నేపథ్యంలో ఆయనను తొలగించారు. డీసీఎంఎస్‌కు జాయింట్ చెక్ హోల్డర్‌గా ఉండి సొసైటీ అకౌంటెంట్ రూ.3.50 కోట్లు సొసైటీ ఖాతా నుంచి డ్రా చేసి తన సొంత ఖాతాకు మళ్లించుకున్నా ఆయన చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనను బిజినెస్ మేనేజర్‌గా తొలగించి ఆయన స్థానంలో ఒంగోలు సబ్‌డివిజనల్ సహకారాధికారి జే.రామచంద్రనాథ్‌ను నియమించారు.

ఉద్యోగాలిప్పిస్తానని ఆర్మీ ఉద్యోగి మోసం

రూ.27లక్షల ఇచ్చి మోసపోయామని బాధితుల ఆవేదన

మదర్ డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ పేరుతో బురిడీ

ఒకరిది పామూరు, మిగతా నలుగురిది తెలంగాణ రాష్ట్రం నిర్మల్

డబ్బులు అడిగితే ఆత్మహత్య చేసుకోండని బెదిరిస్తున్న మోసగాడు

పామూరు, మార్చి 9 : ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువకుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసగించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పామూరుకు చెందిన ఎస్‌కే ఇమామ్, తెలంగాణ రాష్ట్రం నిర్మల్ ప్రాంతానికి చెందిన సీహెచ్.సాయికిరణ్, ఎస్.సాయికుమార్, ఎం.తరుణ్‌కుమార్, బీ సందీప్ అనే యువకులు పామూరు పోలీస్ స్టేషన్‌కు సమర్పించనున్న వినతిపత్రంలో తెలిపిన వివరాలిలావున్నాయి. పామూరు మండలం మార్కొండాపురం పంచాయతీ సోమన్నపల్లి గ్రామానికి చెందిన డబ్బుకొట్టు మల్లికార్జున, డబ్బుకొట్టు మనోహర్, బొట్ల నాగార్జున ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిర్మల్‌కు చెందిన మదర్ డ్రీమ్ డిఫెన్స్ సంస్థ పేరుతో నమ్మించి ఇమామ్ దగ్గర నుంచి రూ.16లక్షల50వేలు, సాయి కిరణ్ నుంచి రూ.4లక్షల50వేలు, తరుణ్ కుమార్ నుంచి రూ.3లక్షలు, సాయికుమార్ నుంచి రూ.3 లక్షలు, సందీప్ కుంచి రూ.లక్ష వసూలు చేసి మోసం చేశారని ఆ వినతిలో పేర్కొన్నారు. డబ్బుకొట్టు మల్లికార్జున రూ.100 స్టాంప్ పేపర్లపై సాయికిరణ్, తరుణ్‌కుమార్, సాయికుమార్ నుంచి నగదు తీసుకున్నట్లు, ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పించలేని లేనిపక్షంలో రూ.2 వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తానని అగ్రిమెంట్ రాసి ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. ఈ వ్యవహారం 2021లో జరిగింది. అనుమానం వచ్చి మా డబ్బులు మాకు ఇవ్వాలని అడిగితే మీరు తనను ఏమీ చేయలేరని ఎదురుతిరిగి బెదిరిస్తున్నారని, నాకు కేసులు కొత్త కాదని, నా మీద చాలా కేసులు ఉన్నాయని, అవసరమైతే పోలీసులను లంచం ఇచ్చి కొనేస్తానని, మీరు ఫిర్యాదు చేస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వనని, ఆత్మహత్య చేసుకోవాలని బెదిరిస్తున్నా రని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. షేక్ ఇమామ్ తనవద్ద రూ.4లక్షలు తీసుకోవడంతోపాటు ఇన్నోవా కారుకు కోసం రూ.13 లక్షలు కట్టి, మొత్తం ఫైనాన్స్ చెల్లించిన తరువాత కారు నాదని అడ్డం తిరిగి మల్లికార్జున సొంతం చేసుకున్నట్లు తెలిపారు. సుమారు 50 నుంచి వంద మంది వరకు ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూల చేసి మోసం చేశారని ఆ వినతిపత్రంలో తెలిపారు. భారీ మోసానికి పాల్పడిన మోసగాడు మల్లికార్జునను అదుపులోకి తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆ వినతిలో కోరారు.




ఆర్మీ ఉద్యోగికి ఫోన్ పే ద్వారా నగదు ఇచ్చినట్లు మెసేజీలు చూపిస్తున్న బాధితులు (ఇన్‌సెట్లో) ఆర్మీ ఉద్యోగి మల్లికార్జున

చేసిన అభివృద్ధి చూడండి..ఆశీర్వదించండి..!

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల
- 30వ డివిజన్‌లో 'జనం కోసం జనార్దన్'



పార్టీలో చేరినవారితో దామచర్ల జనార్దన్ అభివాదం



రంజాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దామచర్ల, నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 9: తెలుగుదేశం పార్టీ హయాంలో ఒంగోలు నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని చూడాలని, మరింత అభివృద్ధి చేసే అవకాశం మరోసారి కల్పించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఓటర్లను కోరారు. బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని శనివారం నగరంలోని 30 డివిజన్‌లో స్థానిక శర్మాకాలేజీ దగ్గర నుంచి మామిడిపాలెం వరకు నిర్వహించారు. రెండు రోజులపాటు చేపట్టిన ఈ కార్యక్రమంలో దామచర్లకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్ళిన దామచర్ల ప్రజలను ప్రేమతో పలకరించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దానని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా వేసవిలో కూడా ట్యాంకర్లు ఏర్పాటు చేయడంతోపాటు, నగరంలోని బావుల్లో పూడిక తీయించి నీటి ఇబ్బందులు లేకుండా చూశానని తెలిపారు. అలాగే రోడ్లు, డ్రైన్‌లు, వీధి లైట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి శూన్యమన్నారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ధరలు ఇష్టారాజ్యంగా పెంచేసిన సైకో ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. చెత్తపై కూడా పన్ను వేసిన చెత్త ప్రభుత్వం వైసీపీ వచ్చాక ప్రజలు సంతోషంగా లేరని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు మరలా తెస్తామని, పెంచిన ధరలు తగ్గించడంతోపాటు అర్హులైన పేదలందరికీ 2 సెంట్లుస్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ పాలకులు పట్టించుకోకుండా వదిలేసిన టిడ్కో ఇళ్ళను పూర్తి చేసి అందరికీ అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను దామచర్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్, క్లస్టర్ ఇన్‌చార్జి పాలూరి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతకముందు పార్టీ కార్యాలయంలో 4వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు సల్మాన్ బాషా, ఆయన కుటుంబ సభ్యులు కరీముల్లాతోపాటు మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పఠాన్ హనీఫ్ ఖాన్ అల్లాభక్షు, అమ్మల్లా తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక 26వ డివిజన్‌లోని గాంధీరోడ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం పురస్కరించుకుని టీడీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన రంజాన్ ఉపవాస దీక్షల క్యాలెండర్‌ను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆవిష్కరించారు. మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ షేక్ కపిల్ బాషా ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో దామచర్ల క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమన్నారు. ముస్లిం సంక్షేమం కోసం టీడీపీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ మైనార్టీ నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్, కరిముల్లా, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

- వాహనదారుల ఆందోళన



కిందుగా వేలాడుతున్న కరెంటు తీగలు, స్తంభానికి పోటీగా ఉంచిన కర్ర

ఒంగోలు(రూరల్), మార్చి 9: ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని ఇందిరమ్మకాలనీ చివర రోడ్డుకు దక్షిణంగా గల విద్యుత్ స్తంభం నేలకొరిగి పోవటంతో కరెంటు తీగలు కిందగా వేలాడుతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. విద్యుత్ స్తంభాలు సైడుకాలువ పక్కనే ఉండటంతో నేల మెత్తబడిపోయి ఒరిగిపోతున్నాయి. ఈక్రమలో ఒరిగిన కరెంటు స్తంభానికి కొందరు కర్రలను పోటీగా పెట్టారు. ఒకోక్కసారి గాలి వేగంగా వీచినప్పుడు కర్రలు కింద పడిన ప్రతిసారీ కరెంటు స్తంభం వంగిపోయి తీగలు కిందగా వేలాడుతున్నాయి. ఈక్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కరెంటు స్తంభాన్ని పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పేదలకు పట్టాలు ఇస్తే విమర్శలా?

- ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : ఒంగోలులో పేదలకు ఇంటి పట్టాలు ఇస్తే జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు రకరకాలుగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఒంగోలు నగరంలోని పలు సచివాలయాల పరిధిలో శనివారం లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు గిఫ్ట్‌ప్యాక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టాలు దక్కకుండా ఉండేందుకు అనేక అడ్డంకులను సృష్టించినా వాటిన్నింటిని అధికమించి పట్టాలు పంపిణీ చేస్తే ఇప్పుడు దొంగ పట్టాలు అని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోనే భూములు సేకరించి పట్టాలు ఇస్తే ఇష్టారీతిన మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమాల్లో బాలినేని కుటుంబ సభ్యులతో పాటు మేయర్ గంగాడ సుజాత, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు(రూరల్), మార్చి9: ఒంగోలు మండలం కరవదిలోని పీఆర్‌ఆర్ జడ్పీ హైస్కూలులో రిటైర్డ్ హెచ్ఎం సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ శనివారం రాత్రి హోరాహోరీగా జరుగుతున్నాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల నుంచి వాలీబాల్ క్రీడాకారులు తరలివచ్చారు. చివరిరోజు ఆదివారం సాయంత్రం మహిళా వాలీబాల్ క్రీడాకారులతో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను పెద్దసుబ్బారెడ్డి, ఎం.భాస్కర్‌రావు, ఆర్‌ఎంపీ ప్రభాకర్ (బాబు), మారెళ్ల ఆంజనేయులు, దేవరపల్లి నాగేశ్వరరావు, శిరిగిరి రంగారవు, గుట్టుపల్లి కోటేశ్వరరావు, కొల్లా వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి కోటి, లింగంగుంట రవిబాబు, పోకూరి శేషయ్య, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

నేడు పురందేశ్వరి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

రాష్ట్రస్థాయిలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నారు. అలాగే పలువురు అతిథులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నేడు మెగా ఈవెంట్

ఒంగోలు(కల్చరల్), మార్చి, 9: ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 50 మంది గాయకులతో ఆదివారం ఒంగోలులో మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సితార్ మెగా ఈవెంట్ నిర్వాహకులు సీతారం, సమన్వయకర్త డి.వెంకటేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈవెంట్‌లో వివిధ ప్రాంతాల గాయకులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈవెంట్ 12 గంటల పాటు కొనసాగుతుందని తెలిపారు.

మన్నం సుబ్బారావుకు ఘన నివాళి



గ్రైండర్లను అందజేస్తున్న జవహర్, మన్నం శ్రీధర్

చీమకుర్తి, మార్చి 9 : చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో మన్నం సుబ్బారావు 21వర్ధంతిని శనివారం ఘనంగా జరిగాయి. చలువాది రమేష్ ఆధ్వర్యంలో సుబ్బారావు చిత్రపటానికి డాక్టర్ జవహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్నం సుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున గత ఇరవైఏళ్లకు పైగా ఆయన కుమారులు మన్నం శ్రీధర్, కుటుంబసభ్యులు అందిస్తున్న సేవలు అమూల్యమని ఆయన అభినందించారు. అనంతరం మన్నం శ్రీధర్ మాట్లాడుతూ తన తండ్రి పేరిట ప్రతిఏటా సేవాకార్యక్రమాలు నిర్వహించటం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు.భవిష్యత్‌లో సేవలను మరింత విస్తృత పరుస్తామని చెప్పారు. తదుపరి దాదాపు రూ.5లక్షలు విలువచేసే కంప్యూటర్లు, వివిధ రకాల వస్తువులను పేద మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అంజిరెడ్డి, కరిచేటి హనుమంతరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీతోనే సామాజిక న్యాయం

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాబు



ర్యాలీలో పాల్గొన్న రియాజ్, బాబు, విజయ్‌కుమార్, అరుణ

మద్దిపాడు, మార్చి 9: జనసేన పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుకూరి వెంకటేశ్వరరావు (బాబు)పేర్కొన్నారు. శనివారం ఇనమనమెళ్లూరులో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వైసీపీని ఓటుతో ఇంటికి సాగనంపాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, అభ్యర్థి బీఎస్.విజయకుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబు, పవన్ కలయికతో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. జనసేన నాయకురాలు రాయపాటి అరుణ మాట్లాడుతూ టీడీపీ, జనసేనతోనే మహిళ సాధికారత సాధ్యమవుతుందన్నారు. కాగా జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, గుద్దేటి సురేష్‌బాబు, మురళీకృష్ణ, మహేష్‌బాబు, బొక్కిసం సుబ్బారావు, అనంతశక్తి శ్రీనివాసరావు, వి.అనిల్‌కుమార్, రామిశెట్టి ప్రసాద్, హరికృష్ణ, డొప్ప శేషయ్య, మందపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులన్నీ సీఎం భజనకే..!

ఆర్టీసీ బస్టాండ్లు వెలవెల ● నేడు మేదరమెట్లలో సీఎం సిద్ధం ఆఖరి సభ

320 బస్సులు సభకు పంపడంతో ప్రయాణికులకు తప్పని పాట్లు ● జగన్ సభకు జనసమీకరణకు నేతల అత్యుత్సాహం



బస్సులు లేక ఖాళీగా ఉన్న ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 9: ప్రజారవాణా వ్యవస్థను వైసీపీ సొంత సంస్థలా వాడేస్తోంది. ప్రజల ఆదాయంపై నడిచే ఆర్టీసీ ఇప్పుడు అధికార పార్టీ సభలకు రవాణా వ్యవస్థలా మారిపోయింది. ఎక్కడ ఏ సభ జరిగినా బస్సులు అక్కడకు పోవాల్సిందే. ఒక రోజంతా ఆ పార్టీ సేవలో కొనసాగుతోంది. వారి తీరుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ సిద్ధం సభ పెట్టినా రాష్ట్రవ్యాప్తంగా మూడు వేల బస్సులు వెళ్లాల్సిందే అంటూ రవాణా శాఖ ఉత్వర్వులు జారీచేయడమే ఇందుకు నిదర్శనం. సిద్ధం సభకు జన సమీకరణ కోసం బస్సులను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు రోడ్డున పడాల్సి వస్తోంది. ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో వైసీపీ సిద్ధం ఆఖరి సభ ఏర్పాటు చేశారు. దీంతో భారీగా జన సమీకరణకు ఆ పార్టీ నేతలు ఉత్సుత్సాహం చూపుతున్నారు. ఆర్టీసీ బస్సులను భారీగా కేటాయించడంతోపాటు ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు కూడా ఇవ్వాల్సిందేనని సంబంధిత యాజమాన్యాలకు హుకుం జారీచేశారు. దీంతో ఆర్టీసీ, ప్రైవేటు విద్యాసంస్థలు బస్సులు సీఎం సభ కోసం వెళ్లాయి. వాటిని శనివారం మధ్యాహ్నం నుంచే ఆయా ప్రాంతాలకు పంపుతున్నారు. బస్సులు లేకపోవడంతో మండుటెండలో ప్రయాణికులు గంటల కొద్ది ఎదురుచూడాల్సి వచ్చింది. వారు వెళ్లాల్సిన ప్రాంతానికి బస్సులు రద్దుకావడంతో ప్రైవేటు వాహనాలు, ఆటోలు, ఇతర ప్రత్యామ్నాయ రవాణాపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ప్రయాణికులు వైసీపీ తీరును తప్పుబడుతూనే ఆర్టీసీ అధికారులు ఇతర ఏర్పాట్లు చేయక పోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తిరుగు ప్రయాణానికి తిప్పలు

ఈ వారంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ఇతర సంస్థలకు మూడు రోజులు వరుసగా సెలవులు వచ్చాయి. శుక్రవారం మహాశివరాత్రి, రెండవ శనివారం, ఆదివారం కావడంతో తమ సొంతూర్లకు వెళ్లి మూడు రోజులు గడిపిన ప్రజలు తిరిగి సోమవారం యథావిధిగా వారి వారి ఉద్యోగాలకు వెళ్లాల్సి ఉంది. అయితే కొందరు శనివారం, మరికొందరు ఆదివారం ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే జిల్లాలో ఆర్టీసీ రీజియన్ ఇటీవల ప్రయాణికులు సౌకర్యం కన్నా, ప్రభుత్వ భజనకే ప్రాధాన్యత ఇస్తుంది. ఆదివారం మేదరమెట్లలో జరిగే సీఎం సభకు భారీగా జన సమీకరణ చేయాల్సి ఉండటంతో శనివారమే బస్సులన్నీ జిల్లావ్యాప్తంగా గ్రామాలకు చేర్చారు. దీంతో జిల్లాలోని ఆయా డిపోలన్నీ బస్సులు లేక వెలవెలపోగా, తాము ఎక్కాల్సిన బస్సుల కోసం జనం బస్టాండ్లకు చేరుకోవడంతో రద్దీ ఏర్పడింది.

320 బస్సులు సీఎం సభకే..

ప్రకాశం రీజియన్‌లో ప్రభుత్వ, హయర్ బస్సులన్నీ కలిపి 471 వరకు ఉన్నాయి. వాటిలో ప్రతిరోజు వేలమంది ప్రయాణిస్తుంటారు. ప్రజారవాణా ద్వారా ఆర్టీసీకి రోజువారీగా రూ.50లక్షల వరకు ఆదాయం చేకూరుతోంది. అయితే ప్రజల అవసరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం పార్టీ ప్రచారసభ కోసం జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోల నుంచి సుమారుగా 320 బస్సులు కేటాయించడంతో కేవలం కొద్దిపాటి బస్సులతోనే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. అయితే తమకు జరిగిన ప్రయాణ అసౌకర్యంపై ప్రజలు ఆర్టీసీ అధికారులను ప్రశ్నించేందుకు ఫోన్‌లు చేసినా ఎవరు స్పందించకపోవడంతో అటు వైసీపీ తీరుపైనా, ఇటు ఆర్టీసీ అధికారులపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ఆదిదేవుని నగరోత్సవం



కాశీవిశ్వేశ్వరస్వామిని ఊరేగిస్తున్న ఆలయ ప్రతినిధులు



అద్దంకి బస్టాండ్ గౌరి శంకర ఉమమాహేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఒంగోలు(కల్చరల్),మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీగంగా అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి నగరోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనం, నరనంది వాహనం మొదలైన వాటిపై నగరంలోని ఏనుగుచెట్టు, దక్షిణం బజార్, గాంధీరోడ్డు, కోర్టుసెంటర్, జయరాం థియేటర్ సెంటర్, రాజాపానగల్ రోడ్డు మొదలైన ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, ఈమని మదన్‌మోహన్, ఉత్సవ ఉభయదాతలు దాసరి నారాయణరావు, త్రిపురం మల్లిఖార్జున, బేతంశెట్టి హరిబాబు, వీరాస్వామి, కారంశెట్టి శ్రీనివాసరావు పాల్గొనగా, అర్చకులు శంకరమంచి ప్రసాద శాస్త్రి, రామకృష్ణశాస్త్రి పూజలు నిర్వహించారు.

స్థానిక మంగమూరురోడ్డులోని శ్రీసత్యసాయిబాబా మందిరంలో కన్నుల పండుగగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శివలింగానికి సామూహిక అభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, భజన మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ పురోహితులు వ్యామజాల ప్రసన్నకుమార్‌శర్మ యాజ్ఞీకంలో కల్యాణ క్రతువులు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు, సత్యసాయి ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు తంగిరాల రామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



సంతపేటలో స్వామివారి కల్యాణోత్సవం

అవీ..ఇవీ..

ఎంపీ మాగుంటను కలిసిన పలు ప్రాంతాల నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని పలు ప్రాంతాలకు చెందిన ప్రజానీకం కలుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మాగుంట అభిమానులతో పాటు పార్టీలకు అతీతంగా ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్న మాగుంటను ముందుగానే కలిసి తమ మద్దతు తెలుపుతున్నారు. ఒంగోలుతో పాటు కొండపి, సంతనూతలపాడు, దర్శి తదితర ప్రాంతాల నుంచి నగరంలోని మాగుంట నివాసానికి శనివారం తరలివచ్చారు. వారందరూ శ్రీనివాసులురెడ్డిని కలిసి బొకేలు ఇచ్చి అభినందిస్తున్నారు. మాగుంట తీసుకొనే నిర్ణయానికి తాము కట్టుబడిఉంటామని కొంత మంది భరోసా కలిస్తున్నారు. మరో వైపు ఒంగోలుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు కూడా మాగుంటతో భేటీ కాగా, మరో వైపు నగరంలోని అధికార పార్టీతో పాటు పలు పార్టీల నాయకులు ఆయనను కలిసి మద్దతు తెలిపారు.

హాల్‌టికెట్లలో తప్పుల సవరణకు అవకాశం

ఒంగోలు(విద్య), మార్చి 9 : ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్లలో తప్పులు ఉంటే సవరించుకునేందుకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ అవకాశం కల్పించారు. విద్యార్థుల మీడియం, సబ్జెక్టుల్లో ఏమైనా తప్పులు ఉంటే సవరిస్తారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించి వారి మీడియం, సబ్జెక్టుల్లో తేడాలుంటే వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు తెలియజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డిసుభద్ర శనివారం ఓ ప్రకటనలో కోరారు.

గణితం-1బీ పరీక్షకు 1,444 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 9 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన జూనియర్ ఇంటర్ గణితం-1బీ పరీక్షకు 1,444 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 21,990 మంది విద్యార్థులకు 20,546 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 19,288 మందికి గాను 18,259 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,702 మందికి 2,251 మంది పరీక్షలు రాశారు. ఆర్‌ఐవో సైమన్ విక్టర్ మార్కాపురం, యర్రగొండపాలెంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఇతర అధికారులు 40 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆర్‌ఐవో తెలిపారు.

నేడు జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

నాగులుప్పలపాడు, మార్చి 9 : నాగులుప్పలపాడులో ఆదివారం జనసేన పార్టీ కార్యాలయాన్ని జనసేన, తెలుగుదేశంపార్టీ నాయకులు ప్రారంభించనున్నారు. శనివారం నాగులుప్పలపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు భూపతి మురళీమోహన్ మాట్లాడుతూ స్థానిక బస్టాండ్ కూడలిలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, మహిళా నాయకురాలు రాయపాటి అరుణ, నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండల టీడీపీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్ తదితరులతో ప్రారంభించడం జరుగుతుందన్నారు. అలాగే పార్టీ జెండా ఆవిష్కరిస్తామని చెప్పారు. అనంతరం అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం, కనపర్తి వరకు బైకులు, కార్ల ర్యాలీ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో జనసేన పార్టీ జెండాలను ఆవిష్కరణలు జరుగుతాయని, జనసేన, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పారిశుధ్య కార్మికుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి

- డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛ పారిశుధ్య కార్మికుల వివరాలను యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. స్వచ్ఛకార్మికుల జీవనోపాధిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అందులో భాగంగా గ్రామాల్లోని స్వచ్ఛకార్మికుల వివరాలను ఆయా పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లోని పారిశుధ్య విభాగం వార్డు కార్యదర్శులు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వేకు పారిశుధ్య కార్మికులు కూడా సహకరించాలన్నారు. స్వచ్ఛ కార్మికుల సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ




చీరలు, పండ్లను అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఏపీఎన్‌జీవో అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక బలరాంకాలనీలోని ఉషోదయ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు, చీర, జాకెట్, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా వృద్ధాశ్రమంలోని వృద్ధులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి సరుకులు అందించిన అనంతరం రానున్న రోజుల్లో కూడా అవసరమైన సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచిపూడి శరత్‌బాబు, ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ మాధవి, జిల్లా చైర్మన్ కోటేశ్వరమ్మ, జిల్లా కన్వీనర్ శిరీష, జ్యోతి, వెంకటేశ్వరరావు, శివకుమార్, సునీత, ప్రసన్న, విజయలక్ష్మి, రత్నరాణి, అంజనాదేవి, పద్మశ్రీ, షమ్మి, జమీలా, కిరణ్మయి, సరస్వతి, బేగం, సునీల కుమారి, మల్లిక, ఉషారాణి, పద్మావతి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'దిశా' సమావేశం : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానటరింగ్ కమిటీ(దిశా) సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో జరుగుతుందని కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశా చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళ జీవనోపాధికి ఆటో వితరణ



ఆటోను అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), మార్చి, 9: ఒంగోలు నగరం వెంకటేశ్వరకాలనీకి చెందిన విజయ అనే పేద మహిళ జీవనోపాధి కోసం స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ శనివారం ఆటోను బహూకరించింది. విజయ తన ఇద్దరు పిల్లలను చదివించుకోవటానికి ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నదని, అందువల్ల ఆమె జీవనోపాధికి దాతల సహకారంతో లక్ష రూపాయల విలువైన ఆటోను కొని అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు షహనాజ్, సర్దార్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ గౌరవ సలహాదారు మండవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయం శక్తిసదన్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానిక శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఎముకల దారుఢ్యం, థైరాయిడ్, షుగర్, కాల్షియం తదితర పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు అందించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా తమ కార్యాలయంలో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టటం సంతోషంగా ఉందని, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండ్లూరి జెరూషా జాస్మిన్, డాక్టర్ సరయు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఎండ్లూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

జనసేన దన్నుగా..!

నేతలను సమన్వయం చేసుకోవడంలో టీడీపీ అభ్యర్థి బీఎన్ సక్సెస్

ఆ పార్టీ శ్రేణులతో కలిసి పలు కార్యక్రమాలు

ఒంగోలు, మార్చి, 9(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికలలో టీడీపీ-జనసేన ఉమ్మడిగా పోటీ చెయ్యాలన్న నిర్ణయానికి వచ్చిందే తడవుగా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అప్రమత్తమయ్యారు. జనసేన క్యాడర్ మద్దతు కూడ గట్టే ప్రయత్నం చేశారు. పలు గ్రామాల్లో ఉన్న జనసేన పార్టీ స్థానిక నేతలు, మండల, నియోజకవర్గ బాధ్యులలో అధికశాతం మందితో గతం నుంచే బీఎన్ కు సత్సం బంధాలు ఉన్నాయి. దీంతో వారిని సమన్వయం చేసుకోవడంలో ఆయన సక్సెస్ కాగా ఉమ్మడి కూటమి తొలి జాబితాలోనే విజయ్‌కుమార్ అభ్యర్థిత్వం ప్రకటించడంతో ఎన్నికల కార్యాచరణలో దిగారు. పేర్నమిట్టకు చెందిన కందుకూరి బాబు నియోజకవర్గ జనసేన సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా చాలాకాలంగా అయనతో బీఎన్ కు వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయి. రెండు పార్టీలు కలిసి పనిచేయాలన్న నిర్ణయం, ఉమ్మడిగా అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో మరింత సమన్వయంతో వారితో కలిసి పనిచేసే ప్రయత్నం బీఎన్ చేసి సఫలీకృతం అయ్యాడు. పలు గ్రామాలకు చెందిన జనసేన శ్రేణులు నిత్యం బీఎన్‌తో టచ్‌లో ఉంటుండగా ఆయా గ్రామాలు, మండలాలలోని టీడీపీ నేతలు వారితో కలిసి పోయేలా విజయ్‌కుమార్ చర్యలు చేపట్టారు. అంతేకాక బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పథకాల ప్రచారం కోసం పలుచోట్ల జరుగుతున్న కార్యక్రమాలలో టీడీపీ శ్రేణులుతో కలిసి జనసేన కార్యకర్తలు పాల్గొంటున్నారు. అలాగే జనసేన శ్రేణులు ఆయా ప్రాంతాలలో చేపట్టే కార్యక్రమాలలోను బీఎన్ హాజరవుతున్నారు. పదిరోజుల క్రితం చీమకుర్తిలో జనసేన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ, సభ నిర్వహించగా బీఎన్ పాల్గొన్నారు. చదలవాడకు చెందిన జనసేన కార్యకర్తలు పాదయాత్ర చేపట్టగా అందులోను పాల్గొని వారితో మమేకమయ్యారు. ఎస్ఎన్.పాడు మండలం ఎండ్లూరులో శుక్రవారం రాత్రి జనసేన శ్రేణులు ఆత్మీయ సమావేశం నిర్వహించి బీఎన్‌ను పిలిచి సంఘీభావం తెలుపగా, శనివారం రాత్రి మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరులో జనసేన జెండా ఆవిష్కరణ పేరుతో భారీ కార్యక్రమం నిర్వహించి ఆయనను ఆహ్వానించారు. అలాగే ఆదివారం నాగులుప్పలపాడులో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంతో పాటు నాలుగైదు గ్రామాలలో ర్యాలీలు, జెండావిష్కరణలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి బీఎన్‌ను ఆహ్వానించారు. ఇక పల్లామల్లి, బండ్లమూడి, నాయుడుపాలెం, మాచవరంలతో పాటు పలు ఇతర గ్రామాలలోను స్థానికంగా జనసేన సమావేశాలు నిర్వహించే ప్రయత్నాలు ఉన్నాయి. మొత్తం మీద జనసేనతో కుదిరిన ఒప్పందంతో నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు నుంచి సంపూర్ణ మద్దతును పొందడంలో బీఎన్ సక్సెస్ అయ్యారని చెప్పాలి.

అచలానంద స్వామిని దర్శించుకున్న దామచర్ల


ఆశ్రమంలోని చిన్నారులతో దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), మార్చి 9: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ శనివారం ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని శ్రీ అచలానంద ఆశ్రమంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు స్వామి పరిపూర్ణ సిద్ధానంద ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి, అచలానంద స్వామి వార్ల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత పాఠశాల, అన్నదానం, వేదశిక్షణ మొదలైన కార్యక్రమాల గురించి ఆయనకు పరిపూర్ణ సిద్ధానంద వివరించారు. ఆధ్యాత్మిక మార్గం ద్వారా విద్యార్థులు మంచి పౌరులుగా తయారవుతారని, అటువంటి వారిని సమాజానికి అందిస్తున్న పరిపూర్ణ సిద్ధానందస్వామి కృషి ఎంతో గొప్పదని ఈ సందర్భంగా దామచర్ల పేర్కొన్నారు. అనంతరం ఆయనకు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు పార్టీ పదవి

ఒంగోలు, ఆంధ్రజ్యోతి

అసమ్మతి నాయకులను చల్లబరుచుకునే ప్రయత్నంలో భాగంగా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబుకు వైసీపీ అధిష్ఠానం పార్టీ పదవిని కట్టబెట్టింది. మేదరమెట్లలో సిద్ధం సభ జరుగుతున్న నేపథ్యంలో ఆయనకు ఒంగోలు లోక్‌సభ వైసీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ పదవి ఇచ్చారు. ఈమేరకు శనివారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం సిద్ధం సభకు అసమ్మతి నాయకులు గైర్హాజరవుతున్న నేపథ్యంలో టీజేఆర్‌కు పార్టీ పదవి దక్కటం గమనార్హం.

యువ రైతు ఆత్మహత్య

దర్శి, మార్చి 9 : నడింపల్లి గ్రామానికి చెందిన యువ రైతు వి.వెంకటేశ్వర్లు (35) పురుగుమందు తాగి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వెంకటేశ్వర్లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రుణబాధలు, కుటుంబకలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సిద్ధం సభకు భారీ భద్రత

బోసిపోతున్న పోలీస్‌స్టేషన్లు

కొన్ని స్టేషన్లలో ఇద్దరు..మరికొన్నిచోట్ల ఒక్కరే..

1250 మంది వరకు భద్రత విధుల్లో..

ఇతర బందోబస్తులో మిగిలిన సిబ్బంది

ఒంగోలు క్రైం, మార్చి9: మేదరమెట్లలో ఆదివారం జరిగే సిద్ధం సభ కారణంగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్లు బోసిపోయాయి. జిల్లా నుంచి సుమారుగా 1,250 మంది పోలీసు సిబ్బంది ముఖ్యమంత్రి జగన్ నేడు పాల్గొనే సభకు భద్రతా విధులకు హాజరయ్యారు. ఈక్రమంలో అనేక పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్కరు మాత్రమే విధులలో ఉండగా కొన్ని చోట్ల ఇద్దరు ఉన్నారు. శనివారం ఉదయం నుంచే పోలీసులు భద్రత విధులకు హాజరుకావడంతో కనీసం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిచే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఎక్కడ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదుదారులు వెళ్ళిన సోమవారం రండి అటు అక్కడ మిగిలి ఉన్న పోలీసులు సమాధానం ఇవ్వడం కనిపించింది. కాగా జిల్లాలో ఎస్పీతో పాటు ఇరువురు అదనపు ఎస్పీలతో కలిసి సుమారు 1250 మంది సిద్ధం సభ భద్రతా ఏర్పాట్లులో తలమునకలై ఉన్నారు. ఒంగోలు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఓ ఏఎస్సైతో పాటుగా ఓ కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా శనివారం ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించిన 8 మంది మడనూరులో జరుగుతున్న శివరాత్రి ఉత్సవానికి భద్రతకు పంపించారు. చీమకుర్తిలో 25 మంది సిబ్బంది ఉండగా అక్కడ సీఐ, ఎస్సైతో పాటుగా సిబ్బంది అంతా సీఎం సభకు తరలివెళ్లారు. విధులకు హాజరైయారు. ఒక ఏఎస్సై, ఓ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు స్టేషన్‌లో ఉన్నారు. ఇక త్రిపురాంతకం స్టేషన్ నుంచి 15 మంది సిబ్బంది వెళ్ళారు. అక్కడ తిరునాళ్ళ ఉండటంతో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్ళు విధులలో ఉన్నారు. రథోత్సవం భద్రత విధుల కోసం అదనపు బలగాలను రప్పిస్తున్నారు. దర్శి స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది విధులలో ఉండగా, మిగిలిన ప్రాంతాలలో ఒకొకరే ఉన్నారు. సింగరాయకొండ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఈక్రమంలో త్రిపురాంతకంలో జరిగే రథోత్సవం భద్రత ఏర్పాట్లు చూసేందుకు దర్శి డీఎస్పీ, మడనూరు తిరునాళ్ల భద్రతను పర్యవేక్షించేందుకు ఒంగోలు డీఎస్పీ ఉన్నారు.

నూర్‌బాషా సంక్షేమ సంఘం అడహక్ కమిటీ చైర్మన్‌గా అలెగ్జాండర్


అలెగ్జాండర్‌కు నియామకపత్రం అందిస్తున్న మీరావలి

టంగుటూరు, మార్చి 9 : టంగుటూరు మండల నూర్‌బాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘం అడహక్ కమిటీ చైర్మన్‌గా షేక్ అలెగ్జాండర్ నియామకం జరిగింది. ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి అధ్యక్షతన శనివారం టంగుటూరులో మండల నూర్‌బాషాల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సమావేశంలో విస్తృతంగా చర్చించి సంఘం మండల అడహక్ కమిటీని ఎంపిక చేశారు. మండల అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా అలగ్జాండర్, సభ్యులుగా షేక్ ఖాసీం, షేక్ మస్తాన్, షేక్ మస్తాన్‌వలి, షఫ్రక్ శ్రీనుబాషా, షేక్ బాబు, షేక్ సుల్తాన్ సాహెబ్, షేక్ మౌలాలి, షేక్ మౌలాలి సాహెబ్‌లను నియమించారు.

చంద్రబాబు సభ కోసం సమాలోచనలు

● ఎమ్మెల్యే స్వామి సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి


టంగుటూరు నాయకుల సమావేశం

కొండపి, మార్చి9: టంగుటూరులో ఈనెల 11వ తేదీన జరిగే చంద్రబాబు సభపై ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమీక్ష నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం ఆయన కొండపిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో స్వామి మాట్లాడుతూ చంద్రబాబు సభకు మండలం నుంచి 5వేల మందికి తగ్గకుండా వచ్చేలా నాయకులు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా అధికార వైసీపీ నాయకులు టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారని, ప్రతినెలా ఒకటవ తేదీన పింఛన్ డబ్బులు రావని దుష్ప్రచారం చేస్తున్నారని, దాన్ని పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలని స్వామి కోరారు. ప్రభుత్వ డబ్బులు తీసుకుంటూ దురుద్దేశంతో అధికార పార్టీకి అనుకూలంగా పని చేసే వలంటీర్లపై నిఘా ఉంచాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే వలంటీర్లకు ఇబ్బందులు తప్పవని ఎమ్మెల్యే స్వామి హెచ్చరించారు. సమావేశంలో పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, పార్టీ నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగం రెడ్డి నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన సమీకరణలో నేతలు

టంగుటూరు : టంగుటూరులో ఈనెల 11న జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభ విజయవంతానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. వీరు గత శుక్ర, శనివారాల్లో మండలంలోని గ్రామగ్రామంలో పర్యటిస్తూ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులైన రైతులు, కూలీలను సభకు తీసుకువచ్చేలా ప్రయత్నించాలని రైతులకు చెబుతున్నారు. టంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు శుక్రవారం మల్లవరప్పాడు, కందులూరు, మర్లపాడు, ఎం.నిడమలూరు, పొందూరు, కొణిజేడులో విస్తృతంగా పర్యటించారు. గ్రామానికి చేరుకోగానే వీరు ముందుగా టీడీపీ గ్రామ కమిటీని సంప్రదిస్తున్నారు. వారికి సభ ప్రాధాన్యత వివరిస్తున్నారు. చంద్రబాబు సభ ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం రాష్ట్రానికి చారిత్రక అవసరమని వివరిస్తున్నారు. ఇది ఇలా ఉండగా మరో వైపున ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ సభను తన భుజస్కంధాలపై వేసుకున్న పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్య రోజా నియోజకవర్గ వ్యాపితంగా గ్రామాల్లో పర్యటిస్తూ చంద్రబాబు సభకు ప్రజలను సమీకరించే పనుల్లో ఉన్నారు.

అడ్డదారుల్లో గ్రానైట్ అక్రమ రవాణా !

ప్రమాదాలకు నెలవుగా పల్లామల్లి-నేకునంబాదు రోడ్డు

పట్టించుకోని అధికారులు


నేకునంబాదు వద్ద రోడ్డుపై ఆగిన గ్రానైట్ లారీ

చీమకుర్తి, మార్చి 9: క్వారీల నుంచి వెలికితీసిన గెలాక్సీ గ్రానైట్ ముడిరాళ్లను ఫ్యాక్టరీలకు తరలించే క్రమంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ అడ్డదిడ్డంగా అడ్డదారుల్లో గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోంది. ఈక్రమంలో గ్రానైల్ వాహనాలతో రహదారులు గోతులమయమవుతూ ప్రమాదాలకు నెలవుగా మారుతున్నా సంబంధిత అధికారయంత్రాంగంలో ఎటువంటి చలనం లేకపోవటం గమనార్హం. ప్రధానంగా చీమకుర్తి మండలం రామతీర్థం పరిసరప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించింది. ఈ పరిశ్రమకు అనుబంధంగా చీమకుర్తి పరిసరప్రాంతాలతో పాటు గుళ్లాపల్లి ప్రాంతంలో పెద్దఎత్తున గ్రానైట్ ఫ్యాక్టరీలు ఏర్పడ్డాయి. ఆర్ఎల్ ప్రాంతంలో గ్రానైట్ క్వారీల నుంచి ముడిరాళ్లను ఫ్యాక్టరీ ఓనర్లు కొనుగోలు చేసి ప్రాసెస్ చేసిన తదుపరి ఏర్పడిన గ్రానైట్ శ్లాబులను ఎగుమతి చేసి లాభాలు గడిస్తారు. కాగా ఈ క్రమంలో ముడిరాళ్లను క్వారీల నుంచి ఫ్యాక్టరీలకు తరలించేటపుడు నిబంధనలకు పాతర వేస్తూ రవాణా జరుపుతున్నారు. ముడిరాళ్లను అక్రమంగా బిల్లులతో సంబంధం లేకుండా ఫ్యాక్టరీలకు తరలించటం పరిపాటిగా మారింది. ఈ అక్రమ రవాణాకు అడ్డదారులను వెతుక్కుంటున్నారు. టన్నుల బరువుండే రాళ్లను మెయిన్‌రోడ్ మీద నుంచి కాకుండా అడ్డదారుల్లో గ్రామాల్లో ఉన్న ఇరుకు రోడ్ల నుంచి తరలిస్తూ ప్రమాదాలకు కారణభూతులవుతున్నారు. ముఖ్యంగా పేర్నమిట్ట డౌన్‌లో ఉన్న చెక్‌పోస్టును తప్పించుకోవటానికి ముడిరాళ్లను పల్లామల్లి, నేకునంబాదు, తెల్లబాడు, వెల్లంపల్లి మీదుగా గుళ్లాపల్లి వద్ద ఉన్న ఫ్యాక్టరీలకు టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. చీమకుర్తి సమీపంలో ఉన్న చెక్‌పోస్టును పేర్నమిట్టకు తరలించటంతో వీరికి వరంగా మారింది. ఈక్రమంలో పల్లామల్లి, నేకునంబాదు ప్రాంతాల్లో రోడ్డు దారుణంగా దెబ్బతింది. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గడిచిన గురువారం నేకునంబాదు గ్రామ సమీపంలో ఇదేవిధంగా అడ్డదిడ్డంగా రాళ్లను రవాణా చేస్తున్న టిప్పర్ అధికలోడుకు తట్టుకోలేక కట్టలు విరిగి రోడ్డుపైనే నిలిచిపోవటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. టిప్పర్‌పై నుంచి ఏ నిమిషాన రాళ్లు జారిపడతాయో అని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి ప్రమాదకర గ్రానైట్ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వలంటీర్లకు తాయిలాలు ఎర

ఒక్కొక్కరికి రూ.6వేలు విలువైన గిఫ్ట్‌బాక్సుల పంపిణీ

అడ్డదారులు తొక్కుతున్న వైసీపీ నాయకులు


వలంటీర్లకు అందించిన కుక్కర్లు

తర్లుపాడు, మార్చి 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు వైసీపీ నాయకులు అడ్డదార్లు తొక్కుతున్నారు. ఈ క్రమంలో వలంటీర్లకు రెండోసారి తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ఒక్కొక్క వలంటీర్‌కు రూ.5వేల నగదు, స్వీట్ బాక్సు పంపిణీ చేయగా తాజాగా శనివారం మండలంలోని వలంటీర్లకు రెండోసారి తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. తర్లుపాడు సచివాలయం వద్ద తర్లుపాడులోని 29మంది వలంటీర్లకు రూ.6వేల విలువైన రైస్ కుక్కర్, స్టీల్ వాటర్ బాటిల్ సెట్, స్టీల్ హాట్ బాక్స్ సెట్, టీ గ్లాసుల కిట్టు నాలుగు రకాల వస్తువులను ఒక సంచిలో పెట్టి వైసీపీ నాయకులు వలంటీర్లకు అందజేశారు. మండలంలోని 200 మంది వలంటీర్లకు ఇలా పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ గిఫ్ట్ బాక్సులపై మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటోలతో స్టిక్కర్లు అంటించి ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో వలంటీర్లు వైసీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. శనివారం మార్కాపురం నుంచి గిఫ్ట్‌బాక్సులను ఒక ఆటోలో తీసుకొచ్చి సచివాలయం వద్ద వైసీపీ నాయకులు పంపిణీ చేశారు. శనివారం సెలవు కావడంతో సచివాలయాలకు తాళాలు వేసి ఉన్నాయి. 10 రోజుల క్రితం మండలంలోని 10 సచివాలయ ఉద్యోగులకు స్వీట్ బాక్సులను కూడా పంపిణీ చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాల్సిన వలంటీర్లకు వైసీపీ నాయకులు అక్రమంగా తాయిలాలు ఇవ్వడంపై ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.


వలంటీర్లకు పంపిణీ చేసిన గిఫ్ట్‌లు

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి : ఐజీ

మేదరమెట్ల , మార్చి 9: సిద్ధం సభకు సంబంధించి అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఐజీ పాల్‌రాజు తెలిపారు. శనివారం రాత్రి మేదరమెట్లలో ఆదివారం జరిగే సిద్ధం సభకు సంబంధించి ఎస్ఐ, ఆస్థాయి పైఅధికారులతో ఆ యన బందోబస్తు ఏర్పాట్ల గురించి వివరించారు. అనంతరం అడ్మిన్ ఐజీ రవీంద్రనాథ్‌బాబు, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, గుంటూరు ఎస్పీ కు షార్ ద్యూడి, ప్రకాశం ఎస్పీ పరమేశ్వరరెడ్డి, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తదితర అధికారులతో కలిసి సభావేదిక, తదితర ప్రదేశాలను పరిశీలించారు.

రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు పాలన

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాశం


మండల అధ్యక్షులతో ప్రమాణం చేయిస్తున్న శ్రీపతి ప్రకాశం తదితరులు

కొండపి, మార్చి9: రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు పాలన సాగిస్తున్నదని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం విమర్శించారు. కొండపిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమానికి కాంగ్రెస్ చిరునామా అని ప్రకాశం అన్నారు. రాష్ట్రంలో మునుపెన్నడూ ఇటువంటి అవినీతి పరిపాలన సాగలేదని ఆయన విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని జోస్యం చెప్పారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం మూతపడిన పాలడెయిరీని తెరిపిస్తామన్నారు. కొండపి నియోజకవర్గ సమన్వయకర్త మన్నం ప్రసన్నరాజు మాట్లాడుతూ వైసీపీ, టీడీపీలకు ఓటేస్తే అది చేరేది బీజేపీకేనని, అన్ని పార్టీలు ఒకటేనని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన నాయకులకు పిలుపునిచ్చారు. కొండపి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన గుంటుపల్లి శ్రీనివాసరావుకు, పొన్నలూరు మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన నీలం కృష్ణ, జరుగుమల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన కాకిరాజులకు నియామక పత్రాలు శ్రీపతి ప్రకాశం అందజేసి వారితో ప్రమాణం చేయించారు. సమావేశంలో ఆరుమండలాల సమన్వయకర్త పి. మధుబాబు పాల్గొన్నారు.

దంపతులపై దాడి

» ఆందోళనకరంగా భార్య పరిస్థితి


అపస్మారక స్థితిలో అంజమ్మ


గాయపడిన కుంచనపల్లి బాబు

యద్దనపూడి(మార్టూరు), మార్చి 9: దంపతులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి యద్దనపూడి మండలంలోని పోలూరు గ్రామంలో చోటుచేసుకుంది. గాయపడిన భర్త కుంచనపల్లి బాబు, భార్య అంజమ్మలు గుంటూరులోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో అంజమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ దారుణానికి కారకుడైన కుంచనపల్లి సాంబశివరావు పరారీలో ఉన్నట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు.. బాధితులు, ఈ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి కుటుంబాల మధ్య బంధుత్వం కూడా ఉన్నట్లు తెలిసింది. బాధితులలో బాబు ఇంటి వద్ద చిల్లర దుకాణం నిర్వహిస్తుండగా, ఆయన భార్య అంజమ్మ పొలం పనులకు మహిళలను తీసుకువెళుతూ మేస్త్రీగా పనిచేస్తున్నారు. భార్యాభర్తలపై దాడిచేసిన సాంబశివరావు గతంలో ఆటో డ్రైవరుగా పనిచేయగా, ఆయన భార్య నాగలక్ష్మి అంజమ్మ ముఠాలో కూలీ పనులకు వెళుతుంటారు. భార్య నాగలక్ష్మిపై అనుమానం పెంచుకున్న సాంబశివరావు శుక్రవారం రాత్రి బాబు ఇంటికి వెళ్లి గొడవపడినట్లు తెలిసింది. ఈక్రమంలో వారి ఇంటి వద్ద ఉన్న చిన్న చాకు తీసు కొని తొలుత అంజమ్మ గొంతును కోయగా, అడ్డువచ్చిన భర్త బాబుపై కూడా దాడి చేశాడు. కేకలు విన్న ఇరుగుపొరుగువారితో పాటు స్థానిక మహిళా పోలీసు ఘటనా స్థలానికి చేరారు. అనంతరం బంధువులు గాయపడిన దంపతులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శనివారం ఉదయం గుంటూరులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

రామకోటేశ్వరస్వామి హుండీ లెక్కింపు

చినగంజాం, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సోపిరాల నిర్వహించిన తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటుచేసిన హుండీని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. అభిషేకాలు, కుంకమ పూజలు ద్వారా రూ.2,11,200, క్యూఆర్ కోడ్ ద్వారా 15,088, హుండీ ద్వారా రూ.5,30,982 వచ్చి నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రూ.7,57,270 ఆదాయం రాగా బ్యాంకులో జమ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తుమ్మలపెంట సీతారామయ్య, టి.వెంకటస్వామి, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి నరేంద్రనాథ్, పి.శరభయ్య, సున్నా హరనాథ్‌బాబు, గుండ్రెడ్డి నరసింహారావు, అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, టి.చిన్నా, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.





పొదిలిలోని వీధుల్లో రథోత్సవం, గునుపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు, స్వామివారి దర్శనం అనంతరం వేడుకల్లో నారాయణరెడ్డి

వైభవంగా రథోత్సవం

- పొదిలిలో పరుచుకున్న ఆధ్యాత్మిక శోభ
- వేలాదిగా హాజరైన భక్తులు

పొదిలి మార్చి 9 : పొదిలి పట్టణంలోని శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వారు రథోత్సవం కొనసాగింది. కార్యక్రమంలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైసీపీ మార్కాపురం సమన్వయ కర్త అన్నా రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, రథనిర్మాణ దాత సామంతపూడి నాగేశ్వరరావు, ఆలయ కమిటి చైర్మన్ యక్కల శేషగిరిరావులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో ఎం.శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ప్రత్యేకపూజలు చేశారు. గౌరీశంకరులుగా ఆశీనులైన ఆదిదంపతుల రథాన్ని లాగేందుకు భక్తులు, మహిళలు, పురుషులు పోటీపడ్డారు.

దాతల అన్నదాన కార్యక్రమాలు

రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు దాతల విశ్వనాథపురం మొదలుకొని పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపుల అన్నదానాలు, అల్పాహారాలు, అందజేశారు. ఎమ్మెల్యే కుందురు నాగార్జురెడ్డి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు వారి మద్దతుదారులు ఏర్పాటు చేసిన శిబిరాలను వారు ప్రారంభించారు. గునుపూడి వరలక్ష్మమ్మ, సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్, గునుపూడి తాయారమ్మ, చెంచయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలోకుమారులు గునుపూడి భాస్కర్, మధుసూదనరావు, జీసీ సుబ్బారావుల ఆధ్వర్యంలో భారీగా అన్నదానం చేశారు.

భారీ బందోబస్తు నడుమ రథోత్సవం

రథోత్సవం సందర్భంగా వచ్చిన భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, తాడివారిపల్లె, దొనకొండ ఎస్‌ఐలతో పాటు స్పెషల్ పార్టీ సిబ్బందితో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట బందోబస్తును దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ కోటయ్యల పర్యవేక్షణలో రథోత్సవం విజయవంతంగా గమ్యస్థానానికి చేరింది. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినందుకు ఆలయ కమిటీ పోలీసులకు అభినందన తెలిపింది.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

గిద్దలూరు : గిద్దలూరులోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారికి రుద్రహోమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ శివపురం రమాదేవి, ధర్మకర్తల మండలి సభ్యులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పోలేపల్లి నరేంద్ర, నిర్మలదేవి, రంగమణి, రమాదేవి, దేవస్థాన పూజారి అనిల్‌కుమార్‌శాస్త్రి, కార్యనిర్వహనాధికారి గర్రె సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ బాలిరెడ్డి తది తరులు పాల్గొన్నారు. రాచర్ల మండలంలోని శ్రీకనక సురభేశ్వర కోనలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. కోనలోని ఆర్యవైశ్యసత్రంలో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలను దంపతులు నిర్వహించారు. కే.ఎస్.పల్లి, పలుపులవీడు తదితర శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని ముడుపులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు మాగుంట రాఘవ రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగ నాయకులు రంగనాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నంది వాహనంపై మహాశివుడు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలో వెలసిన శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్ తేజశర్మలు మహాశివుని ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. నందివాహనంపై మహేశ్వర అలంకారంలో మహాశివునికి నగర వీధులలో ఉత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ కేశవరావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వర కల్యాణం

త్రిపురాంతకం : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి త్రిపురాంతకేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైభవంగా సాగిన కల్యాణోత్సవాన్ని భక్తులు భక్త పారవశ్యంతో తిలకించారు. కల్యాణోత్సవానికి ముందు అర్చకులు విశ్వన్నారాయణశాస్త్రి, పాలంక ప్రసాదశర్మ ఆధ్వర్యంలో లింగోద్భవ కాలపూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సత్రాలు, ఆలయాల ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పాలకమండలి చైర్మన్ సుబ్బారావు, వేదపండితులు పాల్గొన్నారు. శనివారం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులు అన్ని సామాజిక సత్రాలలో భోజన సౌకర్యాలు కల్పించారు.

వైభవంగా నీలకంఠేశ్వరస్వామి కల్యాణం

తర్లుపాడు : తర్లుపాడులో వెలసిన శ్రీ గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రధానార్చకులు దేవులపల్లి పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయంలో శివనామస్మరణతో మార్మోగింది. ఆలయ ధర్మకర్త నేరెళ్ల శివకుమార్ ఉభయదాతలుగా పీటలపై కూర్చొని శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. భక్తులకు ఉభయ దాతలు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లను తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లపోసి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కోలాట నృత్యప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ ధర్మకర్త నేరెళ్ల సాంబశివరావు, వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్త జవాజి విజయభాస్కర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కంభం (అర్ధవీడు) : అర్ధవీడు మండలం యాచవరం గ్రామంలో నిర్వహించిన మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం గిద్దలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ శ్రేణులు అశోక్‌రెడ్డికి పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికాయి. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరస్వామి తిరునాళ్ల

పొదిలి : మండలంలోని ఈగలపాడు గ్రామంలో వెలసిన కూడలి సంగమేశ్వరస్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రాచీనకాలం నాటి దేవాలయంలో పూజలు చేసేందుకు భక్తులు బారులుతీరి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టూ పదిగ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఆలయ అర్చకులు స్వామవారి దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.






నందివాహనంపై మహాశివుడు, గిద్దలూరులో భక్తుల పూజలు, కళ్యాణ వేదికపై పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరుడు , హాజరైన భక్తులు

అవీ..ఇవీ..

కలలకు రెక్కలు పథకంతో మహిళలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పొదిలి, మార్చి 9 : చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన 'కలలకు రెక్కలు పథకం' మహిళలకు ఎంతో మేలని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన పార్టీల ఆధ్వర్యంలో విజయఢంకా మోగనుందన్నారు. అందులో భాగంగానే ఎన్నికల సమయంలో చంద్రబాబు దూరదృష్టితో మహిళలకోసం 'కలలకు రెక్కలు' అనే బృహత్తరమైన పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకం ద్వారా బడుగు, బలహీన మైనారిటీ బాలికలకు మేలు చేకూరుతుందన్నారు. పదవతరగతిలోనే విద్యను ఆపేయకుండా బ్యాంక్‌రుణాలు ఇప్పించి ఉన్నత చదువులు చదివించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. మాజీ సర్పంచ్ స్వర్ణగీత మాట్లాడుతూ చంద్రబాబునాయుడికి మహిళలంటే గౌరవమన్నారు. అంతేకాకుండా స్త్రీశక్తిగా ఎదగాలనే ఆలోచన కూడా ఉంటుందన్నారు. అందుకే డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళా ఎదుగుదలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇంటర్మీడియట్ తరువాత ఐపీఎస్, ఐఏఎస్, ఎంబీబీఎస్ లాంటి ఉన్నత చదువులు చదివించేందుకు మహిళలకు టీడీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రతిఒక్క మహిళ 2024 ఎన్నికల్లో రాష్ట్రాభివృద్ధితోపాటు యువతను ముందుకు నడిపించే సత్తా ఉన్న నాయకున్ని ఎన్నుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, మహిళా నాయకురాలు మెహరున్నీసా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



కార్మికులతో మాట్లాడుతున్న కల్పన

కంభం, మార్చి 9 : మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కల్పన కోరారు. శనివారం సాయంత్రం స్థానిక డిగ్రీ కళాశాలలో సీఐటీయూ నాయకులు మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. కంభం, బేస్తవారపేట మండలాల కార్మికులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్పన మాట్లాడుతూ కార్మిక సంఘాలకు ప్రస్తుతం 3వేలు గౌరవ వేతనం ఇస్తున్నారన్నారు. అది కూడా ఏడాదికో, పది నెలలకో ఒకసారి ఇస్తున్నారన్నారు. కార్మికులతో వెట్టి చేయించుకుంటున్నారన్నారు. కార్మికుల సేవ విరమణ అనంతరం రూ.1.50 లక్షలు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కంభం మండలం కార్మిక సంఘం అధ్యక్షురాలుగా గోనె చతుర, ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, కార్యదర్శి పి.అనిత, సహాయ కార్యదర్శి షేక్ మున్నీ, కోశాధికారి షేక్ మౌలాబీలను ఎన్నుకున్నారు. బేస్తవారపేట కార్మిక సంఘం అధ్యక్షురాలిగా మంజువాణి, ఉపాధ్యక్షులు ఎస్.ఎలిసమ్మ, కార్యదర్శి శ్రీనివాసులు, సహాయకార్యదర్శులు ఎస్.శివపార్వతి, కోశాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మలను ఎన్నుకున్నారు. స్కూల్ శానిటరివర్కర్స్ యూనియన్ కంభం మండల అధ్యక్షురాలిగా షేక్ రిజ్వాన, ఉపాధ్యక్షులుగా ఎ.భారతి, కార్యదర్శి పి.లక్ష్మీ, సహాయ కార్యదర్శి జి.కుమారి, కోశాధికారి టి.బుజ్జిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ షేక్ అన్వర్, కోకన్వీనర్ షేక్ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భావితరాలకు భరోసా

- మాజీ సైనికులతో ఆత్మీయ సమ్మేళనంలో కందుల నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, మార్చి 9: టీడీపీతోనే భావితరాల భవిష్యతుకు భరోసా అని మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక మాజీసైనిక ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శనివారం మాజీ సైనికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశానికి రక్షణగా నిలిచి పోరాడిన మాజీసైనికులు, వారికి అండగా ఉన్న వారి కుటుంబాలకు రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. అందుకు టీడీపీకి మద్దతుగా ఉండాలన్నారు. 22 సంవత్సరాలుగా ప్రజా సమస్యపై పోరాడుతున్న తనకు మాజీసైనికులంతా మూకుమ్మడిగా మద్దతివ్వాలని కోరారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాతోనే పశ్చిమ ప్రకాశం ప్రజల బతుకులు మారుతాయని, ప్రత్యేక జిల్లా కావాలో, వైసీపీ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, మాజీసైనిక సంఘం నాయకులు వాలిచర్ల శేషసాయి పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు

గిద్దలూరు టౌన్, మార్చి 9 : శివరాత్రి సందర్భంగా స్థానిక పాతాళ నాగేశ్వర స్వామి దేవాలయం వద్ద శుక్రవారం రాత్రి పాటకచేరి జరుగుతున్న సమయంలో అర్ధరాత్రి తరువాత పాటకచేరి నిలిపివేయాలంటూ పోలీసులు నిర్వాహకులకు తెలిపారు. ఆసమయంలో అక్కడున్న సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న బిజ్జం రాంభూపాల్‌రెడ్డి పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. పాటకచేరి ఆపేప్రసక్తే లేదని, నీ ఇష్టం వచ్చింది చేసుకో అంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో పోలీసులు బిజ్జం రాంభూపాల్‌రెడ్డికి వాగ్వాదం చోటుచేసుకొంది. నిర్వాహకులు పోలీసులకు, రాంభూపాల్‌రెడ్డికి సర్దిచెప్పారు. విధులకు ఆటంకం కల్పించిన బిజ్జం రాంభూపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ వై.వీరసోమయ్య తెలిపారు.

పవిత్ర దేవాలయంలో అసభ్యంగా నృత్యాలా..?

గిద్దలూరు టౌన్, మార్చి 9 : శివరాత్రి పర్వదినం సందర్భంగా పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో వైసీపీ నాయకులు పాటకచేరి ఏర్పాటు చేసి అసభ్యంగా నృత్యాలు ఏర్పాటు చేయడాన్ని బీజేపీ అసెంబ్లీ ఎస్సీమోర్చ ఇన్‌చార్జ్ బండారి జయప్రసాద్ తీవ్రంగా ఖండించారు. వైసీపీ నాయకులు దేవాలయ పవిత్ర తను భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. హిందువులై ఉండి ప్రసిద్ధ పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఇలాంటి కార్యక్రమాలు చేయడాన్ని ప్రజలు అసహించుకునేలా ఉన్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము ఆందోళనలు చేపడతామన్నారు.

వలంటీర్లకు తాయిలాలు ఎర

- ఒక్కొక్కరికి రూ.6వేలు విలువైన గిఫ్ట్‌బాక్సులు పంపిణీ
- అడ్డదారులు తొక్కుతున్న వైసీపీ నాయకులు



వలంటీర్లకు అందించిన కుక్కర్లు

తర్లుపాడు, మార్చి 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు వైసీపీ నాయకులు అడ్డదార్లు తొక్కుతున్నారు. ఈ క్రమంలో వలంటీర్లకు రెండోసారి తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ఒక్కొక్క వలంటీర్‌కు రూ.5వేల నగదు, స్వీట్ బాక్సు పంపిణీ చేయగా తాజాగా శనివారం మండలంలోని వలంటీర్లకు రెండోసారి తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. తర్లుపాడు సచివాలయం వద్ద తర్లుపాడులోని 29మంది వలంటీర్లకు రూ.6వేల విలువైన రైస్ కుక్కర్, స్టీల్ వాటర్ బాటిల్ సెట్, స్టీల్ హాట్ బాక్స్ సెట్, టీ గ్లాసుల కిట్టు నాలుగు రకాల వస్తువులను ఒక సంచిలో పెట్టి వైసీపీ నాయకులు వలంటీర్లకు అందజేశారు. మండలంలోని 200 మంది వలంటీర్లకు ఇలా పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ గిఫ్ట్ బాక్సులపై మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫోటోలతో స్టిక్కర్లు అంటించి ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో వలంటీర్లు వైసీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. శనివారం మార్కాపురం నుంచి గిఫ్ట్‌బాక్సులను ఒక ఆటోలో తీసుకొచ్చి సచివాలయం వద్ద వైసీపీ నాయకులు పంపిణీ చేశారు. శనివారం సెలవు కావడంతో సచివాలయాలకు తాళాలు వేసి ఉన్నాయి. 10 రోజుల క్రితం మండలంలోని 10 సచివాలయ ఉద్యోగులకు స్వీట్ బాక్సులను కూడా పంపిణీ చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాల్సిన వలంటీర్లకు వైసీపీ నాయకులు అక్రమంగా తాయిలాలు ఇవ్వడంపై ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.



వలంటీర్లకు పంపిణీ చేసిన గిఫ్ట్‌లు

భక్తి ముసుగులో ఓట్ల వేట

- మార్కాపురం వైసీపీ కన్వీనర్ వెగటు ప్రచారం
- విస్మయం వ్యక్తం చేసిన భక్తులు



ప్రజలకు అభివాదం చేస్తున్న అన్నారాంబాబు

పొదిలి, మార్చి 9 : దేవాలయాల్లో జరిగే ఉత్సవాలకు రాజకీయ నాయకులు రావడం మామూలే.. సహజంగా వారికి దేవుడి మీద భక్తి ఎలా ఉన్నా.. చిత్తం మాత్రం ఒక్కడి కేడర్ ఓట్ల మీదే ఉంటుంది. ఉత్సవాలకు రాజకీయ నాయకులు హాజరైన కేడర్ ఏర్పాటు చేసే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, వీఐపీ దర్శనాలతో సరిపెట్టుకోవడం చేస్తుంటారు. ఇక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులైతే.. ఆలయ పాలకమండలి నుంచి రాచమర్యాదలు అందుకుంటారు. ఇంతవరకు అన్ని రాజకీయ పక్షాలు చేసేదే.! అయితే గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఇంకాస్త భిన్నంగా ఆలోచించారు. దైవదర్శనానికి ముందే ఈయన రాజకీయ ప్రవచనాలతో భక్తులకు దర్శనం ఇచ్చారు. దీనినే ఆయన సభా వైసీపీ ప్రచార వేదికగా మార్చుకున్నారు. శుక్రవారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన శనివారం కూడా ఇక్కడే మకాం వేశారు. శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులను క్యూలైన్ల వద్ద తనను పరిచయం చేసుకొనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాను మార్కాపురం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గెలుపునకు సహకరించాలని కోరారు. భక్తుల సౌకర్యాలు, తమ సేవాకార్యక్రమాల గురించి మాట్లాడడం బదులు వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తాడు. మరోవైపు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడిని విమర్శించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఒకానొకదశలో 'చంద్రబాబు మోసగాడు' అనే పదానికి బదులుగా 'జగన్ మోసగాడు' నోరుజారాడు. ఇది విన్న భక్తులు పెద్దగా కేకలు వేశారు. వెంటనే నాలుక కరుచుకున్న ఆయన పదం మార్చి 'చంద్రబాబు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు' అని అన్నారు. అంతే కాకుండా ఆదివారం మేదరమెట్లలో జరిగే సిద్ధం సభకు తరలిరావాలని బహిరంగంగానే నాయకులను, ప్రజలను కోరడం గమనార్హం. ఇక శనివారం జరిగిన రథోత్సవంలో భక్తులు స్వామివారి రథం లాగారు. భక్తులను ఓట్లు అడిగే ప్రయత్నం చేశారు. ఏది ఏమైనా శివరాత్రి పర్వదినాన్ని ప్రచారకార్యక్రమానికి వేదికగా ఉపయోగించుకోవడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన తాండాల నుంచి వైసీపీని తరిమికొట్టాలి

- టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, మార్చి 9: గిరిజన తాండాల నుంచి వైసీపీని తిరిమికొట్టాలని వై.పాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో గిరిజనులకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ వారికి చేసిందేమి లేదని విమర్శించారు. శనివారం పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీ చౌటపచర్లలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లగా మంత్రి సురేష్‌కు చౌటపచర్ల గ్రామాన్ని చూసి కూడా ఉండలేదన్నారు. గ్రామంలో సీసీ రోడ్డులు, డ్రేనేజీ లేక తాండలో అభివృద్ధి కనిపించడంలేదని అన్నారు. గ్రామానికి ప్రధాన రోడ్డు కూడా లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనులకు వైసీపీ ఏమీ చేయలేదన్నారు. గిరిజనగూడేలలో నిశ్శబ్ద విప్లవం మొదలైందన్నారు. వైసీపీ ని త్వరలోనే బొందపెడతారన్నారు. గిరిజనులకు వైసీపీ చేసిన అభివృద్ధిపై వైసీపీకి దమ్ముంటే చర్చలకు రావాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో చంద్రబాబు వేలాది మందికి ఐటి రంగం ద్వారా ఉద్యోగాలు కల్పించారని అన్నారు. సీఎం జగన్‌రాష్టానికి ఒక్క ఐటీ పరిశ్రమ అయినా తెచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, పోట్ల గోవిందు, మంత్రు నాయక్, మార్కెట్‌యార్డు డైరెక్టరు సోమ్లనాయక్, మాజీ సర్పంచి సూర్యనాయక్ గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దళితులకు అన్యాయం

- టీడీపీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి
- 30 ఎస్సీ కుటుంబాలు చేరిక



టీడీపీలోనికి కేడర్‌ను ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 9 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విమర్శించారు. శని వారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన 30 ఎస్సీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి ఆపార్టీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి నిరంకుశ విధానాలతో పరిపాలన సాగిస్తున్నాడని, ఎస్సీలను తీవ్ర అన్యాయానికి గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో వార్డుమెంబర్ కొత్త కిరణ్, కొత్త దావీద్, వసంతరావు, నేరెళ్ళ యలమంద, వేషమాల రంగనాయకులు, వల్లపు పెద్దవెంకటేశ్వర్లు, బనగాని మస్తాన్, వేషమాల బాలక్రిష్ణ, కేశవ్, కొత్త జేమ్స్, ఖాశింవలి, గుడిపాటి జీవన్, నేరెళ్ళ ప్రశాంత్, చీకుర్తి రంగయ్య, మల్లెపోగు రాజు, షేక్ రహమత్‌భాషా, కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులుయాదవ్, ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి, మండల పరిశీలకులు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రాభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు

ఎర్రగొండపాలెం, మార్చి 9 : ప్రత్యేక హోదావస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు అన్నారు. ఎర్రగొండపాలెంలో శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లా డారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించడంలో టీడీపీ, వైసీపీ రెండుపార్టీలు విఫలమయ్యాయన్నారు. టీడీపీకి ఓట్లు వేసినా, వైసీపీకి ఓట్లు వేసినా, బీజేపీకి వేసినట్లే అన్నారు. నీళ్లులేకుండా వెలిగొండ ప్రాజెక్టుప్రజలకు అంకితం చేయడం, పైలాన్ ప్రారంభించడం చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనకు అనర్హుడన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి బతికి ఉంటే ఇలాంటి కార్యక్రమాలను హర్షించేవాడుకాదన్నారు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెసుపార్టీ టిక్కెట్‌ను తన కుమారుడు విజేష్‌రాజుకు కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెసుపార్టీ నాయకులు పాలపర్తి విజేష్‌రాజ్, మండల కార్యదర్శి డి బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

పెద్దారవీడు, మార్చి 9: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని ఎస్‌ఈబీ ఎస్సై గోపాలకృష్ణ శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకు న్నాడు. ఆయన నుంచి 100 బాటిళ్ల ప్రభుత్వ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ప్రభుత్వ మద్యం దుకాణం సేల్స్‌మెన్ వెంకట నారాయణ, మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో బెల్ట్‌షాప్ యజమానిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు

- దళారులతో మోసపోతున్న రైతాంగం
- శిథిలావస్థలో భవనాలు

పెద్ద దోర్నాల, మార్చి 9: రెండు మండలాల రైతుల ప్రయోజనార్థం నిర్మించిన వ్యవసాయ మార్కెట్టు యార్డు వినియోగంలోకి రాకముందే శిథిలావస్థకు చేరుకొంది. దీంతో లక్షల రూపాయలు బూడిదలో పన్నీరులా వృథా అయ్యాయి. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో రెండున్నర దశాబ్దాల క్రితం వ్యవసాయ మార్కెట్‌యార్డును ఏర్పాటు చేశారు. అప్పట్లోనే కోటి రూపాయలకు పైగా వెచ్చించారు. పంట విక్రయించేందుకు షెడ్, అధికారులకు క్వార్టరు, పంట నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగుల కోసం రెండు భవనాలు నిర్మించారు. పెద్దారవీడు, దోర్నాల మండలాలకు చెందిన రైతులు పండించిన పంటలు స్థానికంగానే మార్కెట్టుకు తరలించి విక్రయించుకోవచ్చు. గిట్టుబాటు ధర లభించని యడల శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకునే సదుపాయంతో వ్యవసాయ మార్కెట్ నిర్మాణం చేశారు. అయితే సంబంధిత అధికారులు, పాలకులు నిర్లక్ష్య ధోరణితో ఇప్పటి వరకు ఎటువంటి లావాదేవీలు నిర్వహించలేదు. ఏళ్లు గడుస్తున్నా, నేటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆవరణంతా చిల్లకంపతో అల్లుకుపోయి అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో అసాంఘిక చర్యలకు ఆవాసంగా మారింది. సెలవుల రోజుల్లో విద్యార్థులు క్రీడలు నిర్వహిస్తుంటారు. అప్పుడప్పుడు స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.



గుంటూరుకు తరలిస్తున్న మిరపకాయలు

మోసపోతున్న రైతాంగం

అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడి నోట్లో శని అన్నచందంగా కోట్ల రూపాయలు విలువైన మార్కెట్ యార్డు అందుబాటులో ఉంది. వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు కావలసిన భవనాలు, సదుపాయాలున్నాయి. ప్రభుత్వం, సంబంధిత అధికారులు, పాలకులు అలసత్వం వీడితే ప్రయోజనం కలుగుతుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు వినియోగంలో లేకపోవడంతో పండించిన పంటను సుదూర ప్రాంతాలకు వ్యయ ప్రయాసల కోర్చి తరలించి అడిగిన కాడికి అమ్ముకోవాలసిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యార్డు పరిధిలో ప్రధానంగా ఈ ప్రాంతాల్లో మిర్చి, పత్తి, మినుము, అలసందలు, ఉలవలు, కందులు పండిస్తారు. యార్డు వినియోగంలో లేక పోవడంతో వ్యాపారులు, దళారులు ఎంతకంటే అంతకు తక్కువ చేసి ధరలు అడుగుతున్నారు. ఇండ్లలో నిల్వ చేసుకునే సదుపాయం లేక గుంటూరు, కర్నూలు, ఆదోని వంటి ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. దీంతో రవాణా, ఇతరత్రా ఖర్చులు పెరిగి తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనాలు

తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

- రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత
- యథేచ్ఛగా మార్జిన్ల ఆక్రమణ
- పార్కింగ్ స్థలం లేక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

దర్శి, మార్చి 9 : దర్శి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. ట్రాఫిక్ నియంత్రణ చేసే వారే లేరు. దీంతో ప్రధాన కూడళ్లల్లో సైతం అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుకుంటూ వెళ్తున్నారు. సర్కిల్‌లో కంట్రోల్ చేయకపోవడంతో వాహనాలు ఎదురెదురుగా వస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకోవడం లేదు. రోడ్డు మార్జిన్‌లో అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలను పెడుతున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడం వలన సమస్య ఉత్పన్నమవుతోంది. రోజురోజుకూ వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. రోడ్డు మార్జిన్లు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. ఉన్న కొద్దిపాటి మార్జిన్ స్థలాల్లో వాహనాలను ఇష్టానురీతిన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు ఎంతోకాలంగా ప్రజలు కోరుతున్నా నేటికీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా కంట్రోల్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనిచేయడం లేదు. ప్రస్తుతం పోలీసులు గడియార స్తంభం కూడలిలో కంట్రోల్ చేయడంలేదు. ట్రాఫిక్ సిగ్నల్స్ బాగుచేయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గడియార స్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణ లేక అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలు



రోడ్డుపైనే పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు



భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ గురుబ్రహ్మం దంపతులు

అన్నదాన సత్రానికి భూమి పూజ

తాళ్లూరు, మార్చి 9 : గుంటి గంగ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న అన్నదాన సత్రానికి శనివారం ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు భూమి పూజ చేశారు. గుంటిగంగ సన్నిధిలో అన్ని సామాజిక వర్గాలకు అన్నదాన సత్రాలు ఉన్నాయి. దేవస్థానం తరుపున అన్నదాన సత్రం లేక పోవడంతో ఇటీవల నియమితులైన చైర్మన్ కొసనా గురుబ్రహ్మం భక్తుల కోసం దాతల సహాయ సహకారాలతో అన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో కాశినాయన సత్రానికి ఎదురుగా వున్న స్థలాన్ని ఎంపిక చేసి ఆస్థలంలో భవననిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పూజారి ప్రకాశం పంతులు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి యువత క్రీడల్లో రాణించాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మార్చి 9: కనిగిరి ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లో 3 జిల్లాల మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఉగ్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతానికి చెందిన యువత క్రీడారంగంలో రాష్ట్ర స్థాయిలో రాణించి రాష్ట్రానికి, కనిగిరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో కనిగిరిలోనే రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించి ప్రోత్సహించినట్లు గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కనిగిరిలోనే అన్ని రకాల రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణకు కృషి చేస్తానన్నారు. పట్టుదలకు ఈ ప్రాంత క్రీడాకారులు మారుపేరన్నారు. సాధించాలనే తలంపులోకి వస్తే వారిని దాటి విజయం మరొకరికి వెళ్లదన్నారు. క్రీడాకారులకు అండగా ఉంటానని ఉగ్ర భరోసా ఇచ్చారు. ముందుగా ఉగ్ర వాలీబాల్ సర్వీస్ బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, బాబుల్లా, ఫిరోజ్, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, గిఫ్ట్ ఆర్టికల్స్ కొండలు, యస్థానిబాషా, సుబ్రమణ్యం, బడేబాయి, నజిముద్దీన్, చిలకపాటి లక్ష్మయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్కమ్మ పేరంటాలుకు ఉగ్ర పూజలు

వెలిగండ్ల, మార్చి 9 : వెలిగండ్ల మండలం కవ్వంపాడు గ్రామంలో అక్కమ్మ పేరంటాలు తిరుణాళ్ల రెండురోజుల నుంచి ఘనంగా జరుగుతున్నాయి. శనివారం టీడీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అక్కమ్మ పేరంటాలును దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఉగ్రను ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, మెటాటి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర రెడ్డి, కేసరి రమణారెడ్డి, గుంటక జయరామిరెడ్డి, వెంకట శ్రీరాములు, రాజగోపాల్ పెరుగు శివ, భక్తులు పాల్గొన్నారు.

రేపు 'దిశా' సమావేశం : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానటరింగ్ కమిటీ(దిశా) సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో జరుగుతుందని కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చేతివృత్తులవారికి అండగా ఉంటా

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- ఆయన సమక్షంలో పార్టీలో చేరిన ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, మోటర్ మెకానిక్‌లు

కనిగిరి, మార్చి 9 : చేతివృత్తులు, మోటర్ ఫీల్డ్ వర్కర్‌లకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం ఎలక్ట్రికల్స్, మోటర్ మెకానిక్‌లు 50 కుటుంబాలతో పాటు, సీఎస్‌పురం మండలంలోని పెదరాజుపాలెం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలతో పాటు చిరువ్యాపారులు, చిరు వృత్తిదారులు చాలా నష్టపోయారన్నారు. ఓపక్క నిత్యావసర ధరలు అమాంతం పెంచేసి చేతివృత్తిదారుల కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేశారన్నారు. రోజువారీ పనులు చేసుకుని జీవించే చిరువృత్తుల వారు పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే చిరువ్యాపారులు, చిరువృత్తులు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ పనులు చేసుకునేవారికి ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీ రుణాల ద్వారా వారికి చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీపల్లి మండలం నుంచి వలసలు

కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం పెద ఇర్లపాడు, తలకొండపాడు, అడవిలోపల్లి గ్రామాల నుంచి డాక్టర్ ఉగ్ర సమక్షంలో అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పీసీపల్లి మండల నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో పోటెత్తిన చేరికలు

వైసీపీని వీడిన 175 కుటుంబాలు

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేరికలు తిరుణాళ్లను తలపిస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర ఉగ్రనరసిహారెడ్డి పాలనాదక్షతపై నమ్మకంతో పెద్ద ఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. హనుమంతునిపాడు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 175 కుటుంబాలు శనివారం మూకుమ్మడిగా వైసీపీకి గుడ్‌బై చెప్పి సైకిల్ ఎక్కారు. హనుమంతునిపాడు మండల కేంద్రం నుంచి 45 కుటుంబాలు, కొండారెడ్డిపల్లి గ్రామం నుంచి 26 కుటుంబాలు, రశీదుపురం గ్రామం నుంచి 8, కోటతిప్పల గ్రామం నుంచి 3, నీలకంఠాపురం గ్రామం నుంచి 22, ముప్పళ్లపాడు నుంచి 31 కుటుంబాలు, రామాయపల్లి గ్రామం నుంచి 15 కుటుంబాలు, వేములపాడు నుంచి 25 కుటుంబాలు వైసీపీని వీడారు. మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో తొలుత డాక్టర్ ఉగ్రను ఊరేగింపుగా మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. పలువురికి ఉగ్రకు మంగళహారతులిచ్చారు. చేరిన వారికి డాక్టర్ ఉగ్ర కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మీకు ఏ కష్టంవచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను గమనిస్తూ ప్రజాదరణతో ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, నాయకులు గాయం రామిరెడ్డి, శ్యామల వెంకటేశ్వర్లు, చీకటి వెంకటసుబ్బయ్య, మురహరి నరసయ్య, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హనుమంతునిపాడు మండలంలో డాక్టర్ ఉగ్ర సమక్షంలో చేరిన కుటుంబాలు



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన మెకానిక్‌లు



పూజలు చేస్తున్న బూచేపల్లి

వైభవంగా శివకల్యాణం

తాళ్లూరు, మార్చి 9 : మండలంలోని శివరాంపురం సమీపాన ఉన్న చిన అగస్త్యేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. అగస్త్య మహాముని కాలంలో ప్రతిష్ఠించిన శివునికి ఆనవాయితీగా శివరాత్రి మరుసటి రోజు కల్యాణం చేయడం ఆనవాయితీ. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మధ్యాహ్నం పూజల్లో పాల్గొన్నారు. శివునికి పత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బూచేపల్లిని సత్కరించారు. కల్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల నుంచి భక్తులు, మహి ళలు అధిక సంఖ్యలో పాల్గొని శివునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న దానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి,మాజీ ఎంపీపీలు మధుసూదన్‌రెడ్డి, రా మిరెడ్డి, మోషే, సర్పంచ్ బొడ్డురాములు, ఆలో కం హరిబాబు, ఆయల కమిటీ సభ్యులు శీ లం వెంకటరెడ్డి, యోహాను పాల్గొన్నారు.

బీఎంసీ మాతృమూర్తి లక్ష్మీదేవి మృతి



లక్ష్మీదేవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న పువ్వాడి

పొమూరు, మార్చి 9 : టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు స్వర్గీయ బొల్లా మాల్యాద్రిచౌదరి మాతృమూర్తి బిల్లా లక్ష్మీదేవి(90) శుక్రవారం మరణించారు. మండలంలోని పుట్టనాయుడుపల్లి గ్రామంలో లక్ష్మీదేవి మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరాములు, పువ్వాడి రామారావు, వెంకట్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, వైస్ ప్రసాద్‌రెడ్డి, ఇర్రి కోటిరెడ్డి, మన్నం రమణయ్య, జీ హహేష్, పోకా వినోద్, వీరబాబు, పూల మాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీ దేవి కోడలు జడ్పీటీసీ మాజీ సభ్యులు బొల్లా మహాలక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నరసింహారావును ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్ష్మీదేవి అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తున్నట్లు బొల్లా కుటుంబ సభ్యులు తెలిపారు.

యువ రైతు ఆత్మహత్య



వెంకటేశ్వర్లు

దర్శి, మార్చి 9: మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన యువ రైతు వి.వెంకటేశ్వర్లు (35) పురుగుమందు తాగి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు వెంకటేశ్వర్లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పొలానికి వెళ్లి మధ్యాహ్న సమయంలో పురుగు మందు తాగారు. విషయం తెలుసుకు న్న కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొం దు తూ సాయంత్రం మృతి చెందారు. ఆత్మహత్యకు రుణబాధలు కారణమని చెప్తు న్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాలు చోటుచేసుకోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హాల్‌టికెట్లలో తప్పుల సవరణకు అవకాశం

ఒంగోలు(విద్య), మార్చి 9 : ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లలో తప్పులు ఉంటే సవరించుకునేందుకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ అవకాశం కల్పించారు. విద్యార్థుల మీడియం, సబ్జెక్టుల్లో ఏమైనా తప్పులు ఉంటే సవరిస్తారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించి వారి మీడియం, సబ్జెక్టుల్లో తేడాలుంటే వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు తెలియజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డిసుభద్ర శనివారం ప్రకటనలో కోరారు.

మాగుంటను కలిసిన పలు ప్రాంతాల నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు కలుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మాగుంట అభిమానులతో పాటు పార్టీలకు అతీతంగా ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్న మాగుంటను ముందుగానే కలిసి తమ మద్దతు తెలుపుతున్నారు. ఒంగోలుతో పాటు కొండపి, సంతనూతలపాడు, దర్శి తదితర ప్రాంతాల నుంచి నగరంలోని మాగుంట నివాసానికి శనివారం తరలివచ్చారు. వారందరూ శ్రీనివాసులురెడ్డిని కలిసి బొకేలు ఇచ్చి అభినందిస్తున్నారు. మాగుం ట తీసుకొనే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని కొంత మంది భరోసా కలిస్తున్నారు. మరో వైపు ఒంగోలుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు మాగుంటతో భేటీ కాగా, నగరంలోని అధికార పార్టీతో పాటు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల వివరాలను నమోదు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9 : పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛ పారిశుధ్య కార్మికుల వివరాలను యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. స్వచ్ఛకార్మికుల జీవనోపాధిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

నిరుపయోగంగా ఎన్నెస్పీ క్వార్టర్స్

- ప్రభుత్వ భవనాలకు స్థలాలు లేక అవస్థలు
- వాటిని వాడుకుంటున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

తాళ్లూరు, మార్చి 9 : నాలుగు దశాబ్దాల కిందట మండలంలోని తాళ్లూరు, రామభద్రాపురం గ్రామాలందు నిర్మించిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్వార్టర్లు కొన్ని శిధిలంకాగా, మరికొన్ని క్వార్టర్లను ఆక్రమించుకుని వాడుకుంటున్నా అధికారులు పట్టించుకున్న నాథుడే లేరు. తాళ్లూరు ప్రాంతంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అధికారులు, సిబ్బంది నివాసం కోసం తాళ్లూరు, రామభద్రాపురం గ్రామాలందు దాదాపు 40 క్వార్టర్లను నిర్మించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు లేక పోవటంతో పట్టా భూములను కొనుగోలు చేసి క్వార్టర్ల నిర్మాణానికి భూములు అందజేయగా అధికార యంత్రాంగం ఎన్నెస్పీ క్వార్టర్లను నిర్మించింది. దాదాపు 15 ఏళ్ల పాటు ఎన్నెస్పీ అధికారులు, ఉద్యోగులు నివాసముంటూ కాలువ తవ్వక పనులు చేపట్టారు. అనంతరం సాగర్ శాఖ అధికారులు, ఉద్యోగులు పనులు పూర్తి కావడంతో క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లారు. దీంతో ఆయా గ్రామాలలో క్వార్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. 1987లో టీడీపీ ప్రభుత్వం మండల వ్యవస్థను ఏర్పాటు చేసితాళ్లూరును మండలంగా రూపొందించగా రెవెన్యూ, పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దీంతో నిరుపయోగంగా ఉన్న తాళ్లూరు ఎన్నెస్పీ క్వార్టర్లనందు ఆరెండు కార్యాలయాలను నెలకొల్పారు. ఆక్వార్టర్లు పరిపాలనకు సౌలభ్యంగా లేక పోవడం, క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో కార్యాలయాలను మార్పు చేశారు. అప్పటి నుంచి కార్వర్టర్లు కాళీగా వున్నాయి.అవి ప్రభుత్వ భవనాలు, అపై ఖాళీగా ఉండడంతో గ్రామంలోని కొందరు క్వార్టర్లను స్వాధీనం చేసుకుని నివాసాలు ఉంటూ గేదెలపాకలు, గడ్డివాములు వేసుకుని క్వార్టర్లలోని జీవనం సాగిస్తున్నారు. వాటి విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం లక్షల్లో ఉంది. క్వార్టర్ల నందు చిల్ల చెట్లు ఏపుగా పెరిగి, 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. తాళ్లూరులో ఎన్నెస్పీ క్వార్టర్లకు ఒక ఎకరా75 సెంట్లభూమి వుంది. తాళ్లూరులో ప్రభుత్వ భవనాలకు అనువైన ప్రభుత్వ భూములు లేక పోవడంతో 14 ఏళ్ల క్రితం అప్పటి పోలీస్ శాఖ అధికారులు నిరుపయోగంగా ఉన్న తాళ్లూరులోని క్వార్టర్స్‌ను అప్పగిస్తే పోలీస్ స్టేషన్, క్వార్టర్లు నిర్మిస్తామని చెప్పినప్పటికీ ఆ స్థలాన్ని ఎన్నెస్పీ అధికారులు పోలీసులకు అప్పగించలేదు. ఆక్వార్టర్స్ ఖాళీగా ఉండటంతో కొందరు స్వార్థపరులు ఈస్థలం తమకు చెందినదన్నట్లు క్వార్టర్లలో నివాసముంటున్నారు. శిథిలమైన క్వార్టర్లకు చెందిన రాళ్లు, కలపను అక్రమంగా తరలిస్తూప్రభుత్వ సోమ్మును గతంలోకొందరు స్వాహా చేశారు. అదేవిదంగా రామభద్రాపురంనందుకూడా దాదాపు 2 ఎకరాల్లోని ఎన్నెస్పీక్వార్టర్లు ఆక్రమణదారుల చేతులో ఉన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ భూములను రక్షిస్తామంటూ అధికార యంత్రాంగం చెప్తున్న మాటలు అమలుకు నోచుకోలేదంటున్నారు. ఆగ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనం, నిర్మాణానికి స్థలాలు లేక భవననిర్మాణ పనులు జరుగడం లేదు. అధికారులు మాత్రం ప్రభుత్వానికి చెందిన భూములు పరుల ఆధీనంలో ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. తాళ్లూరులో దశాబ్దా కాలం క్రితం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్, సిబ్బందికి క్వార్టర్లు లేవు. అందుకు సరిపడా స్థలం లేక శాశ్వత భవనాలు నిర్మితం కాలేదు. తాళ్లూరు లోని ఎన్నెస్పీ క్వార్టర్స్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్, క్వార్టర్స్‌ను నిర్మించాలని పోలీస్ శాఖ ప్రతి పాతిపాధనలు పంపినా అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖా అధికారులు స్పందించి తాళ్లూరు, రామభద్రాపురం గ్రామాల్లో పరుల ఆధీనంలో వున్న ఎన్నెస్పీక్వార్టర్లను స్వాధీనం చేసుకుని ప్రభుత్వభవనాల నిర్మాణానికి వినియోగ పడేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రామభద్రాపురంలో గేదెలకు ఆవాసంగా మారిన ఎన్నెస్పీ క్వార్టర్స్





కలసి కూటమిగా..

పొత్తులపై వైసీపీ విష ప్రచారం. ఉంటుందా.. ఉండదా.. అన్న అనుమానాలు.. నెల రోజులుగా ఇదిగో.. అదిగో.. అంటున్న టీడీపీ, బీజేపీ పొత్తు వ్యవహారం శనివారం నాటికి ఒక కొలిక్కి వచ్చింది. టీడీపీ - జనసేన - బీజేపీ పొత్తు కుదిరినట్లు కమలనాథులకు సందేశం అందింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని టీడీపీ, బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. జగన్ పాలనతో విసిగి వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదన్న భావనకి సగటు పౌరుడు కూడా వచ్చాడు. ఈ పరిస్థితుల్లో కలిసి కూటమిగా కదనరంగంలోకి దిగేందుకు టీడీపీ-జనసేన పార్టీలకు బీజేపీ తోడవడంతో వారి పొత్తులకు సర్వామోదం లభిస్తోంది. వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన కేంద్ర సంస్థలు తిరిగి రావాలన్నా.. అప్పుల భారం నుంచి ఉపశమనం కలగాలన్నా.. పాలన గాడిలో పడాలన్నా.. బీజేపీతో కలిసి నడవాల్సిన అవసరం ఉందని సామాన్యులు కూడా భావిస్తోండగా.. అదే జరగడంతో పలువురిలో కదనోత్సాహం నెలకొంది.

పొత్తు ఖరారుతో శ్రేణుల్లో సంబరాలు

- ఇప్పటికే టీడీపీ, జనసేన తాజాగా బీజేపీ
- పొత్తు కుదిరినట్లు కమలనాథులకు సందేశం
- సామాన్య ప్రజల నుంచి కూడా పొత్తుకు మద్దతు
- 17న చిలకలూరిపేట సభకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం - జనసేన - బీజేపీ పొత్తు కుదిరినట్లు భారతీయ జనతా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలకు సమాచారం అందింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా పేరుతో ఒక లేఖని మూడు జిల్లాల కార్యాలయాలకు పంపించారు. రాబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేయాలని నిర్ణయించినట్లు ఆలేఖలో పేర్కొన్నారు. ఒకటి రెండు రోజుల్లోనే సీట్ల సర్దుబాటు గురించి ప్రకటన చేస్తామన్నారు. ఈ కూటమికి రాష్ట్ర ప్రజలు పెద్దసంఖ్యలో మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు జేపీ నడ్డా తన సందేశంలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం బీజేపీ కేంద్ర కార్యాలయం నుంచి పొత్తు కుదిరిన సమాచారం రాగానే ఆ విషయాన్ని కింది స్థాయి నాయకులు, కార్యకర్తలకు స్థానిక నేతలు తెలిపారు. ఆదివారం నుంచే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పని చేయడం ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో టీడీపీ చేరిక, రాష్ట్రంలో ఉమ్మడి పోటీ, సీట్ల సర్దుబాటు వ్యవహారం కూడా తేలిపోయింది. పొత్తు పొడవకుండా చూడాలన్న అధికార వైసీపీ కుట్రలకు దీటైన జవాబిస్తూ పొత్తు ఖరారవడంతో మూడు పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పొత్తుపై అధికార పార్టీ చేసిన తప్పుడు ప్రచారాలకు సమాధానం చెప్పేందుకు తమ్ముళ్లు, జన సైనికులు సిద్ధమవుతున్నారు. కాగా ఈ నెల 17న ఆదివారం చిలకలూరిపేటలో టీడీపీ-జనసేన ఇదివరకే ఉమ్మడి మేనిఫెస్టో విడుదల భారీ బహిరంగ సభని నిర్వహించేందుకు నిర్ణయించాయి. ఇప్పుడు బీజేపీ కూడా వచ్చి కూటమిలో భాగస్వామ్యమైన దృష్ట్యా ఆ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీని హాజరు కావాల్సిందిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. అందుకు మోదీ సమ్మతించినట్లు సమాచారం. అయితే ప్రధాని మోదీ షెడ్యూల్‌ని బట్టి తేదీ అటు, ఇటు మారినా ఉమ్మడిగా 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి.

పదేళ్ల తర్వాత

పదేళ్ల తర్వాత ఎన్‌డీఏతో పొత్తు పెట్టుకుని టీడీపీ బరిలోకి దిగుతుంది. 2014లో బీజేపీతో పొత్తుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 అసెంబ్లీ నియోజకవర్గాలకు 16 నియోజకవర్గాల నుంచి టీడీపీ తమ అభ్యర్థులను బరిలోకి దించింది. 12 అసెంబ్లీ నియోజక వర్గాల్లో విజయం సాధించింది. పొత్తులో భాగంగా నరసరావుపేట అసెంబ్లీ నియోజక వర్గాన్ని బీజేపీకి కేటాయించగా అక్కడ నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన నల్లమోతు వెంకట్రావు 70 వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. 15 వేల ఓట్ల తేడాతో ఆయన పరాజయం పాలయ్యారు. ఈ పర్యాయం గుంటూరు జిల్లాలో బీజేపీకి పోటీ చేసే అవకాశం దక్కుతుందో లేదో మరో రెండు రోజుల తర్వాతకానీ వెల్లడి కాదు. అయితే గుంటూరు పశ్చిమ సీటు తమకు కేటాయిస్తారనే ఆశలో స్థానిక బీజేపీ నేతలు ఉన్నారు. అయితే వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి విడదల రజిని ఎదుర్కోవాలంటే ఇక్కడ టీడీపీకి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో అధిష్ఠానం ఉంది. గుంటూరు తూర్పు, నరసరావుపేట, పెదకూరపాడు అసెంబ్లీ స్థానాలను ఇంకా అధికారికంగా టీడీపీ ఖరారు చేయలేదు.

పొత్తును స్వాగతిస్తున్నాం..



టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తును స్వాగతిస్తున్నాం. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను అధిగమించి అభివృద్ధి సాధించాలంటే కేంద్ర సహకారం అవసరం కనుకనే చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారు. మైనారిటీల ప్రయోజనాలను కాపాడడంలో తెలుగుదేశం ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. బీజేపీతో పొత్తు వల్ల ముస్లింలు టీడీపీకి దూరమవుతారన్న ప్రచారంలో వాస్తవం లేదు.

-షేక్ మొహిద్దీన్, చీరాల

అనివార్యమనే భావన..

వైసీపీ పాలనలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఘోరంగా దెబ్బతింది. నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాజధాని నిర్మాణం ఎక్కడికక్కడ ఆగిపోయింది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికరంగం ఘోరంగా దెబ్బతింది. ఫలితంగా ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లాలోని టీడీపీ, జనసేన శ్రేణులపై అధికార వైసీపీ లెక్కలేనన్ని దాడులకు పాల్పడింది. ఫ్యాక్షన్ రాజకీయాలు పల్నాడు సరిహద్దులు దాటి జిల్లా అంతటా విస్తరించాయి. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా బీసీలపై దాడులు, తగలబెట్టడాలు, మహిళలపై దాడులు, ట్రాక్టర్లతో తొక్కించి చంపడాలు, మైనార్టీలు, దళితుల పథకాల రద్దుతోపాటు అనేక ప్రాంతాల్లో వక్ఫ్ భూములు, చర్చిల ఆస్తుల ఆక్రమణలు వంటి ఎన్నో ఘటనలు జిల్లా వాసులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు, దళిత, బీసీ వర్గాలు టీడీపీ, బీజేపీ పొత్తుపై సానుకూల వైఖరితో ఉన్నట్లు సమాచారం. రాజధాని నిర్మాణం కొనసాగాలన్నా, త్వరితగతిన పూర్తై రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి రావాలన్నా కేంద్రంలో అధికారం చేపట్టగలిగే జాతీయపార్టీ అండ అనివార్యమని రాజధాని వాసులే కాకుండా మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు.

పొత్తుతో రాష్ట్రానికి మేలు..



ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం తీరు బాగాలేదు. నియంతృత్వపోకడలు పోతున్న ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తిపోయారు.ఈ పరిస్థితుల్లో టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరడం శుభపరిణామం. ఈ కలయిక రాష్ట్రానికి మేలు చేస్తుంది. నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించడానికి ఏకమవుతున్నారు. ఇది ఓటర్లలో కూడా మంచి మార్పునకు దారితీస్తుంది. ప్రజాకంటక పాలనను ఓడించేందుకు ప్రజలు ఏకం కావాలి.

- శివరామిరెడ్డి,అవగాహన సంస్థ కార్యదర్శి, గుంటూరు

కలయిక శుభపరిణామం



రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో టీడీపీ, జనసేనలు బీజేపీతో కలవడం శుభపరిణామం. వీరి పొత్తు రాష్ట్రానికి మేలు చేస్తుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీతో ఆదుకుంటే ప్రజలకు మరింత మేలు చేసినట్లవుతుంది. మొత్తంగా అభివృద్ధి దిశగా పాలనకు ఉపయుక్తంగా ఉంటుంది.

- రంగా బాలకృష్ణ, హోల్‌సేల్ గెయిన్స్, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, గౌరవాధ్యక్షుడు గుంటూరు

రాష్ట్రం అభివృద్ధి కోసం..



రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం వైసీపీ ప్రభుత్వం మరిచిపోయింది. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగ యువతకు ఉపాధి లభించాలన్నా, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అవసరం. ఐదేళ్లుగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుండగా, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నుల భారంతో సామాన్యులు అల్లాడుతున్నారు. పేదల ఆదాయం మాత్రం పెరగడంలేదు. రాష్ట్రంలో ఉపాధిలేక యువత ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర భవిష్యత్ కోసం ముగ్గురు పొత్తును స్వాగతిస్తున్నాం.

- షేక్ నాగూర్, ములకలూరు, నరసరావుపేట మండలం

పొత్తు అనివార్యం



గడిచిన ఐదేళ్ళుగా రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు పెరిగాయి. ఎస్సీ ఎస్టీల సంక్షేమం లేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అనివార్యమే. గడిచిన ఐదేళ్లగా ఆదాయాలు పెరగలేదు కాని,నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో పేదలకు కుటుంబ పోషణ భారంగా మారింది.

- కూకట్లపల్లి రాజు, పాలపాడు, నరసరావుపేట



- బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన బృందం

బొప్పూడిలో కూటమి బహిరంగ సభ

చిలకలూరిపేట అర్బన్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో విడుదల బహిరంగ సభ ఈ నెల 17న చిలకలూరిపేట మండలం బొప్పూడిలో నిర్వహించాలని ఉమ్మడి నాయకత్వం నిర్ణయించినట్లు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఆయన శనివారం సభ జరిగే స్థలాన్ని పరిశీలించారు. బొప్పూడి సమీపంలో 150 ఎకరాల స్థలాన్ని గుర్తించామని, ఈ స్థలం బహిరంగ సభకు అన్ని విధాలా అనువుగా ఉంటుందని కూటమి నేతలు నిర్ణయించారన్నారు. టీడీపీ ఎన్‌డీఏ కూటమిలో చేరిన తర్వాత జరగబోయే సభను విజయవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు ఆయన పిలుపిచ్చారు. పది లక్షల నుంచి 15 లక్షల మంది ఈ సభకు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రధాని నరేంద్రమోదీతో పాటు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హాజరవుతారన్నారు. సభ ఏర్పాట్లకు మూడు పార్టీ నేతలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. టీడీపీ, జనసేన ఎన్‌డీఏ కూటమిలో చేరడాన్ని వైసీపీ జీర్ణించుకోలేక పోతున్నదని, జగన్‌లో అప్పుడే ఓటమి భయం మొదలైందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా కూటమికి ప్రజా ఆశీర్వాదం లభిస్తుందన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఒక ఛాన్స్ అంటూ జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తోట రాజారమేష్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయాలన్నారు. పొత్తు ఖరారైన తర్వాత నిర్వహించనున్న తొలి బహిరంగ సభ చరిత్రలో నిలిచి పోయేలా చేస్తామన్నారు. బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, నరసరావుపేట టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నాయకులు పెందుర్తి వెంకటేష్, దామచర్ల సత్య, ఘంటా గౌతమ్, పరుచూరి కృష్ణ తదితరులు స్థల పరిశీలన చేశారు.

నేడు ప్రయాణమెలా?

- పల్లెవెలుగు సర్వీసులన్నీ సిద్ధం సభకు
- ఉమ్మడి జిల్లా నుంచి మేదరమెట్లకు 601 బస్సులు



గుంటూరు, మార్చి 9: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకర్గం మేదరమెట్లలో ఆదివారం జరిగే వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులన్నీ బారులు తీరుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డిపోల నుంచి 601 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు. డిపోల్లోని సగంపైన బస్సులను సిద్ధం సభకు తరలించిన అధికారులు ప్రయాణికులను కష్టాలను గాలికి వదిలేశారు. డిపోల్లోని పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీసులను తరలిస్తున్నారు. విభజిత గుంటూరు జిల్లా ఐదు డిపోల నుంచి 193(గుంటూరు-1 డిపో 64, గుంటూరు-2 డిపో 44, తెనాలి 40, మంగళగిరి 23, పొన్నూరు 22), పల్నాడులోని ఆరు డిపోల నుంచి 264, బాపట్లలోని మూడు డిపోల నుంచి 144 బస్సులను వైసీపీ సభకు తరలిస్తున్నారు. మంగళగిరి డిపోలో పల్లెవెలుగు సర్వీసులు ఉన్నవే 24 అందులో 23 సర్వీసులు సిద్ధం సభకు కేటాయించేశారు. గుంటూరు-1 డిపోలో 65 పల్లెవెలుగు సర్వీసులుండగా అందులో 64 బస్సులు తరలించారు. డిపోల్లో అసలే డొక్కు బస్సులు కాగా అరకొరగా ఉన్న మంచి కండిషన్ బస్సులను మేదరమెట్లకు జనాన్ని తరలించేందుకు కేటాయించారు. శనివారం సాయంత్రం నుంచే బస్సులను కేటాయించిన ప్రాంతాలకు తరలించారు.

గుడారాల భక్తులకు కష్టాలే..

గుంటూరు సమీపంలోని గోరంట్లలో గుడారాల పండుగ ఆదివారంతో ముగుస్తుంది. ఈ క్రమంలో గుంటూరు నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండనున్నది. ఉన్న బస్సులే సరిపోని పరిస్థితి నెలకొంటే ఇక బస్సులన్నీ మేదరమెట్లకు తరలిస్తే భక్తుల రాకపోకల పరిస్థితిపై ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు లేని పరిస్థితుల్లో లక్షల్లో ఉన్న భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

జన సమీకరణకు టార్గెట్లు..

మేదరమెట్ల సభకు వలంటీర్లకు కూడా టార్గెట్లు పెట్టారు. గుంటూరు నగర పరిధిలోని ఒక్కో డివిజన్‌కు ఐదు బస్సులపైనే కేటాయించారు. ఆ బస్సులను ప్రజలతో నింపాల్సిన బాధ్యతను పార్టీ నేతలతో పాటు వలంటీర్లకు కూడా కేటాయించినట్లు తెలిసింది.



కల్యాణం.. కమనీయం

- కన్నుల పండువగా కల్యాణోత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన అమరేశ్వరాలయం, కాకాని మల్లన్న సన్నిధిలు
- నేడు అమరావతిలో దివ్య రథోత్సవం


అమరేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు



చిలుక, నంది, మిద్దె వాహనాలపై స్వామివార్ల గ్రామోత్సవం

అమరావతి, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినం శుక్రవారం రాత్రి లింగోద్భవ అభిషేకాల అనంతరం అమరావతి అమరేశ్వరస్వామి, పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామివార్ల కల్యాణాలను తిలకించి పరవశం పొందారు. ప్రత్యేక అలంకరణలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి వేదికపైకి తీసుకురాగా వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాలు.. భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణోత్సవాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అమరావతి ఆలయంలో మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. రాత్రి రెండు గంటలకు ఎదురుకోల ఉత్సవం అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పీఠంపై అధిష్ఠించారు. కల్యాణోత్సవం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచింది. కల్యాణ వాఖ్యాతలుగా నాగేశ్వరశర్మ, మాచిరాజు వేణుగోపాల్ వ్యవహరించారు. నూతన దంపతులైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వార్లను శనివారం ఉదయం చిలుక, నంది, మిద్దెరథ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించా రు. వాహనాలను పూలతో అలంకరించి స్వామివార్లను ప్రతిష్ఠించి సేవకులు గ్రామోత్సవం చేయించారు. సాయంత్రం కీలు గుర్రం సేవ జరిగింది. అమరావతిలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివార్ల దివ్యరథోత్సవం జరుగు తుందని ఈవో వేమూరి గోపి తెలిపారు. 170 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ బ్రహ్మం తెలిపారు.

పెదకాకాని: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాకాని దేవస్థానంలో మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు, పాలకమండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, కొమ్మూరి శివరత్నాలు, తోట రవీంద్ర, కారంకి నాగేశ్వరమ్మ, గంగవరపు మల్లేశ్వరరావు, గుమళ్ళ వెంకటరావు, చీడిపూడి అరుణ, పాలడుగు వెంకటేశ్వరరావు, మందాళ జ్యోతి, కాట్రోతు పార్వతి తదితరులు ఉన్నారు.





మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, వీక్షిస్తున్న భక్తులు

పడిపోయిన యడవల్లి భారీ విద్యుత్‌ప్రభ

- ఒకరికి గాయాలు.. రెండు ట్రాక్టర్లు ధ్వంసం



పడిపోయిన యడవల్లి భారీ విద్యుత్‌ప్రభ

నరసరావుపేట, మార్చి 9 : కోటప్పకొండ తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసింది. భారీ విద్యుత్ ప్రభలు తిరిగి గ్రామలకు చేరుకోనే సమయంలో అపశృతి చోటు చేసుకుంది. పెద్ద ప్రమాదం తృటిలో తప్పిపోయింది. చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామ ప్రభను యూటి సెంటర్‌లో హెచ్‌టీ లైన్ కింద గుండా తరలి స్తున్న సమయంలో శనివారం ఉదయం 9గంటల సమయంలో ప్రభ పడిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో వారు పరుగులు తీశారు. ప్రభ పంబతాళ్ల బ్యా లెన్స్ తప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రభ నిర్వాహకులు తెలిపారు. 15 నిమిషాల్లో గ్రామం చేరుతుందని భావించిన తరుణంలో ఒక్కసారిగా ఊహించని విధంగా ప్రమాదం జరగడంతో నిర్వహకులు డీలా పడ్డారు. ప్రమాదంలో జవ్వా జీ నాగేశ్వరరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా రెండు ట్రాక్టర్లు, ప్రభకు అమర్చిన విద్యుత్ మండపం ధ్వంసమయ్యాయి. రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగింది.

కోటయ్య స్వామి తిరునాళ్ల ఆదాయం రూ.1.63 కోట్లు

కోటప్పకొండ (నరసరావుపేట), మార్చి 9: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు దేవస్థానానికి రూ.1,63,48,227 ఆదాయం లభించినట్లు ఆల య ఈవో జీ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. గత ఏడాది కంటే రూ.10.19 లక్షలు ఆదాయం తగ్గింది. గత ఏడాది రూ.1,73,67,389 ఆదాయం వచ్చింది. దర్శ నం, అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.54.99 లక్షలు, హుండీల ద్వారా రూ. 70.53 లక్షలు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.35.92 లక్షలు లభించిందని ఈవో వివరించారు. బంగారం 49 గ్రాములు, వెండి కానుకలు 506 గ్రాములు వచ్చా యన్నారు. దేవస్థానంలో ఈవో జీ శ్రీనివాసరెడ్డి, దేవదాయశాఖ అధికారులు శ్రీధర్‌రెడ్డి, మంజూష పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. దేవస్థానం ఆదాయం గత ఏడాది కంటే గణనీయంగా తగ్గింది. తిరునాళ్ల ఆదాయం రూ.10.19 లక్షలు గత ఏడాది కంటే తగ్గడం గమనార్హం. అలాగే తలనీలాల ద్వారా వచ్చే ఆదాయం కూడా రూ.19.32 లక్షలు తగ్గింది. వెరసి

గణనీయంగా తగ్గిన ఆదాయం

దేవస్థానం ఆదా యం రూ.29.51 లక్షలు తగ్గినట్లు కార్యాలయ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆదాయం తగ్గుదలకు రెవెన్యూశాఖ వేలాదిగా వీఐపీ పాసుల జారీ ప్రభావం పడిందని చెప్పవచ్చు. వీఐపీ పాసుల వలన సామాన్య భక్తులు స్వామి దర్శనం కోసం ఇక్కట్లు పడ్డారు. దేవస్థానం జారీ చేయాల్సిన వీఐపీ పాసుల జారీని రెవెన్యూ శాఖ తీసుకోవడంపై కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి.

వీఐపీ పాసుల జారీ ఎఫెక్టు

20 వేలకు పైగా వీఐపీ పాసులు పంపిణీ చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రూ.100, రూ.200, రూ.300 దర్శనం టిక్కెట్ల కొనుగోలు తగ్గిందంటున్నారు. గత ఏడాది టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 65.01 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ సారి రూ. 54.99 లక్షలు ఆదాయం వచ్చింది. దాదాపు రూ.10 లక్షల ఆదాయం టిక్కెట్ల విక్రయంలో తగ్గింది.


మంత్రి కార్యాలయం నుంచి గిఫ్టలతో వెళ్తున్న వలంటీర్లు

మంత్రి ప్రలోభాల పరంపర

- వలంటీర్లకు మొన్న రూ.5వేలు.. నేడు గిఫ్టులు పంపిణీ
- ఈసీ సూచనలు బేఖాతర్
- గెలుపుకోసం అడ్డదార్లు తొక్కుతున్న సురేష్

సింగరాయకొండ, మార్చి 9 : కొండపి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి ఆదిమూలపు సురేష్‌కు నియోజకవర్గంలో సానుకూల వాతావరణం కనిపించటం లేదు. దీంతో ఆయన గెలుపుకోసం అడ్డదార్లు తొక్కుతూ నానాఆగచాట్లు పడుతున్నారు. తాయిలాలను ఎరగాచూపి ఓటర్లను ప్రలోభపెట్టే మార్గంపై ప్రధానంగా దృష్టి సారించారు. అందులో భాగంగా నియోజకవర్గంలో నిరంతరం ప్రలోభాల పరంపరను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పల్లెపల్లెకూ సురేష్ కార్యక్రమం పేరుతో ఆయన గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలకు ప్రజలు, సొంతపార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి స్పందన కరువైంది. దీంతో వివిధ వర్గాలతో ప్రత్యేక ఆత్మీయ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. వారికి తాయిలాలు ఎరవేసి ఎన్నికల్లో తనకు మద్దతుగా పనిచేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని వలంటీర్లకు రూ.5వేలు చొప్పున నగదును పంపిణీ చేశారు. శనివారం సింగరాయకొండలోని మంత్రి క్యాంపుకార్యాలయంలో మరోదఫా ఆరు మండలాల వలంటీర్లకు మంత్రి సురేష్ గిఫ్టబాక్సలను అందజేశారు. వీటిలో రైసు కుక్కర్లు, హాట్‌బాక్స్‌లు, డిన్నర్‌సెట్‌లు, టీకప్పులు, ఫ్లాస్కోలు ఉన్నాయి. వీటిని వలంటీర్లకు వందనం అనేపేరు, సీఎం జగన్ ఫొటో ముద్రించిన సంచిలో ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ఈ ఎన్నికల్లో వలంటీర్లు కీలకంగా పనిచేయాలని, ప్రతి ఇంటికీ వెళ్లి వైసీపీకు ఓటవేయాలని ప్రచారం నిర్వహించాలని సూచించినట్లు తెలుస్తోంది. ముున్ముందు మరిన్ని ప్రోత్సాహకాలు ఉంటాయని వలంటీర్లకు హామీ ఇచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో అధికభాగం విలేకరులకు కూడా ప్యాంట్, షర్టు, చీరతో కూడిన గిఫ్ట్ బాక్సులను, పాస్టర్లకు దుస్తులు సురేష్ అందజేశారు. త్వరలో నియోజకవర్గంలో ఓటర్లకు సైతం తాయిలాలు పంపిణీ చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాల్సిన వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కేవలం ప్రలోభాలను మాత్రమే నమ్ముకొని రాజకీయం చేయటంపై ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లకు తాయిలాల ఎర

- ఒక్కొక్కరికి రూ.6వేల విలువైన గిఫ్టబాక్సులు పంపిణీ
- అడ్డదారులు తొక్కుతున్న వైసీపీ నాయకులు


వలంటీర్లకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న గిఫ్ట్ బాక్సలు పంపిణీ

తర్లుపాడు, మార్చి 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు వైసీపీ నాయకులు అడ్డదార్లు తొక్కుతున్నారు. ఈ క్రమంలో వలంటీర్లకు రెండోసారి తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ఒక్కొక్క వలంటీర్‌కు రూ.5వేల నగదు, స్వీట్ బాక్సు పంపిణీ చేయగా తాజాగా శనివారం మండలంలోని వలంటీర్లకు రెండోసారి తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. తర్లుపాడు సచివాలయం వద్ద తర్లుపాడులోని 29మంది వలంటీర్లకు రూ.6వేల విలువైన రైస్ కుక్కర్, స్టీల్ వాటర్ బాటిల్ సెట్, స్టీల్ హాట్ బాక్స్ సెట్, టీ గ్లాస్‌ల కిట్టు నాలుగు రకాల వస్తువులను ఒక సంచిలో పెట్టి వైసీపీ నాయకులు వలంటీర్లకు అందజేశారు. మండలంలోని 200 మంది వలంటీర్లకు ఇలా పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ గిఫ్ట్ బాక్సులపై మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటోలతో స్టిక్కర్లు అంటించి ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో వలంటీర్లు వైసీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. శనివారం మార్కాపురం నుంచి గిఫ్టబాక్సులను ఒక ఆటోలో తీసుకొచ్చి సచివాలయం వద్ద వైసీపీ నాయకులు పంపిణీ చేశారు. శనివారం సెలవు కావడంతో సచివాలయాలకు తాళాలు వేసి ఉన్నాయి. 10 రోజుల క్రితం మండలంలోని 10 సచివాలయ ఉద్యోగులకు స్వీట్ బాక్సులను కూడా పంపిణీ చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాల్సిన వలంటీర్లకు వైసీపీ నాయకులు అక్రమంగా తాయిలాలు ఇవ్వడంపై ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగాలిప్పిస్తానని ఆర్మీ ఉద్యోగి మోసం

- రూ.27లక్షల ఇచ్చి మోసపోయామని బాధితుల ఆవేదన
- మదర్ డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ పేరుతో బురిడీ
- ఒకరిది పామూరు, మిగతా నలుగురిది తెలంగాణ రాష్ట్రం నిర్మల్
- డబ్బులు అడిగితే ఆత్మహత్య చేసుకోండని బెదిరిస్తున్న మోసగాడు


ఆర్మీ ఉద్యోగికి ఫోన్ పే చేసినట్లు చూపుతున్న బాధితులు

పామూరు, మార్చి 9 : ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువకుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసగించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పామూరుకు చెందిన ఎస్కే ఇమామ్, తెలంగాణ రాష్ట్రం నిర్మల్ ప్రాంతానికి చెందిన సీహెచ్. సాయికిరణ్, ఎస్.సాయికుమార్, ఎం.తరుణ్‌కుమార్, బీ సందీప్ అనే యువకులు పామూరు పోలీస్ స్టేషన్‌కు సమర్పించనున్న వినతిపత్రంలో తెలిపిన వివరాలిలావున్నాయి. పామూరు మండలం మార్కొండాపురం పంచాయతీ సోమన్నపల్లి గ్రామానికి చెందిన డబ్బుకొట్టు మల్లికార్జున, డబ్బుకొట్టు మనోహర్, బొట్ల నాగార్జున ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిర్మల్‌కు చెందిన మదర్ డ్రీమ్ డిఫెన్స్ సంస్థ పేరుతో నమ్మించి ఇమామ్ దగ్గర నుంచి రూ.16లక్షల50వేలు, సాయి కిరణ్ నుంచి రూ.4లక్షల50వేలు, తరుణ్ కుమార్ నుంచి రూ.3లక్షలు, సాయికుమార్ నుంచి రూ.3 లక్షలు, సందీప్ కుంచి రూ.లక్ష వసూలు చేసి మోసం చేశారని ఆ వినతిలో పేర్కొన్నారు. డబ్బుకొట్టు మల్లికార్జున రూ.100 స్టాంప్ పేపర్లపై సాయికిరణ్, తరుణ్‌కుమార్, సాయికుమార్ నుంచి నగదు తీసుకున్నట్లు, ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పించలేని లేనిపక్షంలో రూ.2 వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తానని అగ్రిమెంట్ రాసి ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. ఈ వ్యవహారం 2021లో జరిగింది. అనుమానం వచ్చి మా డబ్బులు మాకు ఇవ్వాలని అడిగితే మీరు తనను ఏమీ చేయలేరని ఎదురుతిరిగి బెదిరిస్తున్నారని, నాకు కేసులు కొత్త కాదని, నా మీద చాలా కేసులు ఉన్నాయని, అవసరమైతే పోలీసులను లంచం ఇచ్చి కొనేస్తానని, మీరు ఫిర్యాదు చేస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వనని, ఆత్మహత్య చేసుకోవాలని బెదిరిస్తున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. షేక్ ఇమామ్ తనవద్ద రూ.4లక్షలు తీసుకోవడంతోపాటు ఇన్నోవా కారుకు కోసం రూ.13 లక్షలు కట్టి, మొత్తం ఫైనాన్స్ చెల్లించిన తరువాత కారు నాదని అడ్డం తిరిగి మల్లికార్జున సొంతం చేసుకున్నట్లు తెలిపారు. సుమారు 50 నుంచి వంద మంది వరకు ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూల చేసి మోసం చేశారని ఆ వినతిపత్రంలో తెలిపారు. భారీ మోసానికి పాల్పడిన మోసగాడు మల్లికార్జునను అదుపులోకి తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆ వినతిలో కోరారు.

సిద్ధంగా లేం..!

సిద్ధం సభకు వచ్చేందుకు మేం సిద్ధంగా లేం, ఏం చేశారని రావాలి.. అంటూ గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీ సర్పంచ్‌లు, నాయకులు ఆ పార్టీ నేతలను ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్లయితే రామని తేల్చిచెప్పటమేకాక, ఏకంగా మండలాల వారీ తీర్మానాలు చేసుకుని తెలియ చేస్తున్నారు. ఇంకోవైపు వైసీపీలోని అసమ్మతి నేతలు కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వారి అనుచరులు అదేదారిలో ఉన్నారు. భారీగా తాయిలాలు ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలతో జన సమీకరణలో తడబాటుకు గురవుతున్నారు. కందుకూరు మండలంలో 19 గ్రామాల్లో వైసీపీకి ఉన్న సర్పంచ్‌లు, గ్రామస్థాయి నాయకులు తీర్మానం చేసుకునని తెలియజేయగా, దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి అనుచరులు, చీరాలలో ఆమంచి అనుచరులు, మరికొన్ని నియోజకవర్గాల్లో కీలక నాయకులు, వారి అనుచరులు సిద్ధం సభకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

- గ్రామాల్లో ఎదురుతిరుగుతున్న సర్పంచ్‌లు, పార్టీ నేతలు
- దూరంగా ఉండాలని అసంతృప్తి నేతల నిర్ణయం
- కందుకూరులో సభకు వెళ్లకూడదని తీర్మానించిన వైసీపీ నేతలు, సర్పంచ్‌లు
- ఎమ్మెల్యే మద్దిశెట్టి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి అనుచరుల తీరు అదే
- వచ్చేవారికి లిక్కర్ సరఫరా చేస్తూ, మహిళలను వద్దని చెప్తున్న వైసీపీ నేతలు


బస్సులన్నీ సిద్ధం సభకు తరలించడంతో బస్టాండ్ వద్ద పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగసభ ఆదివారం కొరిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలో నిర్వహిస్తున్నారు. హైవేని ఆనుకుని సభ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం ఉదయం 10గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హైవేపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఒంగోలు నుంచి గుంటూరు వరకు సాధారణ ప్రయాణికుల వాహనాలు తిరగకుండా అడ్డుకట్ట వేశారు. ఈ రోడ్డు మొత్తం సిద్ధం సభకు వచ్చే ఆ పార్టీశ్రేణుల వాహనాల కోసమే కేటాయించారు. జిల్లాలో పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని బందోబస్తుకు కేటాయించి స్టేషన్లను ఒకరోజు మూతేసే స్థాయికి తీసుకెళ్లారు. పరోక్షంగా పలు శాఖల ప్రభుత్వ యంత్రాంగం అంతా గత మూడురోజుల నుంచి సిద్ధం సభ ఏర్పాట్లు, జనసమీకరణ ఏర్పాట్లలోనే నిమగ్నమయ్యారు. ఇక ఆదివారం పూర్తి స్థాయిలో ఆర్టీసీ బస్సులను అటు మళ్లించారు. శనివారం మధ్యాహ్నం నుంచే అనేక డిపోల్లోని బస్సులు సిద్ధం సభ కోసం గ్రామాలకు పంపారు. ఇక భారీగా ప్రజలను తరలించేందుకు అటు పార్టీ నాయకులతోపాటు, వలంటీర్లకు, సాధారణ పార్టీశ్రేణులకు భారీ తాయిలాలు పంచారు. సభకు వచ్చేవారికి ఒక్కొక్కరికి రూ.350 నుంచి రూ.600 వరకు డబ్బులు ఇవ్వటంతోపాటు, బిర్యానీ పొట్లాలను, లిక్కర్ బాటిళ్లు, గ్లాసు, మంచినీళ్ల బాటిల్ కలిపి ప్రత్యేక ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇంతచేసినా ఆశించిన స్థాయిలో ప్రజలు వస్తారన్న నమ్మకం కలగకపోవటంతో శనివారం సాయంత్రం నుంచి ఇచ్చే తాయిలాల మోతాదును పెంచేశారు.

మేం రామంటే రాం...

కాగా గ్రామస్థాయిలోని వైసీపీ సర్పంచ్‌లు, ఓడిపోయి పార్టీ పెత్తనం చూస్తున్న సర్పంచ్ అభ్యర్థులు, ఇతరత్రా అసంతృప్తి ఉన్న నాయకులు సిద్ధం సభకు తాము రామంటే రామని తేల్చి చెప్పేస్తున్నారు. లక్షలు పోసి గెలిస్తే పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోగా మా అధికారాలను కోసేశారంటూ జగన్ పాలన తీరుతెన్నులను ఎండగడుతున్నారు. సర్పంచుల నుంచి ఈ రకమైన వ్యతిరేకత బహిర్గతం కావటంతో వైసీపీ నేతలంతా నిర్ఘాంతపోతున్నారు. మరోవైపు వివిధ కారణాలతో అసంతృప్తితో ఉన్న నేతల అనుచరులు కూడా సభకు రామని తేల్చి చెప్తున్నారు.



సిద్ధం సభకు వాహనాల దారిమళ్లింపు

ఆంక్షలు పాటించండి: ఎస్పీ

ఒంగోలు(క్రైం) : సిద్ధం సభ కారణంగా రహదారులపై వాహనాలను దారిమళ్లించినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజలు, వాహన చోదకులు ఆంక్షలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడులో సిద్ధం సభ ఆదివారం జరగనుంది. దీంతో ప్రజలు భారీసంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా దారిమళ్లించినట్లు తెలిపారు. ఈ ఆంక్షలు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 8 గంటల వరకు అమలులో ఉంటాయని ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

కందుకూరులో తీర్మానం చేసిన వైసీపీ నాయకులు

కందుకూరు మండలంలో 19 పంచాయతీల్లో సర్పంచులుగా ఉన్న వైసీపీ నేతలు ఇతర గ్రామాల్లో పార్టీ పెత్తనం చూస్తున్న నాయకులు సమావేశమై, తామే కాకుండా తమ గ్రామాల నుంచి సిద్ధం సభకు ఒక్కరిని కూడా రానివ్వమని తేల్చేశారు. తదనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుని, అందుకు ఒకేబాటలో పయనించాలని తీర్మానించారు. గ్రామాల అభివృద్ధిని జగన్ నిర్లక్ష్యంగా చేయటంతోపాటు ఎమ్మెల్యే మహీధరరెడ్డికి టికెట్ ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్తున్నారు. అంతేకాక మహీధరరెడ్డి నిర్ణయానికి అనుగుణంగా కూడా నడవవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కందుకూరు మండల నాయకలు తీసుకున్న నిర్ణయాలను తెలుసుకుని ఇతర మండలాల వైసీపీ నాయకులు అదే నిర్ణయం తీసుకునేందుకు శనివారం రాత్రికి రాత్రి సమావేశమవుతున్నారు. అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కూడా ఈ కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నియోజకవర్గంలోని ఆయన అనుచరులు కూడా ఈ సభకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి, ఆయన అనుచరులు అదే నిర్ణయంతో ఉన్నారు. అద్దంకి నియోజకవర్గంలో మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య వర్గం అదే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అనుచరుల్లో కొందరు సభకు వెళుతుండగా, అత్యధికులు దూరంగా ఉంటున్నారు.

471 బస్సులకుగాను 320 సీఎం సభకే

ప్రకాశం రీజియన్‌లో ప్రభుత్వ, హయర్ బస్సులన్నీ కలిపి 471 వరకు ఉన్నాయి. వాటిలో ప్రతిరోజు వేలమంది ప్రయాణిస్తుంటారు. ప్రజారవాణా ద్వారా ఆర్టీసీకి రోజువారీగా రూ.50లక్షల వరకు ఆదాయం చేకూరుతోంది. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం పార్టీ ప్రచారసభ కోసం జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోల నుంచి సుమారుగా 320 బస్సులు కేటాయించారు. బస్టాండ్‌లో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల దారిమళ్లింపు వివరాలు

నెల్లూరు వైపు నుంచి ఒంగోలు మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలు, ఒంగోలు నుంచి చీమకుర్తి, మార్కాపురం, కుంట జంక్షన్ నుంచి మాచర్ల మీదుగా వెళ్లాలి. ఒంగోలు నుంచి విశాఖపట్నం ఎన్‌హెచ్-16 పై వెళ్లే వాహనాలు త్రోవగుంట నుంచి ఎన్‌హెచ్ -216 మీదుగా చీరాల, బాపట్ల నుంచి మచిలిపట్నంవైపు దారిమళ్లించారు.ఒంగోలు నుంచి గుంటూరు, విజయవాడ వెళ్లే వాహనాలు త్రోవగుంట వద్ద నుంచి చీరాల, బాపట్ల, పొన్నూరు మీదుగా దారిమళ్లించారు.

పట్టాల పేరుతో మోసం..

- వాటికి చట్టబద్ధత లేదు
- నిందలు నిరూపించగలవా?
- టిడ్కో ఇళ్లపై రుణాలు తీసుకుని మోసం చేసింది వైసీపీనే
- బాలినేనిపై దామచర్ల ధ్వజం


పట్టాను చూపుతున్న జనార్దన్, రియాజ్

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 9: 'ఇళ్ల పట్టాల పేరుతో ప్రజలను మోసం చేయడం మానుకోవాలి. పదే పదే అబద్ధాలు చెప్పి మాయ చేయడం ఎమ్మెల్యే బాలినేనికి అలవాటుగా మారింది. తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా, లబ్ధిదారుల పేరుతో భారీగా రుణాలు తీసుకున్నారు. వాటిని ఏం చేశారు?' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్‌లో జనసేన ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ రియాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యరజర్ల వద్ద ఇళ్ల స్థలాలు ఇస్తుంటే తాము అడ్డుకున్నామని ఎన్నిసార్లు అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. అక్కడ పట్టాలకు వీలు కాదనే టీడీపీ హయాంలో ప్రతిపాదించిన టిడ్కో ఇళ్లు, ట్రిపుల్ ఐటీ, స్టేడియం నిర్మాణాలు విరమించుకుని వేరే ప్రాంతాల్లో కట్టామన్నారు. టీడీపీ హయాంలో 80శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను వైసీపీ పూర్తి చేయకలేకపోయిందని, ఆ పని చేతకాక, లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని, ఆ సొమ్ము ఏమైందో చెప్పాలన్నారు. రుణాల పేరుతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు జగన్ సొంత ఖాతాకు జమ చేసుకున్నారని విమర్శించారు. నేటికి టిడ్కో లబ్ధిదారులు బ్యాంకుల్లో రుణాలకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారని మండిపడ్డారు. పేదల ఇళ్లపట్టాలను తాము అడ్డుకుంటున్నామని అబద్ధపు ప్రచారం చేసుకుంటూ బాలినేని మాయ చేస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న ఆరోపణలపై తాను బహిరంగచర్చకు సిద్ధమన్నారు. పేదలకు ఇప్పుడు ఇచ్చిన పట్టాలకు ప్రభుత్వ చట్టబద్ధత లేదన్నారు. రిజిస్ట్రేషన్ పేరుతో మోసం చేయడమే కాకుండా, ఇళ్లు ఉన్నవారికి, ఇంటిపన్నులు చెల్లించే వారికి, వేలల్లో కరెంటు బిల్లులు కట్టేవారికే పట్టాలు ఇచ్చారన్నారు. పేదరికంలో ఉన్న అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ రంగులతో, జగన్, బాలినేని ఫొటోలతో ప్రచారపిచ్చిని తెలిపేందుకు డిజిటల్ సైన్ లేకుండా కాగితాలు ఇచ్చారన్నారు. ఎవరు అభివృద్ధి చేశారో వాస్తవాలతో నిరూపిస్తామన్నారు. అలాగే వైసీపీ అక్రమాలు నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, మీ ఇంటికి రమన్నా వస్తాను, మా ఇంటికి వచ్చినా పర్వాలేదు. ఆరోపణలు చేయడం కాదు. అవి నిరూపించాలని దామచర్ల సవాల్ విసిరారు.


నిర్మ మహేశ్వరుని రథోత్సవంలో పాల్గొన్న భక్త జనం

శివోహం!

వైభవంగా నిర్మమహేశ్వరుని రథోత్సవం

- శివనామస్మరణలతో మార్మోగిన పొదిలి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- జనసంద్రంగా మారిన పట్టణం
- వీధివీధినా అన్నదాన కార్యక్రమాలు

పొదిలి మార్చి 9 : ప్రముఖ శైవక్షేత్రం పొదిలిలోని శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అశేష జనవాహిని నడుమ కనులపండువగా ఈ వేడుకలు నిర్వహించారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైసీపీ మార్కాపురం సమన్వయ కర్త అన్నా రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ అధికారులు, రథనిర్మాణ దాత సామంతపూడి నాగేశ్వర రావులను ఆలయ కమిటీ చైర్మన్ యక్కల శేషగిరిరావు, ఈవో ఎం.శ్రీనివాసరావులు ఆలయ మర్యాదలతో మేళతాలాలతో ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో స్వామివారికి అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు వెంటరాగా విశేషంగా అలంకరించిన రథంపై గౌరీశంకరులుగా ఆది దంపతులు కొలువు తీరారు. అర్చక స్వాములు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, పురుషులు పోటీపడి రథాన్ని లాగారు. పట్టణంలోని చిన్న బస్టాండ్, పెద్ద బస్టాండ్, నిమ్మయ్య హోటల్, రాఘవేంద్ర సినిమా హాల్ మీదుగా రథోత్సవం సాగింది. ఆనవాయితీ ప్రకారం కొంతదూరం పోయిన తర్వాత రథాన్ని లాగేందుకు మహిళలకు అవకాశం కల్పించారు. భక్తులు స్వామివారికి బిందెలతో వారుపోస్తూ, కాయకర్పూరంతోపాటు, గుమ్మడికాయలు రథచక్రాల కింద ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు రథోత్సవం కొనసాగింది. భక్తులు స్వామివారిని దర్శించు కుని పులకించారు.

చంద్రబాబు పర్యటన వాయిదా

- 17న చిలకలూరిపేటలో భారీ సభ
- జిల్లా నుంచి అధికంగా మూడు పార్టీల శ్రేణులు సమీకరణ



ఒంగోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు ఈనెల 11న జిల్లాలో తలపెట్టిన పర్యటన వాయిదాపడింది. ఆ రోజున ప్రజాగళం పేరుతో ఉదయం యర్రగొండపాలెం, మధ్యాహ్నం టంగుటూరులో సభలు, సాయంత్రం ఒంగోలులో రోడ్డుషో కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ నిర్ణయించారు. తదనుగుణంగా స్థానికంగా నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఢిల్లీ స్థాయిలో జరిగిన రాజకీయ పరిణామాలతో శుక్ర, శనివారాల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. టీడీపీ, జనసేన కూటమికి బీజేపీ జత కట్టింది. అలాగే ఎన్‌డీఏలో తిరిగి టీడీపీ చేరడం క్లియర్ అయింది. అలా పొత్తులు కొలిక్కి వచ్చాయి. కాగా ఈనెల 17న చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన కూటమి తరఫున భారీ సభను నిర్వహించాలని రెండు పార్టీలు నిర్ణయించాయి. తాజా పరిణామాలతో బీజేపీ కూడా ఆ సభలో పాల్గొంటుండగా స్వయంగా ప్రధాని మోదీ కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ సభను మరింత భారీగా నిర్వహించాలని టీడీపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న జిల్లాలో చంద్రబాబు పర్యటన వాయిదా వేశారు. అదే సమయంలో పేట సభకు జిల్లా నుంచి భారీగా పార్టీశ్రేణులను తరలించనున్నారు.

డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ తొలగింపు

ఒంగోలు(విద్య), మార్చి 9 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) బిజినెస్ మేనేజర్ సి.సతీష్‌ను తొలగించినట్లు జిల్లా సహకారాధికారి పొలిశెట్టి రాజశేఖర్ తెలిపారు. డీసీఎంఎస్‌లో గోల్‌మాల్ జరిగిన నేపథ్యంలో ఆయనను తొలగించారు. డీసీఎంఎస్‌కు జాయింట్ చెక్ హోల్డర్‌గా ఉండి సొసైటీ అకౌంటెంట్ రూ.3.50 కోట్లు సొసైటీ ఖాతా నుంచి డ్రా చేసి తన సొంత ఖాతాకు మళ్లించుకున్నా ఆయన చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనను బిజినెస్ మేనేజర్‌గా తొలగించి ఆయన స్థానంలో ఒంగోలు సబ్‌డివిజనల్ సహకారాధికారి జే.రామచంద్రనాథ్‌ను నియమించారు.



దగ్ధమవుతున్న గడ్డివాములు

గడ్డి వాములు దగ్ధం

చినగంజాం, మార్చి 9: చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల శ్మశానవాటిక దగ్గరలో వేసిన రెండు గడ్డి వాములు దగ్ధమైన సంఘటన శనివారం వేకువజామున చోటుచేసుకుంది. సోపిరాల గ్రామానికి చెందిన దేశంశెట్టి కృష్ణమూర్తికి చెందిన రెండున్నర ఎకరాల గడ్డివాము, మొట్టు రామారావుకు చెందిన ఒకటిన్నర ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతి అయ్యాయి. ముందుగా రామారావు గడ్డివాముకి నిప్పు అంటుకోవడంతో చీరాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేసినట్లు బాధితులు తెలిపారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చి, పక్కనే గ్రామానికి చెందిన పలువురి గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. గడ్డి మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో రూ.80 వేలు నష్టం వాటిలినట్లు బాధితులు తెలిపారు. గడ్డివాములకు నిప్పు పెట్టినట్లుగా బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సహజ వనరులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్

మార్టూరు, మార్చి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరితో కార్పొరేట్ సంస్థలు సహజ వనరులను దోపిడీ చేస్తున్నాయని కృష్ణ, గోదావరి బేసిన్ సహజ వనరుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. కార్పొరేట్ సంస్థల నుంచి సహజ వనరులను కాపాడుకోవడానికి ప్రజలందరూ ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. శనివారం మార్టూరులో కేజీ బేసిన్‌లోని గ్యాస్, చమురు నిక్షేపాలలో మన రాష్ట్ర వాటాకై ఉద్యమిద్దాం అనే విషయంపై విశ్రాంతి ఉద్యోగుల భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర నాయకుడు మహ్మద్ బాషా అధ్యక్షత వహించారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తీరంలో ఉన్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక స్వరూపాన్ని మార్చబోతున్నాయన్నారు. మన రాష్ట్రంలో ఉన్న చమురు నిక్షేపాలు, సహజ వనరులలో మనకు రావాల్సిన వాటా రావడం లేదన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు మాట్లాడుతూ మన రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలకు ఆయిల్ నిక్షేపాలను కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకుడు సీహెచ్ గంగయ్య, కాంగ్రెస్ నాయకుడు పేరం ప్రభాకర్, సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, పఠాన్ ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, ఎంపీ మోపిదేవి

మేదరమెట్ల, మార్చి 9: నాలుగున్నర సంవత్సరాల పాలనలో సంక్షేమం, అభివృద్ధి సాధించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. శనివారం కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద ఆదివారం జరిగే సిద్ధం సభ వేదిక వద్ద మంత్రి రజిని, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని కలిసినా జగన్‌మోహన్‌రెడ్డిని ఏమి చేయలేరని అన్నారు. 80 నుంచి 85 శాతం మంది ప్రజలకు ఏదోవిధంగా సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక ప్రతిపక్షాలు ఏవిధంగా ఏకమతున్నాయో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంటరమణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.2.56 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించినట్లు చెప్పారు. అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఆదివారం జరిగబోయే సిద్ధం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలసిల రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఐజీ పాల్‌రాజు

మేదరమెట్ల, మార్చి 9: సిద్ధం సభకు సంబంధించి అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఐజీ పాల్‌రాజు తెలిపారు. శనివారం రాత్రి మేదరమెట్లలో ఆదివారం జరిగే సిద్ధం సభకు సంబంధించి ఎస్ఐ, ఆస్థాయి పైఅధికారులతో ఆయన బందోబస్తు ఏర్పాట్ల గురించి వివరించారు. సభా వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, చెకింగ్ పాయింట్లు, తదితరచోట్ల విధుల గురించి వివరించారు. వాహనాలు దారిమళ్లించే ప్రదేశాలలో వాహనదారులకు అర్థమయ్యేలా ఫ్లెక్సీలను ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం అడ్మిన్ ఐజీ రవీంద్రనాథ్‌బాబు, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, గుంటూరు జిల్లా ఎస్పీ కుషార్ డ్యూడి, ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వరెడ్డి, నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తదితర అధికారులతో కలిసి సభా వేదిక, ర్యాంపు, తదితర ప్రదేశాలను పరిశీలించారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

మేదరమెట్ల, మార్చి 9: గుండెపోటుతో వీఆర్వో ఈమని సునీత(45) మృతి చెందారు. శనివారం పంగులూరు మండలం బోదవాడలోని ఆమె స్వగృహంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీఆర్వో మృతదేహాన్ని కొరిశపాడు తహసీల్దార్ సుశీల, వీఆర్వోలు సందర్శించి నివాళులర్పించారు. ఆమె మండలంలోని రావినూతల వీఆర్వోగా పనిచేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఒంగోలు(కల్చరల్), మార్చి 9: అంతర్జాతీ య మహిళా దినోత్స వం సందర్భంగా ఒంగోలులోని మహిళాభ్యుదయ సమితి కా ర్యాలయం శక్తిసదన్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానిక శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఎముకల దారుఢ్యం, థైరాయిడ్, షుగర్, కాల్షియం తదితర పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు అందించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా తమ కార్యాలయంలో ఇ టువంటి మంచి కార్యక్రమం చేపట్టటం సంతోషంగా ఉందని, ఆస్పత్రి నిర్వాహ కులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండ్లూరి జెరూషా జాస్మిన్, డాక్టర్ సరయు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుర స్కరించుకొని శనివారం ఏపీఎన్జీవో అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వ ర్యంలో స్థానిక బలరాంకాలనీలోని ఉషోదయ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు, చీర, జాకెట్, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా వృద్ధాశ్రమంలోని వృద్ధులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి సరుకులు అందించిన అనంతరం రానున్న రోజుల్లో కూడా అవసరమైన సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచిపూడి శరత్‌బాబు, ఆర్సీహెచ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ మాధవి, జిల్లా చైర్మన్ కోటేశ్వరమ్మ, జిల్లా కన్వీనర్ శిరీష, జ్యోతి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రాసంకు గిరాకీ

- ఎకరా వరి గడ్డీ రూ.7 వేలు

చీరాల, మార్చి 9: ఈ ఏడాది ఎండుగడ్డికి గిరాకీ పెరిగింది. కొమ్మమూరు ఆయకట్టు పరిధిలోని మాగాణిలో వచ్చే వరిగడ్డి కొనుగోలుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, పశుపోషకులు వస్తుంటారు. ఈఏడాది ఎక్కువగా మిషన్ కోతలతో నూర్పుడి జరగటంతో నాణ్యమైన గడ్డికి గిరాకీ పెరిగింది. ఎకరా రూ.7వేలు పలుకుతుందని చెప్తున్నారు. మిషన్‌తో నూర్పిడి జరిగిన గడ్డి అయితే ఒక వెయ్యి తక్కువకు వస్తుందని చెప్తున్నారు.

పశువులకు అందించే మేత పాళ్లలో వరిగడ్డికి అత్యంత ప్రాధాన్యత ఉంది. పచ్చిగడ్డి, దాణా, ఎండుగడ్డి సమపాళ్లలో పోషకులు తమ పశువులకు అందిస్తుంటారు. అందులో ప్రధానంగా పాలిచ్చే గేదెలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. వేసవిలో పచ్చిగడ్డి అందరికి దొరకదు. దీంతో ఎక్కువగా ఎండుగడ్డి, సొప్ప(ఎండబెట్టిన జొన్న, మొక్కజొన్న, శనగపొట్టు)ను వినియోగిస్తుంటారు. దీంతోపాటు అవసరమైనమేర దాణా, చిట్టు, తవుడు (నీటిలో కలపి కుడితిగా) ఇస్తుంటారు. తద్వారా పాలదిగుబడితో పాటు, వెన్నశాతం కూడా ఎక్కువగా వస్తుంది. ఆదాయం పెరుగుతుంది. అయితే, ఈ ఏడాది వరిగడ్డి ధర చుక్కలు చూస్తుంది. ప్రధానంగా వరి కోతలు ఎక్కువగా మిషన్లతో జరిగాయి. మిషన్‌తో జరిపిన నూర్పిడికి, ఎద్దులు, లేదా ట్రాక్టర్లును తిప్పి జరిపిన నూర్పిడికి చాలా తేడా ఉంటుంది. వరిని ఈఏడాది ఎక్కువగా యంత్రాలతో కోసి, నూర్పిళ్లు చేశారు. ఎడ్లు, ట్రాక్టర్‌తో నూర్పిడిచేయగా వచ్చిన గడ్డికి డిమాండ్ పెరిగింది.

80వేల ఎకరాల్లో మాగాణి సాగయినా..

కొమ్మమూరు ఆయకట్టు పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు 80వేల ఎకరాల్లో మాగాణి సాగుచేశారు. సింహభాగం కోతలు



నూర్పిడి చేసిన గడ్డి మోపులతో వెళుతున్న ట్రాక్టర్



మిషన్‌తో నూర్పిడిచేసిన గడ్డి మోపులతో వెళుతున్న ట్రాక్టర్

పూర్తయ్యాయి. కొందరు కుప్పలు వేశారు. ఎక్కువమంది నూర్పిళ్లుచేసి వచ్చిన ధాన్యం వచ్చినట్లే విక్రయిస్తున్నారు. మొత్తం మీద ఎక్కువ మంది మిషన్లతో కోత, నూర్పిళ్లు చేయించారు. మిషన్ల ద్వారా జరిగిన నూర్పిడితో వచ్చిన గడ్డిని పశువులు అంత ఇష్టంగా తినవని పోషకులు చెప్తున్నారు. దీంతో ఎక్కువమంది ట్రాక్టర్లతో నూర్పిడి చేసిన గడ్డిని కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులు ఇష్టపడుతున్నారు. కొమ్మమూరు ఆయకట్టు పరిధిలోని 80వేల ఎకరాల్లో గడ్డి సింహభాగం ఆయా ప్రాంతాల స్థానిక పశుపోషకులు, రైతులు తమ ఎద్దులు, గేదెలకు వినియోగిస్తుంటారు. మిగిలిన గడ్డిని ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారికి విక్రయిస్తుంటారు.

భారంగా మారిన పశుపోషణ

ఏటికేటికి పశుపోషణ భారంగా మారుతోందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన పెట్టుబడులు, ధరలతో పోలిస్తే పాల ధర అంతగా పెరగటం లేదు. ఇంటింటికి తిరిగి లేదా హోటళ్లకు విక్రయించే వారికి కొంత పర్వాలేదు. కేవలం పాలకేంద్రాలకు పాలుపోసి ఉపాధి పొందుతున్నవారికి కష్టాలు తప్పటం లేదు. పాలల్లో వెన్న 8 శాతానికి తగ్గకుండా వస్తేనే ఖర్చులు వస్తాయని, ఆపైన కనీసం 9,10 శాతం వస్తేనే నాలుగు రూపాయలు మిగులుతాయి. లేదంటే చాకిరికి కూలీకూడా గిట్టుబాటు కాదంటున్నారు.

దంపతులపై దాడి

- ఆందోళనకరంగా భార్య పరిస్థితి

యద్దనపూడి(మార్టూరు), మార్చి 9: దంపతులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి యద్దనపూడి మండలంలోని పోలూరు గ్రామంలో చోటుచేసుకుంది. గాయపడిన భర్త కుంచనపల్లి బాబు, భార్య అంజమ్మలు గుంటూరులోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో అంజమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ దారుణానికి కారకుడైన కుంచనపల్లి సాంబశివరావు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

అందిన సమాచారం మేరకు.. బాధితులు, ఈ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి కుటుంబాల మధ్య బంధుత్వం కూడా ఉన్నట్లు తెలిసింది. బాధితులలో బాబు ఇంటి వద్ద చిల్లర దుకాణం నిర్వహిస్తుండగా, ఆయన భార్య అంజమ్మ పొలం పనులకు మహిళలను తీసుకువెళుతూ మేస్త్రీగా పనిచేస్తున్నారు. భార్యాభర్తలపై దాడిచేసిన సాంబశివరావు గతంలో ఆటోడ్రైవరుగా పనిచేయగా, ఆయన భార్య నాగలక్ష్మి అంజమ్మ ముఠాలో కూలీ పనులకు వెళుతుంటారు. భార్య నాగలక్ష్మిపై అనుమానం పెంచుకున్న సాంబశివరావు శుక్రవారం రాత్రి బాబు ఇంటికి వెళ్లి గొడవపడినట్లు తెలిసింది. ఈక్రమంలో వారి ఇంటి వద్ద ఉన్న చిన్న చాకు తీసుకొని తొలుత అంజమ్మ గొంతును కోయగా, అడ్డువచ్చిన భర్త బాబుపై కూడా దాడి చేశాడు. కేకలు విన్న ఇరుగుపొరుగువారితో పాటు స్థానిక మహిళా పోలీసు ఘటనా స్థలానికి చేరారు. అనంతరం బంధువులు గాయపడిన దంపతులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శనివారం ఉదయం గుంటూరులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేస్తున్నారు.



అపస్మారక స్థితిలో అంజమ్మ



గాయపడిన కుంచనపల్లి బాబు

బస్సులన్నీ సిద్ధంకే!

- అద్దంకి డిపో నుంచి 37 గురజాల మండలానికి కేటాయింపు
- అద్దంకి నియోజకవర్గానికి 400 ఆర్టీసీ కేటాయింపు



బస్సులు లేక ఖాళీగా ఉన్న అద్దంకి ఆర్టీసీ బస్టాండ్(ఫైల్)

అద్దంకి, మార్చి 9: సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు అద్దంకి నియోజకవర్గానికి 400 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి జనాన్ని సిద్ధం సభ వద్దకు తీసుకువచ్చేందుకు ఇతర డిపోల నుంచి 400 బస్సులను కేటాయించారు. అద్దంకి డిపోలో 35 ఆర్టీసీ బస్సులు ఉండగా, హైదరాబాద్ నడిచే రెండు సూపర్‌లగ్జరీ బస్సులు మినహా మిగిలిన 33 ఆర్టీసీ బస్సులతో పాటు మరో నాలుగు అద్దె ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు కేటాయించారు. అద్దంకి డిపోకు చెందిన 37 బస్సులు గురజాల మండలానికి కేటాయించటంతో శనివారం రాత్రి బయలుదేరివెళ్ళాయి. దీంతో ఆదివారం ప్రయాణికులకు కష్టాలు తప్పవు. అద్దంకి డిపో పరిధిలో ఉన్న 19 ఆర్టీసీ అద్దె బస్సులు మాత్రం ఆయా రూట్లలో తిరగనున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడ, శ్రీశైలం నడిపే ఎక్స్‌ప్రెస్ బస్సులను కూడా సిద్ధం సభకు కేటాయించటంతో మరిన్ని కష్టాలు తప్పవని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

కాగా, శివరాత్రి సందర్భంగా అద్దంకి డిపో నుంచి శుక్రవారం కోటప్పకొండ, శ్రీశైలంలకు 30 బస్సులు నడపగా సుమారు రూ.8 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు.

పగిలిన మంచినీటి పైప్‌లైన్.. నిలిచిన సరఫరా

మేదరమెట్ల, మార్చి 9: సిద్ధం సభ వద్ద రోడ్లు ఏర్పాటుతో పలు గ్రామాలకు మంచినీటి సరఫరాకు జాతీయ రహదారి వెంబడి వేసిన పైప్ లైన్ శనివారం పగిలిపోయింది. దీంతో అద్దంకి మండలంలోని వెంకటాపురంతో పాటు పంగులూరు మండలంలోని పలు గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి మేదరమెట్ల మంచినీటి పథకం ద్వారా పంగులూరు మండలంలోని పలు గ్రామాలకు మంచినీటి సరఫరా జరుగుతుంది. మంచినీటి సరఫరా నిలిచిపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వైసీపీని సాగనంపాలి



మాట్లాడుతున్న టీడీపీ మార్టూరు పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్దన్

మార్టూరు, మార్చి 9: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని వైసీపీ ప్రభుత్వానికి అంతిమ వీడ్కోలు పలకాలని టీడీపీ మార్టూరు పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్దన్ అన్నారు. శనివారం రాత్రి మార్టూరులోని కొణిదెన రోడ్డులోగల కోరీ గుంటల్లో 13వ బూత్ పరిధిలో పేజీ నేస్తం సమావేశం నిర్వహించారు. సమావేశానికి పార్టీ నాయకుడు తొండెపు ఆది నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనార్దన్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రతి ఓటరు పోలింగ్ బూత్ వరకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఓటు అనే ఆయుధంతో వైసీపీ ప్రభుత్వం పతనానికి నాంది పలకాలన్నారు. గతంలో పది అడుగుల లోతులో నివాస గృహాల మధ్య ఇబ్బందులు పడుతున్న కోరీ గుంతలులో మెరక కోసం వేలాది ట్రక్కుల మట్టిని తోలి ప్రజల ఇబ్బందులను తీర్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషిని కాలనీవాసులు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. మైనారిటీల సంక్షేమానికి కృషి చేసింది, మైనారిటీలపై ఆదరణ, ప్రేమను, అభిమానాన్ని చూపించింది టీడీపీ నేనని చెప్పారు. చంద్రబాబు భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను పేద కుటుంబాల అభివృద్ధికి ఏర్పాటు చేశారన్నారు.

కార్యక్రమంలో షేక్ రజాక్, కన్నెగంటి శ్రీనివాసరావు, తాటి నాగేశ్వరరావు, తొట్టెంపూడి భుజంగరావు, రావినేని శ్రీనివాసరావు, షేక్ ఫరూక్, గొట్టిపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిదేవుని నగరోత్సవం

ఒంగోలు(కల్చరల్), మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా ఒంగోలు నగరం కేశవస్వామిపేటలో ని శ్రీగంగా అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి నగరోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనం, నరనంది వాహనం మొదలైన వాటిపై నగరంలోని ఏనుగుచె ట్టు, దక్షిణం బజార్, గాంధీరోడ్డు, కోర్టుసెంటర్, జయరాం థియేటర్ సెంటర్, రాజాపానగల్ రోడ్డు మొదలైన ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహిం చారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజ నీకుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, ఈమని మదన్ మోహన్, ఉత్సవ ఉభయదాతలు దాసరి నారాయణరావు, త్రిపురం మల్లికార్జున, బేతంశెట్టి హరిబాబు, వీరాస్వామి, కారంశెట్టి శ్రీనివాసరావు పాల్గొనగా, అర్చకులు శంకరమంచి ప్రసాద శాస్త్రి, రామకృష్ణశాస్త్రి పూజలు నిర్వహించారు. స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీసత్యసాయిబాబా మందిరంలో కన్నుల పండుగగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భం గా శివలింగానికి సామూహిక అభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, భజన మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ పురోహితులు వ్యాముజాల ప్రసన్నకుమార్‌శర్మ యాజ్ఞీకంలో కల్యాణ క్రతువులు శాస్త్రోక్తంగా జరిగాయి.

కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు, సత్యసాయి ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వరస్వామిని ఊరేగిస్తున్న ఆలయ ప్రతినిధులు



సంతపేటలో స్వామివారి కల్యాణోత్సవం



రామకోటేశ్వరస్వామి హుండీ లెక్కింపు

చినగంజాం, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో నిర్వహించిన తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటుచేసిన హుండీని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. అభిషేకాలు, కుంకమపూజలు ద్వారా రూ.2,11,200, క్యూఆర్ కోడ్ ద్వారా 15,088, హుండీ ద్వారా రూ. 5,30,982 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రూ.7,57,270 ఆదాయం రాగా బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తుమ్మలపెంట సీతారామయ్య, టి.వెంకటస్వామి, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి నరేంద్రనాథ్, పి.శరభయ్య, నున్నా హరనాథ్‌బాబు, గుండ్రెడ్డి నరసింహారావు, అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, టి.చిన్నా, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వామివార్లను దర్శించుకొన్న ఏలూరి



ఎమ్మెల్యే ఏలూరిని సన్మానిస్తున్న బాలకోటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

చినగంజాం, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయంలో, కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాలలోని స్వామి వార్లను శుక్రవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరు దేవాలయాల కమిటి చైర్మన్‌లు నల్లమోపు రామిరెడ్డి, డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు, సభ్యులు ఎమ్మెల్యే ఏలూరికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

చీరాలటౌన్, మార్చి 9: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని సమసమాజ స్థాపనకు కృషిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, నాగవీర భద్రాచారి, సింహాద్రి యల్లమందారెడ్డి, రామారావు, మునీరుల్లా ఖాన్, బాలాజీ రెడ్డి, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



వివిధ రకాల పూలతో స్వామివారి అలంకరణ

చెరుకూరు(పర్చూరు), మార్చి 9: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. 70 మంది దంపతులు స్వామివారి శాంతి కల్యాణంలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12.15 గంటలకు స్వామివార్లకు లింగోద్భవ అభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ అర్చకులు ఎం.నాగయ్య నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చీరాల టికెట్ స్థానిక బీసీలకు కేటాయించాలి

చీరాల, మార్చి 9: చీరాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక పేరాలగోలి సదాశివరావు కల్యాణ మండపంలో శనివారం కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు అధ్యక్షతన సభ జరిగింది. పలువురు మాట్లాడుతూ బీసీ నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు పార్టీలు, పలు ప్రజాసంఘాలకు చెందిన ప్రతినిధులు సజ్జా వెంకటేశ్వరరావు, దేవరపల్లి బాబూరావు, అవ్వారు ముసలయ్య, వీరక సురేంద్ర, మాచర్ల మోహనరావు, దామర్ల శ్రీకృష్ణ, గుమ్మడి ఏసురత్నం, మోహన్‌కుమార్‌ధర్మా, పోతుల సురేష్, జూలియన్, పి.ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నివాళి



నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, తదితరులు

గంగవరం(ఇంకొల్లు), మార్చి 9: మండలంలోని గంగవరం టీడీపీ మాజీ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు బోడెంపూడి నాగేశ్వరరావుకు ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళులర్పించారు. గంగవరంలో ఆయన స్వగృహంలో జరిగిన దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో స్థానిక నాయకులు నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, కరి వీరాంజనేయులు, రమేష్ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ఒంగోలు(రూరల్), మార్చి 9: ఒంగోలు మండలం కరవదిలోని పీఆర్ఆర్ జడ్పీ హైస్కూలులో రిటైర్డ్ హె చ్ఎం సూరిగుచ్చి హను మంతరావు జ్ఞాపకార్థం ని ర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ శనివారం రాత్రి హోరాహోరీగా జరుగుతున్నాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల నుంచి వాలీబాల్ క్రీడాకారులు తరలివచ్చారు. చివరిరోజు ఆదివారం సాయంత్రం మహిళా వాలీబాల్ క్రీడాకారులతో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను పెద్దసుబ్బారెడ్డి, ఎం.భాస్కర్‌రావు, ఆర్ఎంపీ ప్రభాకర్ (బాబు), మారెళ్ల ఆంజనేయులు, దేవరపల్లి నాగేశ్వరరావు, శిరిగిరి రంగారవు, గుట్టుపల్లి కోటేశ్వరరావు, కొల్లా వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి కోటి, లింగంగుంట రవిబాబు, పోకూరి శేషయ్య, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.


రాష్ట్రస్థాయిలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నారు. అలాగే పలువురు అతిథులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

హాల్‌టికెట్లలో తప్పుల సవరణకు అవకాశం

ఒంగోలు(విద్య), మార్చి 9: ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్లలో తప్పులు ఉంటే సవరించుకునేందుకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ అవకాశం కల్పించారు. విద్యార్థుల మీడియం, సబ్జెక్టుల్లో ఏమైనా తప్పులు ఉంటే సవరిస్తారు. పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు తమ విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించి వారి మీడియం, సబ్జెక్టుల్లో తేడాలుంటే వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు తెలియజేయాలని డీఈవో డిసుభద్ర శనివారం ఓ ప్రకటనలో కోరారు.

పారిశుధ్య కార్మికుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 9: పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛ పారిశుధ్య కార్మికుల వివరాలను యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. స్వచ్ఛకార్మికుల జీవనోపాధిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అందులో భాగంగా గ్రామాల్లోని స్వచ్ఛ కార్మికుల వివరాలను ఆయా పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లోని పారిశుధ్య విభాగం వార్డు కార్యదర్శులు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వేకు పారిశుధ్య కార్మికులు కూడా న హకరించాలన్నారు.





కావలిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బస్సులు, ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా ఉన్న నెల్లూరు ప్రధాన బస్టాండు

జన ఘోష



నెల్లూరు : ఆత్మకూరు బస్టాండులో పడిగాపులు

- బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షణ
- ప్రైవేటు వాహనాలే దిక్కు
- నిర్మానుష్యంగా పోలీస్‌స్టేషన్లు
- గోడు వినే దిక్కులేక వెనుతిరిగిన ఫిర్యాదుదారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా మేదరమిట్ల 'సిద్ధం' సభ 24 గంటల ముందే జిల్లా ప్రజలకు నరకం ఏమిటో చూపించింది. ఉన్న బస్సులన్నీ సిద్ధం సభకు తరలివెళ్లడంతో ప్రయాణికులు అల్లాడిపోయారు. జిల్లావ్యాప్తంగా అన్ని బస్టాండ్లు, ముఖ్య కూడళ్ల వద్ద బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాచారు. ఎంతకూ బస్సులు రాకపోవడంతో కాలినడకన కొందరు, ఆటోలు ఎక్కి ఇంకొందరు స్వగ్రామాలకు వెళ్లారు. మరి కొందరు ప్రయాణాలను వాయిదా వేసుకొని ఇంటికి తిరుగుముఖం పట్టారు. ఇక ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయడానికి, రాసిన తరువాత ఇళ్లకు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూసినా బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించారు. ఒక్కో ఆటోలు పది మందికి తక్కువ లేకుండా ప్రయాణించారు. కావలిలో పరిస్థితి మరీ దారుణం. వందల సంఖ్యలో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ఆత్మకూరు, ఉదయగిరి ఇలా ఒక ప్రాంతమని కాకుండా జిల్లావ్యాప్తంగా పట్టణాలు మొదలు పల్లెల వరకు బస్టాండ్లు, కూడళ్ల వద్ద ప్రయాణికుల ఘోష కనిపించింది. ఇక పోలీస్ స్టేషన్ల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు.

బోసిపోయిన స్టేషన్లు

పోలీసులు, ఫిర్యాదుదారులతో సందడిగా ఉండే పోలీస్ స్టేషన్లు మనుషులే లేక మౌన గంభీర ముద్ర దాల్చాయి. నెల్లూరులోని ఒక స్టేషన్ పరిధిలో దాడిలో గాయపడిన బాధితుని ఫిర్యాదు తీసుకునే దిక్కు కూడా లేదు. దీంతో పోలీసు ఫిర్యాదు ఆధారంగా ఆసుపత్రిలో చికిత్స చేసుకోవాల్సిన బాధితుడు కేసును వదిలేసి ప్రైవేటు ఆసుపత్రిలో కట్టు కట్టించుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు ఒకరిద్దరు కానిస్టేబుళ్లకు పరిమితం అయ్యాయి. దీంతో తమ గోడు వెళ్లబోసు కోవడానికి వచ్చిన ఫిర్యాదు దారులు నిరాశ నిస్పృహలతో వెనుతిరిగారు. సిద్ధం సభకు ఆర్టీసీ బస్సు లు, పోలీసులు తరలి వెళ్లడంతో జిల్లా వాసులు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

అంతా నిర్మానుష్యం

మేదరమెట్ల 'సిద్ధం' సభ బందోబస్తుకు సీఐ, ఎస్ఐ, పెద్ద సంఖ్యలో పోలీసులు తరలివెళ్లడంతో శనివారం కోవూరు పోలీస్‌స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. ఎస్ఐ, సీఐ ఉంటే తమ సమస్యల పరిష్కారం కోసం సాయంత్రం పూట పెద్దసంఖ్యలో బాధితులు వచ్చేవారు. అయితే, అంతా మేదరమెట్లకు తరలివెళ్లడంతో కోవూరు సర్కిల్ పరిధిలో రెండు రోజులు ఎలాంటి పోలీసు సహాయం అందే అవకాశం కనిపించడం లేదు.

- కోవూరు



'సిద్ధం సభకు రండి!

- వలంటీర్ల ప్రచారం

సీఎం సభకు రావాలంటూ వలంటీర్లు ప్రచారం చేస్తున్నారు. నరుకూరు సచివాలయ కన్వీనర్ తలమంచి సురేంద్రబాబుతో కలిసి వలంటీర్లు ఆకుల నవీన్, నెల్లూరు వినయ్, సాదా సోము, వినోద్, మునగాల రవి, షేక్ ఖాదర్ మోహిద్దీన్ ప్రచారం చేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక ప్రతి గడపకు వెళ్లి వైసీపీ పథకాలను వివరించి, మీరు ఓటు వేయాలని లేని పక్షంలో సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని వలంటీర్లు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

- తోటపల్లి గూడూరు



నరుకూరులో ప్రచారం చేస్తున్న వలంటీర్లు

మౌఖిక ఆదేశాలతో పంపలేం

- కావలిలో అద్దె బస్సుల యజమానులు

కావలి : సీఎం జగన్ 'సిద్ధం' సభకు బస్సులు పంపే విషయంలో ఆర్టీసీ అధికారులు, అద్దె బస్సుల యజమానుల మధ్య ఏకాభిప్రాయం కుదర లేదు. కావలి డిపో నుంచి 60 బస్సులు కేటాయించాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారు. అయితే డిపోలో 50 బస్సులు ఉండగా, వాటిల్లో 47 మాత్రమే కండిషన్‌లో ఉన్నాయి. మరో 34 అద్దె బస్సులు నడుస్తున్నాయి. దీంతో సీఎం సభకు అద్దె బస్సులు కూడా పంపక తప్పదు. అయితే, లిఖిత పూర్వక ఆదేశాలు లేకుండు సీఎం సభకు బస్సులు పంపేందుకు యజమానులు వెనుకంజ వేస్తున్నారు. ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లాలి? ఎప్పుడు రావాలి? తదితర వివరాలు లేకుండా ఒక మాట చెప్పి పొమ్మంటే తర్వాత పేమెంట్ ఎవరు చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక తమ బస్సులు తిరిగే ప్రాంతాలకే పర్మిట్లు ఉంటాయని, సీఎం సభకు వెళ్లి ఏదైనా ప్రమాదం జరిగితే దానికి తామే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు యజమానులు వాపోతున్నారు. మొత్తమ్మీద లిఖిత పూర్వక ఉత్తర్వులు ఇచ్చి బస్సులను తీసుకువెళతారా? లేదా బెదిరింపులతో తీసుకు వెళతారా! అనేది చర్చనీయాంశమైంది.



బుచ్చిరెడ్డిపాళెం : శనివారం రాత్రి బస్టాండు సెంటర్‌లో నిరీక్షణ



కందుకూరులో వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండ్



కావలి డిపోలో నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులు



నిర్మానుష్యంగా అల్లూరు పోలీస్‌స్టేషన్



కందుకూరు : పోలీస్ స్టేషన్‌లో సెంట్రీ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారికి రెండురోజుల తర్వాత రావాలని చెప్పి పంపేస్తున్నారు.



నెల్లూరు : ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద పోలీసులేరీ!?

కష్టంగా కాదు.. ఇష్టంతో చదవండి!

- విద్యార్థులతో హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

బిట్రగుంట, మార్చి 9 : విద్యను అభ్యసించేటప్పుడు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే దాని సారంశం స్పష్టంగా అర్థమవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. అంతకముందు బిలకూటక్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మన్మథరావు దర్శనం చేసుకున్నారు. ఆయను ఈవో రాధాకృష్ణ, పాలక మండలి ఛైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. సరస్వతీ నమస్తుభ్యం మండల కమిటీ ఛైర్మన్ మద్దులూరి ప్రసాద్ రావు, జడ్పీహైస్కూల్ హెచ్ఎం కనకారావుల ఆహ్వానం మేరకు న్యాయమూర్తి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి మన్మథరావు మాట్లాడుతూ శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట న్యాయాధికారులు, న్యాయవాదులు, ఎంఈవో జయమ్మ, విశ్రాంత ఇంజనీరు గోపికృష్ణ, కావలి సీఐ రాజేష్ తదితరులు ఉన్నారు.



జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

బండ భారం తగ్గింది!

- రూ.100 తగ్గిన గృహావసరాల సిలిండర్
- సామాన్యుడికి ఊరటనిచ్చిన కేంద్రం



నెల్లూరు (హరనాథపురం)/చేజర్ల, మార్చి 9 : గ్యాస్ వినియోగదారులకు ఓ శుభవార్త. సిలిండర్ ధరను రూ.100 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం నుంచి ఈ ధర అమలు లోకి వచ్చింది. ప్రస్తుతం రూ.14.2 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం రూ.940 ఉండగా ధర తగ్గింపుతో 840కి చేరింది. రెండు, మూడేళ్లుగా అమాంతం పెరిగిన ధర గత ఏడాది మార్చి నెలలో రూ.1150లకు చేరింది. అయితే, గత ఏడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిలిండర్ ధరను రూ.200లకు తగ్గించారు. కాగా, 10 కిలోల సిలిండర్ ధర రూ.679.50 నుంచి రూ.609 లకు, 5 కిలోల సిలిండర్ ధర రూ.352 నుంచి 315.50 లకు తగ్గింది. దేశీయ ఇంధన ధరకు ప్రామాణికంగా భావించే అంతర్జాతీయ చమురు, గ్యాస్ ధరలు స్వల్పంగా కిందకు దిగొచ్చిన కారణంగానే ఎల్‌పీజీ ధర తగ్గించినట్లు తెలుస్తోంది. ధర తగ్గింపు నిర్ణయం నారీమణులకు లబ్ధి చేకూరు తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, జిల్లాలో 8.06 లక్షల వినియోగ దారులు ఉండగా, రూ.100 తగ్గింపుతో అందరికీ ఊరట లభించినట్లు అయ్యింది.

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు	49
డొమెస్టిక్ కనెక్షన్లు	4,64,871
దీపం	2,67,421
ఉజ్వల	18,986
సీఎస్సార్	33,589
కమర్షియల్	2,616
మొత్తం కనెక్షన్లు	7,87,483

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- రాష్ట్రంలో అప్పుల భారమే అభివృద్ధి
- బలమైన శక్తిగా బీజేపీని నిలుపుదాం
- పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు
- బూత్‌స్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 9 : రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏదైనా అభివృద్ధి చెందింది అంటే అది అప్పుల భారం మాత్రమేనని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అందరూ కలిసికట్టుగా రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని కస్తూర్బా గార్డెన్స్‌లో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, పురందేశ్వరి పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ గడిచిన ఈ ఐదేళ్లలో రూ.3.5 లక్షల కోట్ల అప్పు ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని నేడు రూ.12 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై వేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మన పాలన ప్రారంభమయ్యే పవిత్రమైన సెక్రటేరియట్‌ను రూ.350 కోట్లకు తనఖా పెట్టి అప్పు తీసుకోవడాన్ని ఆంధ్రులు క్షమించగలరా!? అని నిలదీశారు. రాష్ట్ర సంపద అయిన గనులను తాకట్టు పెట్టి రూ.7వేల కోట్లు తీసుకువచ్చారని, ఇలా రాష్ట్రంలో ఏది కన్పిస్తే అది తాకట్టు పెట్టి డబ్బులు తీసుకు వస్తున్న జగన్మోహన్‌రెడ్డి తన జేబు నింపుకొని, తన అస్మదీయుల జేబులు నింపుతున్నారని మండిపడ్డారు. ఇవాళ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందంటే ఎంత బాధా కరమో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ పాలన యథావిధంగా కొనసాగితే రేపు మన బిడ్డలకు, వారి భావితరాలకు భవిష్యత్తు ఉండదనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. అందరం నడుం బిగించి వైసీపీ ప్రభుత్వాన్ని ఏవిధంగా గద్దె దించాలన్న దానిపై దృష్టి సారించాలన్నారు. ప్రతి కార్యకర్త నడుం బిగించి బీజేపీని బలమైన శక్తిగా ఎదిగేల కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కాగా, వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కమలదళంలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల పరిశీలికుడు శేఖర్‌జీ, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మోర్చాల ఇన్‌చార్జ్ పి సురేంద్రరెడ్డి, బీజేపీ నాయకులు వాకాటి నారాయణరెడ్డి, సీపా వంశీధర్ రెడ్డి, గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శివరాజ్ సింగ్ చౌహాన్, పురందేశ్వరిలను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు



భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడికి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కల్యాణం కమనీయం!

వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ నెల్లూరులో ఆదిదంపతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, రుద్రహోమాలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం, పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుడి కల్యాణం వైభవంగా జరిగింది. ఎదురుకోలు ఉత్సవం అనంతరం గజవాహనంపై ఆదిదంపతులు విహరించారు. ఆలయ ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఈవో వేణుగోపాల్, ధర్మకర్తలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

తగ్గిన శనగ దిగుబడి

- వర్షాభావ పరిస్థితులే కారణమంటున్న రైతులు
- ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు మించలేదు
- పెట్టుబడులు చేతికందని వైనం ● ఆందోళనలో అన్నదాత



దుత్తలూరులో ఆరబెట్టిన శనగలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 9: ఈ ఏడాది శనగ పంటల కోతలు ప్రారంభమయ్యాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సకాలంలో వానలు కురవకపోవడంతో దిగుబడి బాగా తగ్గింది. అరకొరగా వచ్చిన పంటను నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో దళారులకు అమ్ముకునేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. గతేడాదితో పోలిస్తే ధర కాస్త మెరుగ్గా ఉన్నా దిగుబడి బాగా పడిపోయింది. చాలా మండలాల్లో 3 నుంచి 4 క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. గతేడాది క్వింటం రూ.4,500లు పలికితే ఈ ఏడాది క్వింటం ధర రూ.6,200లు పలుకుతుంది. గతేడాది ప్రభుత్వ మద్దతు రూ.5,335లతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఈ ఏడాది మద్దతు ధర రూ.5,440లుగా నిర్ణయించారు. మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, వింజమూరు, కొండాపురం, ఏఎస్‌పేట, కందుకూరు తదితర ప్రాంతాల్లో 14,858 ఎకరాల్లో శనగ పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు రికార్డులు చెబుతున్నాయి. దుత్తలూరు మండలంలో 938 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. సాగుకు అదును దాటి ఆలస్యం కావడంతో పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు కురవకపోవడంతో ప్రత్యామ్నాంగా పొగాకు సాగు చేపట్టారు. దీంతో శనగ సాగు విస్తీర్ణం తగ్గింది. ఎకరానికి వరుణుడు కరుణించి ఉంటే ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని అన్నదాత వాపోతున్నారు. ఎకరా పంట సాగుకు దుక్కులు, విత్తనాలు, మందులు, కోత కూలీలు కలిపి సుమారు రూ.20వేలు అవుతుందని, ప్రస్తుతం వచ్చిన దిగుబడి, పలుకుతున్న ధరలతో పెట్టుబడులు కూడా రాని దుస్థితి ఉందంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణం



సంగం: హనుమంత వాహనంపై సీతారాముల గ్రామోత్సవం

సంగం, మార్చి 9: సంగమేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజామున సంగమేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీకామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి వేద పండితులు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోశ్చరణల మధ్య వేడుక చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కానుకలు అందజేశారు.

నందివాహనంపై గ్రామోత్సవం

కల్యాణం అనంతరం స్వామిఅమ్మవారిని నందివాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించి పొదలకూరు మండలం సూరాయపాళెం గ్రామం గ్రామోత్స వం చేపట్టారు. ఉత్సవాన్ని ఆదివారం సంగమేశ్వరాలయానికి చేర్చారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వంగల్లు భీమేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు.



కల్యాణోత్సవంలో భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

వైభవంగా హనుమంతుడి గ్రామోత్సవం

వీరాంజనేయస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున హనుమంతుడి గ్రామోత్సం నిర్వహించారు. హనుమంతుని ఉత్సవ విగ్రహంపై సీతారాముల విగ్రహాలను ఉంచి గజపూలమాలలు, విద్యుత్‌దీపాలంకరణలో గ్రామోత్స వాన్ని అలంకరించారు. భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాఫిక్ సమస్య జటిలం

- పార్శిల్ వాహనాలతో ఆటంకం
- తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఉదయగిరి పట్టణంలో ఎదురెదురుగా వాహనాలు రావడంతో నిలిచిన ట్రాఫిక్

ఉదయగిరి, మార్చి 8: పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. నియోజకవర్గకేంద్రం కావడంతో ప్రతిరోజూ సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, ఉదయగిరి మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలు వివిధ కార్యాలయాల్లో పని నిమిత్తంతో పాటు వ్యాపార కార్యకలా పాలకు వస్తుంటారు. ప్రధాన రహదారి వెంట ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లతో పాటు పార్శిల్ వాహనాలు రోడ్డు పక్కనే నిలిపి సరుకులు దిగుమతి చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రధానంగా మెయిన్ బజార్, మార్కెట్‌వీధి, గండిపాళెం రోడ్డు, బస్టాండ్ సెంటర్లలో ఈ ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందిగా ఎక్కువగా ఉంటుంది. వాహనాలతోపాటు తోపుడుబండ్లు, కూరగాయలు, సోడాబండ్లు రోడ్డు మార్జిన్‌లో నిలుపుతూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జామియా మసీదులో కాకర్ల ప్రత్యేక ప్రార్థనలు





మాజీ మంత్రి నారాయణను సన్మానిస్తున్న కాకర్ల, ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 9: పట్టణంలోని వైశ్య బజారులోని జామియా మసీదులో శుక్రవారం రాత్రి ముస్లిం సోదరులతో కలిసి ఉదయగిరి టీడీపీ జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అల్లా ఆశీస్సులు ఎల్లవేళలా కాకర్ల సురేష్‌కు ఉండాలని ఇమామ్ సాబ్ ఆశీర్వదించారు. అనంతరం ముస్లింలను పరిచయం చేసుకున్నారు. వారికి అవసరమైన సదుపాయాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మాచర్ల శ్రీను కోరిక మేరకు ఇస్త్రీ షాపు వద్దకు వెళ్లి బట్టలను ఐరన్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే రజకులను అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. తెలుగుదేశం హయాంలో ఇస్త్రీ పెట్టెను ఉచితంగా ఇచ్చారని దీని ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు శ్రీను తెలిపారు. అనంతరం సిద్దార్థనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త జ్యోతి పెంచలరావును పార్టీ కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. పాత బస్టాండ్ సెంటర్‌లో కాకర్ల అభిమానులకు అభివాదం తెలుపుతూ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, కాకర్ల వెంకట్, షేక్.ఖాజావలి, హజరత్‌నాయుడు ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన కాకర్ల

ఉదయగిరి: మాజీ మంత్రి పొంగూరు నారాయణను శనివారం నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ కలిశారు. నెల్లూరులోని నారాయణ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పుష్పగుచ్ఛంతో సన్మానించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి గెలపునకు కృషి చేయాలని కోరారు.

సిద్ధం సభా.. మజాకా !

వరికుంటపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సిబ్బంది కనిపించకపోవడంతో బోసిపోయింది. ఆ స్టేషన్‌లో ఎస్‌ఐతో పాటు 13మంది సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే ఆదివారం మేద రమెట్లలో జరిగే సిద్ధం సభకు ఎస్‌ఐతో సహా 11మంది సిబ్బందికి బందోబస్తు విధులు కేటాయించారు. దీంతో కేవలం ఇద్దరు మాత్రమే దిక్కుగా మారి విధులు నిర్వర్తిస్తున్నారు.



వరికుంటపాడు పోలీస్‌స్టేషన్

జనసేన, బీజేపీతో పొత్తు చారిత్రాత్మకం

ఉదయగిరి రూరల్, మార్చి 9: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన..బీజేపీలతో ఏర్పర్చుకొన్న పొత్తు చారిత్రాత్మకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నిరంగాల్లో వెనుకబడిన రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగ యువత భవిష్యత్తు, సాగు, తాగునీటి కష్టాలు తీర్చడం కోసం ఈ పొత్తు కుదుర్చుకోవాల్సి వచ్చిందన్నారు. జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు తెరదించడమే ఉమ్మడి లక్ష్యమన్నారు. మూడు పార్టీల పొత్తుతో వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు విసుగుచెందారని తగిన బుద్ధి చెప్పక తప్పదన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే..

వరికుంటపాడు: టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నా యని పార్టీ నియోజకవర్గ నాయకులు గంగవరపు సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన పొత్తు విషయంపై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న అరాచక పాలన నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు ముందుకు రావడం అభినం దనీయమని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి అధికారం చేపట్టడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు, మార్చి 9: పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన కె.రామ్‌కుమార్, పి.రమణమ్మ, వి.సీతామహాలక్ష్మి, షేక్ ఇంతి యాజ్, ఆర్.వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం ఆ కుటుంబసభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ.50వేలు అందజేశారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు ఆర్.ప్రసాద్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ త్రివేణి, మాజీ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్ బాబు, ఏడో వార్డు ఇన్‌చార్జి జమీర్‌భాష, మెప్మా ఆర్‌సీలు వెంకట సుబ్బమ్మ, శిరీష, సుభాషిని, జబీనా, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం కమిటీ సభ్యులు హజరత్తయ్య, పరిటాల సత్యం పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

కందుకూరు మున్సిపల్ కాంట్రాక్టర్ల ఆందోళన

కందుకూరు, మార్చి 9 : కందుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకోసం ఏడాదిన్నర క్రితం రూ.26 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన జగన్ నేటికీ ఒక్కరూపాయి కూడా బిల్లులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది క్రితమే పనులు పూర్తిచేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న తమకు వడ్డీలు పెరిగిపోయి అప్పులపాలయ్యామని రెండునెలలక్రితం 10 కోట్లు విడుదల చేసినట్లు నమ్మించిన జగన్ మరికొంతమంది పనులు పూర్తిచేసేలా ప్రోత్సహించారని తీరా నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావలి రూరల్, మార్చి9: కావలి చెరువు సమీపంలోని కూచి చినమాల కొండలో స్వామివారి కల్యాణ అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎం. మాధవదాసు కుమారుడు మాల్యాద్రిస్వామి ఆధ్వర్యంలో ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలు మంచాల ప్రసాద్‌నాయుడు-మల్లిక దంపతులు స్వామివారికి పూజల అనంతరం అన్నసంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లింగసముద్రం : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్యస్వామిని దర్శించుకోలేని భక్తులు రెండోరోజు శనివారం కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లింగసముద్రంలోని ప్రధాన రహదారిలో భక్తుల రద్దీ నెలకొంది.

మాల్యాద్రి లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

అల్లూరు : శివరాత్రి సందర్భంగా మండలంలోని అల్లూరుతోపాటు నార్తు మోపూరు, ఇస్కపల్లి శివాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం విశేష పూజల అనంతరం ఇస్కపల్లిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్యక్రమాలు సాగాయి. ఉదయం మహాపూర్ణాహుతి, కుంభజలాభిషేకం సాయంత్రం రుద్ర త్రిశతీ బిల్వార్చన, లలితా సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. శనివారం రాత్రి ఆదిదంపతులకు కల్యాణ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. బీద గిరిధర్-సుజన దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కావలి రూరల్: చినమాలకొండలో స్వామివారికి పుష్పాలంకరణ



అల్లూరు : ఆది దంపతులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఉభయదాతలు



లింగసముద్రంలో కోటయ్యస్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా : కావ్య

కావలి, మార్చి9: ఒక్క అవకాశం ఇవ్వండి.. కావలిని అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో శనివారం కావలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాతూరు కృష్ణుడి బొమ్మ సెంటర్‌లో ప్రచారరథంపై నుంచి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. పదేళ్ల ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిని దోచుకోవటం తప్ప ఏమి చేశాడని ప్రశ్నించారు. నీ అనుచరుల రియల్ ఎస్టేట్ కోసం పంట కాలువలు, నీటి గుంటలు ఆక్రమించారని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆక్రమణలు తొలగించి కాలువలు, గుంటలు యథావిధిగా ఉండేలా చేసి రైతులకు న్యాయం చేస్తానన్నారు. నీకు అన్నం పెట్టిన పాతూరు గడ్డను కలుషితం చేస్తున్నావన్నారు. నీ అరాచకాలతో కావలి ప్రజలు విసిగిపోయి తనను భారీ మెజార్టీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మాట్లాడుతూ కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు కోసం జనసేన నాయకులు అహర్నిశలు పనిచేస్తారన్నారు. ర్యాలీకి వచ్చిన ప్రజలను చూస్తే విజయోత్సవ ప్రదర్శనలా ఉందని ఆయన పేర్కొన్నారు.



టీడీపీ, జనసేవ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

● ర్యాలీకి అపూర్వ స్పందన

టీడీపీ- జనసేనలు చేపట్టిన ర్యాలీకి భారీ స్పందన రావటంతో కావలి పట్టణం పసుపుమయమైంది. ముసునూరులోని టీడీపీ కార్యాలయం నుంచి కావ్యక్రిష్ణారెడ్డి, అళహరి సుధాకర్‌లతోపాటు, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో ట్రంకురోడ్డు మీదుగా మోటారుసైకిల్ ర్యాలీగా బయలు దేరారు. వారి వెంట ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ట్రంకు రోడ్డులో ఉన్న ఎన్టీఆర్, అయ్యపరెడ్డి, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలేరమ్మ అరుగు వద్ద పోలేరమ్మకి పూజలు చేశారు. కృష్ణ మందిరంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేజీబీవీల్లో ఫిట్‌నెస్ రన్.. విజేతలకు బహుమతులు

కందుకూరు, మార్చి 9: నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోకి కేజీబీవీలో విద్యార్థినులకు ఫిట్‌నెస్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో ఎం. లక్ష్మి, డి. వెన్నెల, వి. కోమలిలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. స్వాతి, పీఈటీ ఎన్. లక్ష్మి, సొసైటీ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా వెంకటకేశవరావు, కొత్తూరి శివకుమార్, ఇన్నమూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని జమీన్‌ఉప్పలపాడు కేజీబీవీలో శనివారం నారీశక్తి ఫిట్‌నెస్ ప్రతినిధి నందిపాటి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 500 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి డీ మమత, రెండవ బహుమతి ఎం వైష్ణవి, మూడవ బహుమతి మైథిలి గెలుచుకున్నారు. వారికి నిర్వాహకులు టీషర్ట్‌లు, కప్‌లు, క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక కేజీబీవీలో శనివారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం (నెల్లూరు) వారి సహకారంతో నారీశక్తి వేడుకలను జరిగాయి. ఈ సందర్భంగా ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు ఫులగర శోభన్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ శారీరకంగా, మానసికంగా పూర్తి ఆరోగ్యంతో ఉండాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో జీ సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ కే సుప్రియ, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక కేజీబీవీలో శనివారం ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత్ నారీశక్తి ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్య బాలికలకు రన్నింగ్ రేస్, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు టీషర్ట్‌లు, టోపీలు అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్కే షాహిదా , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 8,65,273

వలేటివారిపాలెం, మార్చి 9 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,65,273 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,540, కుంకుమార్చన ద్వారా రూ. 24,600, తలనీలాల ద్వారా రూ. 25,925, వాహనపూజల ద్వారా రూ. 1,920, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,04,600, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 900, రూముఅద్దెల ద్వారా రూ. 26,620, కవర్లు ద్వారా రూ. 5,700, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,12,115, అన్నదానం ద్వారా రూ. 3,13,225, విరాళాల ద్వారా రూ. 42,218 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలా ?



మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, మార్చి 9: సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు చేస్తూ కించపరచేలా మాట్లాడం సరికాదని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలులోని టీడీపీ మండల కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందు నిందలు వేసి నోరు మూయించేలా చేస్తున్నారని అన్నారు. చెంచులక్ష్మీపురంలో మా తండ్రి కొనుగోలు చేసి ఇచ్చిన భూమిని కూడా ఆక్రమించుకున్నారని వైసీపీ నేతలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకటేశ్వర్లురెడ్డి, రఘురాంనాయుడు, సుధీర్‌బాబు, అంజయ్యయాదవ్, మాధవరావు, హర్ష, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

● కొత్తూరులో శంఖారావం

బోగోలు మండలం కొత్తూరు గ్రామంలో శనివారం రాత్రి శంఖారావం కార్యక్రమాన్ని మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వారు వివరించారు. కార్యక్రమంలో ఎల్ సుధీర్, జయరాజు, నరసింహారావు, హరిబాబు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కాకర్లను కలసిన సత్యవోలు నేతలు

కొండాపురం : ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం సత్యవోలు పంచాయతీ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గద్దె రామక్రిష్ణ ఆధ్వర్యంలో వారు కాకర్లను సన్మానించారు. ఆయన వెంట నాయకులు గద్దె రాఘయ్య, గోరంట్ల నరసింహులు, మందపల్లి మాధవరావు, వేణు పలువురు యువత ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం : మండలంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను కందుకూరు సెబ్ అధికారులు, సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు.ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సెబ్ సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది గ్రామ సమీపంలోని మన్నేరులో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.సీఐ వెంకటేశ్వర్లు ఈ సంఘటనపై ఫిర్యాదు చేయగా, ఎస్సై ఎం బాజీబాబు కేసు నమోదు చేశారు.

మల్లన్నకు నందివాహన సేవ

కావలిటౌన్, మార్చి9: పట్టణంలోని పాతూరులోగల శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మల్లన్నకు నందివాహన సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమం పూజలు, బలిహరణ, పల్లకి సేవలు నిర్వహించారు. సాయంత్రం తెనాలి వాస్తవ్యులు విశ్వనాథశాస్త్రి శివలీలల ప్రవచనాలు చేశారు. తెల్లవారుజామున ఒంటిగంటకు జరిగిన లింగోద్భవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి మల్లన్నకు నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.



నందివాహనంపై మల్లన్న ఊరేగింపు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

కావలి పట్టణ ముసునూరులోని హనుమత్‌క్షేత్రంలో శనివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో అర్చక స్వాములు నిర్వహించిన ఈ మహోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల తెప్పోత్సవం

బిట్రగుంట, మార్చి 9: బోగోలు మండలం నాగులవరం పంచాయతీలో వెలసి ఉన్న గంగాపార్వతీ సమేత నాగలింగేశ్వర స్వామికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ, శివపార్వతుల ఏకాంత సేవను నిర్వహించారు.



తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

లక్ష్మీనరసింహుడి సేవలో ఇంటూరి దంపతులు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామిని శనివారం కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరావు- సౌజన్య దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం నాగేశ్వరరావును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కామినేని అశోక్ తదితరులు ఉన్నారు.



మాలకొండపై స్వామివారి దర్శనానికి వెళ్తున్న నాగేశ్వరరావు దంపతులు

● మాలకొండలో బుర్రా మధుసూదన్

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామిని శనివారం కందుకూరు వైసీపీ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పరిటాల వీరాస్వామి, అనుమోల వెంకటేశ్వర్లు, కట్టా హనుమంతరావు, కుంబాల క్రాంతికుమార్, సీహెచ్ ఓబులుకొండయ్య, పీ అంజయ్య, బాపతు మాలకొండారెడ్డి ఉన్నారు.



మాలకొండపై బుర్రా మధు తదితరులు

నేడు కందుకూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, మార్చి 9: పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డులో ఆదివారం విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పలుప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్‌నగర్, మక్కా మసీదు, బూడిదపాలెం, పాత బ్యాంకు బజారు, కోటకట్ట వీధి, వెంకటనారాయణ బజారు, పెద్దబజారు, ఆర్డీవో కార్యాలయం ఎదురు, వాణినగర్, ఆర్ అండ్ బీ బంగ్లా, పెట్రోలుబంకుల ఏరియా, వాసవీనగర్, ప్రకాశం కాలనీ, రెవిన్యూ కాలనీ, సీటీఆర్ఐ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.